బుధవారం
30•10•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 124
• పేజీలు : 14 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE







# అంతులేని కథేనా?

## ఆర్టీసీకి ఇప్పటికే అదనంగా రూ.617కోట్లు ఇచ్చాం..

### కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో తేల్చిచెప్పిన రాష్ట్ర ప్రభుత్వం

- 31 శాతం వాటా ఉన్న కేంద్ర వైఖరిని ప్రశ్నించిన హైకోర్టు
- కేంద్రం తేల్చేదాకా న్యాయప్రక్రియ కొనసాగే అవకాశం
- హైకోర్టులో తేడా వస్తే సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో ప్రభుత్వం
- అయోమయంలో ఆర్టీసీ కార్మికులు
- కార్మికసంఘాల నాయకులపై వ్యక్తమవుతున్న అసంతృప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ సమస్య అంతులేని కథగానే మిగిలిపోనున్నదా..? ఇప్పటివరకు రాష్ట్రానికి మాత్రమే పరిమితమైన సమస్య.. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్ర ప్రభుత్వ కోర్టులో పడిందా? ఈ ప్రశ్నకు న్యాయనిపుణులు అవుననే అంటున్నారు. 24 రోజులుగా కొనసాగుతున్న సమ్మె వ్యవహారం ఇప్పుడిప్పుడే కొలిక్కి వచ్చేలా కనిపించడంలేదు. హైకోర్టులో ఆర్టీసీ తరపున వాదనలు వినిపించిన న్యాయవాది.. రాష్ట్ర ప్రభుత్వం పెద్దమొత్తంలో ఆర్టీసీకి నిధులు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఇవ్వలేదన్నట్టుగా వాదించిన విషయం తెలిసిందే. దీనికి ప్రతిగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి ఇప్పటివరకు రూ.617 కోట్లు అదనంగా ఇచ్చినట్టు వివరిస్తూ న్యాయస్థానంలో అఫిడవిట్ సమర్పించింది. ప్రభుత్వం అఫిడవిట్ దాఖలుచేయడం ద్వారా ఇక ఆర్టీసీకి ఇచ్చేది ఏమీలేదని తేటతెల్లంచేసినట్లయిందని విశ్లేషకులు అంటున్నారు. ఇవ్వాల్సిన దానికన్నా ఎక్కువ ఇచ్చినట్లు ప్రభుత్వం ఏకంగా అఫిడవిట్ ద్వారా స్పష్టంచేయడంతో.. యూనియన్ నాయకులు గత కొన్ని రోజులుగా చెప్తూ వస్తున్న సెప్టెంబర్, అక్టోబర్ నెల జీతాలను కూడా ఆర్టీసీ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. తాజాగా ప్రభుత్వం నిధుల విషయంలో స్పష్టతనివ్వడంతో జీతాల సమస్య ఇప్పుడిప్పుడే తేలేలా లేదని చెప్తున్నారు. హైకోర్టులో దాఖలుచేసిన అఫిడవిట్‌తో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్టీసీకి ఇంకా ఏదో రావాలన్న వాదన తేలిపోయిందని నిపుణులంటున్నారు.

**కేంద్రానికి నోటీసులు**

ఆర్టీసీని ఏర్పాటుచేసిననాడు సంస్థలో కేంద్ర ప్రభుత్వం 31 శాతం వాటా కలిగి ఉన్నది. తాజాగా రాష్ట్ర హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని కూడా ఆర్టీసీ సమ్మెపై ప్రశ్నించడంతోపాటు నోటీసులు సైతం జారీచేసింది. ఈ నోటీసులపై కేంద్ర ప్రభుత్వం తరపున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ స్పందిస్తూ.. తాను కేంద్రంతో సంప్రదించిన తర్వాత దాని వైఖరి ఏమిటన్నది చెప్పగలనని పేర్కొన్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం.. హైకోర్టు నోటీసులపై స్పందించేవరకు న్యాయప్రక్రియ కొలిక్కివచ్చేలా కనిపించడంలేదని సీనియర్ న్యాయవాది ఒకరు 'నమస్తే తెలంగాణ'తో చెప్పారు. వీటితోపాటు సమ్మెకు సంబంధించి హైకోర్టు ఏవైనా ఉత్తర్వులు ఇచ్చే పరిస్థితి ఏర్పడితే.. ఆ ఉత్తర్వులు రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యానికి నచ్చకపోతే.. ఏకీభవించని పక్షంలో ముమ్మాటికీ సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉంటుందని, ఆ వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం ఉపయోగించుకోవడం ఖాయంగా కనపడుతున్నదని కూడా న్యాయనిపుణులు చెప్తున్నారు. ఒకవేళ అదే జరిగితే.. ఈ కేసు మరింత జటిలంగా మారే అవకాశాలున్నాయని అంటున్నారు. ఇప్పటికే 24 రోజులుగా సమ్మెలో ఉన్న కార్మికులు ఉద్యోగంలో కొనసాగడమా.. సమ్మెలో కొనసాగడమా అన్నది తేల్చుకోలేక సందిగ్ధంలో ఉన్నారు. సమ్మె ఇప్పుడిప్పుడే

మిగతా 2వ పేజీలో



## ఆర్టీసీకి ఇప్పటికిప్పుడు 47 కోట్లు ఇవ్వలేం

- అన్ని ప్రాంతాలకు బస్సులు నడుపుతున్నాం
- హైకోర్టులో వాదనలు వినిపించిన ప్రభుత్వం
- ఆర్టీసీ విభజనపై వివరణ ఇవ్వండి
- కేంద్రానికి నోటీసులు జారీచేసిన హైకోర్టు
- ప్రభుత్వం ఇచ్చామంటున్న నిధులపై స్పష్టత ఇవ్వండి
- ఆర్టీసీ ఎండీకి హైకోర్టు ఆదేశాలు
- శుక్రవారానికి విచారణ వాయిదా

2

**యథావిధిగా ఆర్టీసీ సేవలు**
- రోడ్డెక్కిన 6441 బస్సులు
- సత్ఫలితాలిస్తున్న ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

7


మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్


శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే

## మహా జగడం

- ఫిఫ్టీ- ఫిఫ్టీ మాటేలేదు • ఐదేండ్లూ నేనే ముఖ్యమంత్రిని
- శివసేనకు తేల్చిచెప్పిన మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్
- తీవ్రంగా స్పందించిన శివసేన • బీజేపీతో చర్చలు రద్దు

**మహారాష్ట్రలో** ప్రభుత్వ ఏర్పాటుపై అదే సందిగ్ధత.. సీఎం పీఠంపై బీజేపీ, శివసేన మధ్య వీడని విభేదాలు.. శివసేనకు రెండున్నరేండ్లపాటు సీఎం పదవిని అప్పగిస్తామని తామెన్నడూ హామీ ఇవ్వలేదని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మంగళవారం కుండబద్దలు కొట్టారు. తదుపరి ప్రభుత్వంలో ఐదేండ్లపాటు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని తేల్చిచెప్పారు. దీనిపై శివసేన తీవ్రంగా స్పందించింది. 50-50 ఫార్ములాపై ఫడ్నవీస్ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌ను విడుదల చేసి ఆయనకు కౌంటర్ ఇచ్చింది. మంగళవారం రెండు పార్టీల మధ్య జరుగాల్సిన చర్చలను కూడా శివసేన రద్దు చేసుకుంది. మరోవైపు బీజేపీ బలపరీక్షలో విఫలమైతేనే 'ప్రత్యామ్నాయం' గురించి ఆలోచిస్తామని ఎన్సీపీ పేర్కొంది.

వివరాలు 5వ పేజీలో

## మున్సిపోల్స్‌కు సిద్ధంకండి


రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీ నాగిరెడ్డి

- హైకోర్టు ఉత్తర్వులు వెలువడగానే ఎన్నికల నిర్వహణ
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీ నాగిరెడ్డి వెల్లడి
- జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మున్సిపల్ ఎన్నికలపై ఈ నెల 31న హైకోర్టు ధర్మాసనం ఉత్తర్వులు వెలువడ్డాక.. ఏ సమయంలోనైనా ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని రాష్ట్రఎన్నికల సంఘం.. జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లకు సూచించింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని మరోసారి సరిచూసుకోవాలని, మున్సిపోల్స్ నిర్వహణకు సన్నద్ధమై ఉండాలని ఆదేశించింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీ నాగిరెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఈసీ కార్యదర్శి

మిగతా 2వ పేజీలో

## కశ్మీర్‌లో ఉగ్రవాదుల దుశ్చర్య


మంగళవారం శ్రీనగర్‌లో రాళ్లు పట్టుకున్న ఓ ఆందోళనకారుడు

- ఆరుగురు వలస కార్మికుల కాల్చివేత
- మృతులంతా పశ్చిమబెంగాల్ వాసులే
- పుల్వామాలో సీఆర్పీఎఫ్ సిబ్బందిపై ఉగ్రవాదుల కాల్పులు
- కశ్మీర్‌లో ఈయూ ఎంపీల పర్యటన ప్రారంభం
- స్వాగతం పలికిన బంద్‌లు, ఘర్షణలు
- పలుచోట్ల రాళ్లురువ్విన ఆందోళనకారులు
- పర్యటనకొచ్చిన వారంతా మితవాద పార్టీల నేతలే

5

## బగ్దాదీ వారసుడినీ హతమార్చాం

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి
- బగ్దాదీ శరీర అవశేషాలను సముద్రంలో జారవిడిచిన అమెరికా
- కుర్దిష్ ఇన్‌ఫార్మర్ తెచ్చిన బగ్దాదీ లోదుస్తుల సాయంతో డీఎన్ఏ పరీక్ష
- బగ్దాదీని తరిమిన జాగిలం చిత్రాన్ని విడుదల చేసిన ట్రంప్

5

## భారత సీఈవోలు భళా!

- టాప్-10లో శంతను, అజయ్ బంగా, సత్యనాదెళ్ల
- హార్వర్డ్ బిజినెస్ రివ్యూ జాబితాలో చోటు
- 89వ స్థానంలో డీబీఎస్ బ్యాంక్ సీఈవో పీయూష్

9



• చెక్‌బౌన్స్ కేసు

ఎంబీఎస్ జువెలర్స్ అధినేత

## సుఖేశ్‌గుప్తా అరెస్ట్

కోల్‌కతాకు తరలింపు

2






మెడికల్ కిట్ల కొనుగోలులోనూ

## గోల్‌మాల్

- ఐఎంఎస్ స్కాంలో మరో గుట్టు రట్టు
- మెడికల్ కిట్లు కొనకుండానే కొన్నట్టు రికార్డులు
- రెండు ఇండెంట్లలోనే రూ.1.76 కోట్ల అవినీతి
- డైరెక్టర్, జేడీ కార్యాలయాల సిబ్బంది పాత్రపై కొనసాగుతున్న ఏసీబీ ఆరా

2

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 71.00 | రిటైల్ లైవ్ | 93.00 |
| డ్రెస్డ్ | 135.00 | స్కిన్‌లెస్ | 153.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 393.00 | రంగారెడ్డి | 393.00 |
| మెదక్ | 393.00 | కరీంనగర్ | 396.00 |
| వరంగల్ | 396.00 | చిల్లర ధర | 4.50 |

## కొత్త సీజేఐగా బోబ్డే నియామకం!

రాష్ట్రపతి ఆమోదముద్ర

5









epaper.ntnews.com



మంగళవారం తన కార్యాలయంలో కేసీఆర్ విజ్ఞానకేంద్రం లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి, చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ తదితరులు కూడా ఉన్నారు.

## కేసీఆర్ విజ్ఞానకేంద్రం లోగో ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేసీఆర్ విజ్ఞాన కేంద్రం పేరుతో రూపొందించిన లోగోను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ నేతృత్వంలో ఈ లోగోను రూపొందించారు. కేసీఆర్ విజ్ఞాన కేంద్రం పేరుతో పెద్దపల్లి జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో మినీ గ్రంథాలయాలను ఏర్పాటు చేయనున్నారు. ఇలాంటి ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన రఘువీర్‌సింగ్‌ని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ అభినందించారు. ఇటువంటి మినీ గ్రంథాలయాలు విడుతల వారీగా జిల్లాలోని మిగిలిన అన్ని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలు, కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, మోడల్‌స్కూళ్లకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి ఉత్తర్వులను త్వరగా సవరించండి

### కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొత్తగా ఏర్పాటైన నారాయణపేట, ములుగు జిల్లాలను చేరుస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులను వీలైనంత త్వరగా సవరించాలని రాష్ట్రప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలనశాఖ సర్వీసెస్ విభాగం కేంద్రానికి లేఖ రాసింది. రాష్ట్రపతి ఉత్తర్వులకు సవరణ చేయాలని గతంలోనే రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఇప్పటికీ సవరణ చేస్తూ ఉత్తర్వులు రాకపోవడంతో రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నది. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటుచేసింది. జిల్లాల పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా కొత్త జోనల్ వ్యవస్థను రూపొందించింది. దీనికి అనుగుణంగా రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణ జరిగింది. ఈ తర్వాత ములుగు, నారాయణపేట జిల్లాలు ఏర్పాటయ్యాయి. తమ జిల్లాలను జోగుళాంబ గద్వాల జోన్ నుంచి చార్మినార్ జోన్‌కు మార్చాలనే వికారాబాద్ జిల్లా ప్రజల కోరిక మేరకు సీఎం కేసీఆర్ జోనల్ మార్పునకు హామీ ఇచ్చారు. సవరణ ఉత్తర్వులో జాప్యం వల్ల కొత్త ఉద్యోగాల నియామకాలు జరుపుకోలేకపోతున్నామని కేంద్రానికి రాసిన లేఖలో పేర్కొన్న రాష్ట్రప్రభుత్వం వెంటనే సవరణ ఉత్తర్వులు జారీచేయాలని కోరింది.



# ఆర్టీసీకి ఎక్కువే ఇచ్చాం

### 2014 నుంచి రూ.4,253 కోట్లు చెల్లించాం

ఈ బడ్జెట్ కేటాయింపుల్లో రూ.425 కోట్లు ఇప్పటికే ఇచ్చాం .. మిగతాది 2020 మార్చి వరకు ఇస్తాం

ప్రభుత్వానికి అనేక ప్రాధాన్య అంశాలు ఉన్నాయి .. ఇప్పటికిప్పుడు రూ.47 కోట్లు ఇవ్వలేం

అన్ని ప్రాంతాలకు బస్సులు నడుపుతున్నాం .. హైకోర్టులో వాదనలు వినిపించిన ప్రభుత్వం

- ఆర్టీసీ విభజనపై వివరణ ఇవ్వండి
- కేంద్రానికి హైకోర్టు నోటీసులు
- ప్రభుత్వం ఇచ్చామంటున్న నిధులపై స్పష్టత ఇవ్వండి
- ఆర్టీసీ ఎండీకి హైకోర్టు ఆదేశాలు
- శుక్రవారానికి విచారణ వాయిదా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీకి ఇవ్వాల్సిన నిధుల కంటే.. ఎక్కువ నిధులను ఇచ్చామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. 2014 నుంచి ఇప్పటివరకు రూ.4,253 కోట్లు ఆర్టీసీకి చెల్లించామని.. ఈ మొత్తం కార్మికసంఘాలు చెల్లించాలని చెప్తున్నదానికంటే చాలా ఎక్కువ అని పేర్కొన్నది. ఆర్టీసీ సమ్మెను విరమింపజేసి, ప్రజల ఇబ్బందులు తొలిగించేలా ఆదేశాలు జారీచేయాలని దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై.. హైకోర్టులో ప్రభుత్వం మంగళవారం తన వాదనలను వినిపించింది. కార్మిక సంఘాలు పేర్కొంటున్న బకాయిలపై వివరాలు తెలియజేయాలని సోమవారంనాటి విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం ఆదేశించిన నేపథ్యంలో ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి మంగళవారం ఈ మేరకు అఫిడవిట్ దాఖలుచేశారు. ఈ సందర్భంగా అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ కార్పొరేషన్‌ను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిధులు కేటాయిస్తూవచ్చిందని తెలిపారు. ఆర్టీసీకి చెల్లించిన రూ.4,253 కోట్లలో రూ.3,403 కోట్లు బడ్జెట్ ద్వారా కేటాయించిన మొత్తం కాగా.. రూ.850 కోట్లు ప్రభుత్వం గ్యారెంటీగా ఉండి ఆర్టీసీకి రుణాల రూపంలో ఇప్పించిందని చెప్పారు. ఈ దశలో జోక్యంచేసుకొన్న ధర్మాసనం.. రూ.850 కోట్లు గ్యారెంటీ ఇచ్చినంత మాత్రాన ఆ నిధులు చెల్లించినట్లు ఎలా అవుతుందని ప్రశ్నించింది. ఆ మొత్తానికి ప్రభుత్వమే బాధ్యతగా ఉన్నదని ఏజీ పేర్కొన్నారు. 2014 నాటికి ఉన్న బకాయిలు రూ.1099 కోట్ల గురించి వాదనలు వినిపిస్తూ.. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఆర్టీసీ విభజన ఇంకా జరుగలేదని తెలిపారు. ఆర్టీసీ ఆస్తులు, అప్పుల విభజన కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని.. విభజనచట్టం ప్రకారం తెలంగాణ 42శాతం, ఏపీ 58శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అంశంపై ఇంకా స్పష్టత రాలేదని వివరించారు. కార్మిక సంఘాలు ప్రభుత్వం నుంచి రావాలని పేర్కొంటున్న రూ.1,375 కోట్లు, జీహెచ్‌ఎంసీ నుంచి రావాలని పేర్కొంటున్న రూ.1,492 కోట్లు కలిపినా ప్రభుత్వం ఇచ్చినదానికంటే తక్కువేనని ఏజీ తెలిపారు. వాస్తవానికి జీహెచ్‌ఎంసీ రూ.335 కోట్లు చెల్లించిందని, మిగిలిన నిధులను ప్రభుత్వమే ఇచ్చిందని చెప్పారు. ఈ దశలో స్పందించిన ధర్మాసనం.. ప్రభుత్వం ఇచ్చినదాని గురించి తాము అడుగటంలేదని.. చెల్లించాల్సిన బకాయిల గురించి మాత్రమే అడుగుతున్నామని పేర్కొన్నది. చెల్లించాల్సిన బకాయిలను బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో ఎలా పోలుస్తారని అడిగింది. దీనికి ఏజీ సమాధానమిస్తూ.. ఆర్టీసీకి ఇవ్వాల్సిన బకాయిలు, ఆర్థికసాయం అన్నింటికీ కలిపే బడ్జెట్ ద్వారా నిధులను కేటాయిస్తున్నామని వివరించారు.

#### మార్కెట్‌లో మాంద్యం

ఆర్టీసీ కార్మిక సంఘాల నాలుగు డిమాండ్లకు సంబంధించి రూ.47 కోట్లు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారా? లేదా? అన్న హైకోర్టు ప్రశ్నకు ఏజీ వాదనలు వినిపిస్తూ.. ఇప్పటికిప్పుడు రూ.47 కోట్లు చెల్లించే పరిస్థితి లేదని, దశలవారీగా మాత్రమే ఇవ్వగలమని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో ఆర్థికమాంద్యం కొనసాగుతున్నదని, ప్రభుత్వం కూడా తన బడ్జెట్‌ను రూ.1.82 లక్షల కోట్ల నుంచి రూ.1.46 లక్షల కోట్లకు తగ్గించుకున్నదన్నారు. విద్య, వైద్యం, ఇతర అత్యవసర సంక్షేమ కార్యక్రమాలకు నిధులు కేటాయించాల్సి ఉన్నదని వివరించారు. 2019-20 ఆర్థిక సంవత్సరానికి ఆర్టీసీకి బడ్జెట్‌లో రూ.550 కోట్లు కేటాయించగా ఇప్పటికే రూ.425 కోట్లు చెల్లించామని.. మిగతా మొత్తాన్ని 2020 మార్చినాటికి చెల్లిస్తామని వెల్లడించారు. ఈ దశలో జోక్యం చేసుకొన్న ధర్మాసనం.. హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించగలిగినప్పుడు మొత్తం రాష్ట్రంలోని ప్రయాణికుల కోసం రూ.47 కోట్లు చెల్లించలేరా? అని ప్రశ్నించింది. నిధుల కేటాయింపులపై ప్రశ్నించే అధికారం తమకు లేకపోయినప్పటికీ, ప్రజల కోణంలో అడుగుతున్నామని పేర్కొన్నది. దీనికి ఏజీ సమాధానమిస్తూ.. ప్రభుత్వానికి ప్రాధాన్య అంశాలు వేర్వేరుగా ఉంటాయని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని మారుమూల, పట్టణ ప్రాంతాలకు బస్సులు నడుపుతున్నామని ఏజీ చెప్పారు. రోజుకు సగటున ఏడువేలకుపైగా బస్సులు తిప్పుతున్నామని వివరించారు. అద్దె బస్సుల సంఖ్యను పెంచడానికి చర్యలు తీసుకొంటున్నామన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.



#### కేంద్రానికి నోటీసులు

ఆర్టీసీ ఆస్తులు, అప్పుల విభజన అంశంపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులిచ్చింది. విభజనపై గత ఐదేండ్లుగా ఏం చర్యలు తీసుకున్నారో తెలుపాలని ఆదేశించింది. దీంతోపాటు ఆర్టీసీలో కేంద్రానికి 31 శాతం వాటా ఉన్న నేపథ్యంలో సమ్మెపై కేంద్రం తన అభిప్రాయాన్ని తెలుపాలని స్పష్టంచేసింది.

#### ప్రభుత్వ చెల్లింపులపై స్పష్టత ఇవ్వండి

ప్రభుత్వం చెల్లించామని చెప్తున్న నిధులపై స్పష్టత ఇవ్వాలని ఆర్టీసీ ఎండీకి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. జీహెచ్‌ఎంసీ ఆర్టీసీకి ఎంత ఇవ్వాలి? రూ.335 కోట్ల చెల్లింపులుచేసిన అంశంతోపాటు ప్రభుత్వం చెల్లించామని చెప్తున్న అంశాలన్నింటినీ ఆర్టీసీ యాజమాన్యం (ఎండీ) అంగీకరిస్తున్నదా? అన్న అంశాలపై గురువారానికల్లా అఫిడవిట్ సమర్పించాలని ధర్మాసనం పేర్కొన్నది. విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. విచారణకు ఆర్టీసీ ఇంచార్జి ఎండీ, ఆర్థిక వ్యవహారాలు చూసే ఉన్నతాధికారులు రావాలని పేర్కొన్నది.

#### ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్నారు..

కార్మికులు, వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని, కొంతమంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది పీవీ కృష్ణయ్య ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. కార్మికులు సమ్మెను విరమించి విధుల్లో చేరేలా, ప్రజలకు ఇబ్బందులు రాకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది కృష్ణయ్యపై ధర్మాసనం వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేసింది. ఊసరవెల్లి కంటే వేగంగా రంగులు మారుస్తున్నారని వ్యాఖ్యానించింది. ఒకవైపు సమ్మె చట్టవిరుద్ధమని ఆదేశించాలని చెప్తున్నారని, మరోవైపు కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారంటున్నారని, మీరు ఎవరి తరఫున వాదిస్తున్నారో స్పష్టత తెచ్చుకోవాలని పేర్కొన్నది.

## ఐఐటీ హైదరాబాద్‌లో విద్యార్థి ఆత్మహత్య

- హాస్టల్ భవనం మూడో అంతస్తు నుంచి దూకి బలవన్మరణం
- చదువులో రాణించలేకపోతున్నానని మనస్తాపం



పీ సిద్దార్థ (ఫైల్)

**కంది:** చదువులో రాణించలేకపోతున్నాననే మనస్తాపంతో ఐఐటీ హైదరాబాద్ విద్యార్థి పీ సిద్దార్థ (20) మంగళవారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నాడు. సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లోని హాస్టల్ భవనం మూడో అంతస్తు పైనుంచి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. 'ఎండింగ్ మై లైఫ్' అంటూ చివరగా స్నేహితుడికి మెసేజ్ చేశాడు. హైదరాబాద్ నిజాంపేట వాసి సిద్దార్థ ఐఐటీ హైదరాబాద్‌లో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. అనుకున్నస్థాయిలో చదువులో రాణించకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. హాస్టల్ భవనం మూడో అంతస్తు పైనుంచి కిందకు దూకాడు. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది, తోటి విద్యార్థులు స్థానిక దవాఖానకు, అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. సిద్దార్థ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

#### 'నా బతుక్కు ముగింపునిస్తున్నా'..

స్నేహితుడికి మెయిల్ ద్వారా సూసైడ్ నోట్ మెసేజ్ చేశాడు. 'నా బతుక్కు ముగింపునిస్తున్నా (ఎండింగ్ మై లైఫ్). 20 ఏండ్లలో ఎన్నో విషయాలు తెలుసుకున్నా. కానీ, ఏదీ అంతగా ఆసక్తి అనిపించలేదు. నా జీవితానికి ముగింపు ఇవ్వాలని అనుకుంటున్నా. ప్రధానంగా చదువులో వెనుకబడి ఉన్నానని అనిపిస్తుంది. ఇతర విషయాల్లోనూ వెనుకబడి ఉన్నాననే భావన కలుగుతున్నది. ఏదైనప్పటికీ నా చావు ఈ ప్రపంచానికి పెద్ద తేడా తీసుకురాదని అనుకుంటున్నా' అని మెసేజ్ పంపాడు.

#### నిజాంపేటలో విషాదఛాయలు

**దుండిగల్ / జీడిమెట్ల, నమస్తే తెలంగాణ:** సిద్దార్థ మృతితో నిజాంపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన శ్రీనివాస్, శ్రీదేవి దంపతుల కుటుంబం 15 ఏండ్ల కిందట వచ్చి నిజాంపేటలో ఈశ్వర్ విల్లాస్‌లో ఉంటున్నది. పెద్ద కుమారుడు సిద్దార్థ వీసా రెన్యూవల్ కోసం కుటుంబసభ్యులంతా కలిసి మంగళవారం సాయంత్రం ముంబయికి వెళ్లేందుకు విమాన టికెట్లు కూడా బుక్ చేసుకున్నట్టు బంధువులు తెలిపారు. కానీ, ఇంతలోనే సిద్దార్థ విగతజీవిగా ఇంటికి చేరడం కుటుంబసభ్యులను శోకసంద్రంలో ముంచింది.

## ఐఏఎస్ అధికారి సుదర్శన్‌రెడ్డిని రిలీవ్ చేసిన కేంద్రం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉమ్మడి రాష్ట్రంలో కేంద్ర సర్వీసులకు వెళ్లిన తెలంగాణ క్యాడర్ 2002 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సీ సుదర్శన్‌రెడ్డిని కేంద్ర ప్రభుత్వం రిలీవ్ చేసింది. వెంటనే సొంత రాష్ట్రంలో రిపోర్ట్ చేయాలని మంగళవారం కేంద్ర డీవోపీటీ ఆదేశించింది. ఇప్పటివరకు సుదర్శన్‌రెడ్డి కేంద్ర సర్వీసులో రక్షణ మంత్రిత్వశాఖలో పనిచేశారు.

# అంతులేని కథేనా?

మొదటిపేజీ తరువాయి...

ముగించే అవకాశం కనిపించకపోవడంతో కార్మికులు తమ నాయకులపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఉద్యమాలు చేయడమే కాదు.. వాటిని ముగించడంపై స్పష్టత లేకపోవడంతోనే సమస్య ఎదురైందని, ఇంకెంతకాలం ఇలా ఉండాలని పలువురు కార్మికులు మీడియాతో తమ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జీవితంలో తాము ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోలేదని, ఉద్యోగంలో చేరాలనుకుంటే యూనియన్ల నాయకులు చేరనివ్వడంలేదని, తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని చెప్తున్నారు. ఆర్టీసీ అంతులేని కథలా సాగుతున్నదని.. ఇంకెంతకాలం కొనసాగుతుందో తెలియని పరిస్థితి ఉందని ఆందోళనచెందుతున్నారు.

**ముహూర్తం**

సూర్యోదయం: 6.14 గంటలకు

సూర్యాస్తమయం: 5.41 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తదియ అర్ధరాత్రి 2.01 వరకు, తదుపరి చతుర్థి, నక్షత్రం: అనురాధ రాత్రి 9.58 వరకు, తదుపరి జ్యేష్ఠ, అమృతఘడియలు: మధ్యాహ్నం 12.05 నుంచి 1.37 వరకు, రాహుకాలం: ఉదయం 11.58 నుంచి మధ్యాహ్నం 1.24 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.35 నుంచి మధ్యాహ్నం 12.21 వరకు, వర్జ్యం: గురువారం తె.జా. 3.28 నుంచి ఉదయం 5.02 వరకు.

## మున్సిపోల్స్‌కు సిద్ధంకండి

మొదటిపేజీ తరువాయి...

ఎం అశోక్‌కుమార్, సీడీఎంఏ కమిషనర్ శ్రీదేవి పాల్గొన్నారు. న్యాయస్థానం ఉత్తర్వులకు అనుగుణంగా ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు సిద్ధం కావాలని ఎస్‌ఈసీ నాగిరెడ్డి సూచించారు. హైకోర్టు తీర్పు వచ్చాక మరోసారి భేటీ అయి తదుపరి చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించినట్టు సమాచారం. రాష్ట్రంలో 9 మున్సిపల్ కార్పొరేషన్లు, 120 మున్సిపాలిటీల్లో ఎన్నికల నిర్వహణకు ఎస్‌ఈసీ ఏర్పాట్లు చేస్తున్నది. మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో కలిపి 79,92,434 మంది ఓటర్లు ఉన్నట్టు ప్రకటించింది. మొత్తం 3,103 వార్డుల్లో 9,056 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయడంతోపాటు, ప్రతి 800 మందికి ఒక పోలింగ్ కేంద్రం ఉంటుందని నాగిరెడ్డి వెల్లడించారు. మీర్‌పేట కార్పొరేషన్‌లో వార్డుల విభజన జరుగని కారణంగా అక్కడ ఎన్నికలు నిర్వహించడం లేదు.

కాగా, ఇటీవలే అసెంబ్లీ ఉప ఎన్నికలు జరిగిన నేపథ్యంలో హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్లకు ఎడమచేతి మధ్య వేలిపై సిరా చుక్కా వేయాలని నిర్ణయించారు.

## 2,788 మంది ఉపాధ్యాయుల నియామకం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని పాఠశాల విద్యాశాఖలో టీఆర్టీ (ఎస్జీటీ తెలుగు) నియామకం ద్వారా ఎంపిక చేసిన 3,127 మందిలో 2,822 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారంరోజులు నిర్వహించిన కౌన్సెలింగ్ అనంతరం 2,788 మందికి నియామక ఉత్తర్వులు జారీచేసినట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ తెలిపారు. టీఆర్టీలో ఎంపికైనవారిలో 34 మంది ఉపాధ్యాయ కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదని తెలిపారు.

# మెడికల్ కిట్ల గోల్‌మాల్

- ఐఎంఎస్ స్కాంలో మరో గుట్టు రట్టు
- మెడికల్ కిట్లు కొనకుండానే కొన్నట్లు రికార్డులు
- రెండు ఇండెంట్లలోనే రూ.1.76 కోట్ల అవినీతి
- డైరెక్టర్, జేడీ కార్యాలయాల సిబ్బంది పాత్రపై కొనసాగుతున్న ఏసీబీ ఆరా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఐఎంఎస్ (ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్) కుంభకోణంలో రోజుకో చీకటికోణం వెలుగుచూస్తున్నది. ఐఎంఎస్ అధికారులు బరితెగించి అప్పనంగా ప్రజల సొమ్మును కొల్లగొట్టిన తీరును ఏసీబీ అధికారులు పూసగుచ్చుతున్నారు. కొనని మందులకు ఇండెంట్లు సృష్టించి కోట్ల రూపాయలను దోచుకున్న ఐఎంఎస్ డైరెక్టర్ డాక్టర్ దేవికారాణి, ఆమెతో అంటకాగిన సిబ్బంది గుట్టుమట్లు ఒక్కొక్కటిగా విప్పుతున్నారు. తాజాగా మెడికల్ కిట్ల స్కాం బయటపడింది. బడ్జెట్‌లో కేటాయించిన నిధులను నొక్కేసిన వైనం అధికారులను సైతం విస్మయానికి గురిచేస్తున్నది. మెడికల్ కిట్ల కోసం 2017-18లో రూ.60 కోట్ల బడ్జెట్‌ను కేటాయించారు. ఇందుకు సంబంధించి 22 ఇండెంట్లు పెట్టి మెడికల్ కిట్లు కొన్నట్లు రికార్డుల్లో నమోదైంది. కానీ, మెడికల్ కిట్లు కొనకుండానే రికార్డులు సృష్టించి నిధులు పక్కదారి పట్టించినట్లు ఏసీబీ అధికారులకు ప్రాథమిక సమాచారం అందింది. దీనిపై లోతైన దర్యాప్తుచేపట్టిన ఏసీబీ అధికారులకు ఆశ్చర్యకరమైన నిజాలు తెలిశాయి.

#### రెండు ఇండెంట్లలోనే రూ.కోటి అవినీతి

2017-18 సంవత్సరంలో ఐఎంఎస్ పెట్టిన 22 ఇండెంట్లలో రెండింటిని పరిశీలిస్తేనే కోటి రూపాయలకు పైగా అవినీతి బయటపడింది. ఎయిడ్స్‌ను నిర్ధరించే హెచ్‌ఐవీ, మధుమేహం, డెంగీ, మలేరియా, కొలెస్ట్రాల్, తెల్ల రక్తకణాల సంఖ్య తెలుసుకోవడం, గర్భ నిర్ధారణ, లిపిడ్ ప్రొఫైల్‌తోపాటు మొత్తం 50 రకాల డయాగ్నస్టిక్స్ కోసం రాష్ట్రంలోని అన్ని ఈఎస్‌ఐ దవాఖానలకు ప్రభుత్వం మెడికల్ కిట్లను సరఫరాచేస్తుంది. వీటిలో వేల రూపాయల ఖరీదైన కిట్లు సైతం ఉంటాయి. ఒకేసారి పెద్ద మొత్తంలో సొమ్ములు దండుకొనేందుకు ఐఎంఎస్ డైరెక్టర్ దేవికారాణి, జేడీ పద్మ.. తదితరులు ఈ కిట్ల బడ్జెట్‌పై కన్నేశారు. ఐఎంఎస్ స్కాంను విచారిస్తున్న ఏసీబీ అధికారులు తమ దర్యాప్తులో భాగంగా మొత్తం 22 ఇండెంట్లలో మొదట రెండు ఇండెంట్లను (వీటి విలువ రూ.6 కోట్లు) పరిశీలించారు. వీటిలో ఇతరత్రా అనేక రకాల కిట్లు ఉన్నా.. ప్రాథమికంగా హెచ్‌ఐవీ నిర్ధరణ పరీక్ష కిట్ల కొనుగోలు వ్యవహారాన్ని తరచిచూశారు. ఒక్కొక్క కిట్టు రూ.17,600 చొప్పున మొత్తం వెయ్యి హెచ్‌ఐవీ నిర్ధరణ కిట్లను రూ.1.76 కోట్లకు కొన్నట్లు రికార్డుల్లో చూపించి వాటిని కాజేశారు. ఇంతకుముందే 583 కిట్లకు సంబంధించి రూ.1.02 కోట్లను కాజేసినట్లు ఏసీబీ అధికారులు ఆధారాలను సేకరించారు. వీటిని ఐడీఏ బొల్లారం, కాటేదాన్, శభాష్‌పల్లి, సదాశివపేట, బొంతపల్లి, చర్లపల్లి, జహీరాబాద్‌తోపాటు మరో 40 డిస్పెన్సరీలకు చేరవేసినట్లు రికార్డులు సృష్టించారని ఏసీబీ దర్యాప్తులో బయటపడింది.

### అడ్డగోలుగా ఓమ్నిమెడీకి అప్పగింత



**మెడికల్** కిట్ల కొనుగోలులో ఐఎంఎస్ అధికారులు నిబంధనలను పట్టించుకోలేదు. రూ. కోట్ల విలువ చేసే మెడికల్ కిట్ల కొనుగోలును ఓమ్నిమెడీ కంపెనీకే కట్టబెట్టారు. ఐఎంఎస్ డైరెక్టర్ దేవికారాణి, జేడీ పద్మ, డైరెక్టరేట్, జేడీ కార్యాలయాల సిబ్బందికి ఈ మొత్తం వ్యవహారంలో భాగమున్నట్టు అధికారులు గుర్తించారు. ఓమ్ని మెడీ ఎండీ శ్రీహరిబాబు అలియాస్ బాబ్జితో కుమ్మక్కై నిబంధనలకు విరుద్ధంగా మందులు కొనుగోలుచేసినట్టు ఇండెంట్లు సృష్టించినట్టు తెలిసింది.

#### మాట వినకపోతే సిబ్బందిపై వేధింపులు

వాస్తవానికి మందులు, మెడికల్ కిట్లకు సంబంధించి ఆయా డిస్పెన్సరీల నుంచి అవసరమైన ఇండెంట్లు రావాల్సి ఉంటుంది. కానీ అందుకు భిన్నంగా డైరెక్టరేట్, జేడీ కార్యాలయాల్లోనే ఫలానా డిస్పెన్సరీకి ఫలానా మందులు, కిట్లు అవసరమున్నాయని ఇండెంట్లు తయారుచేసుకునేవాళ్లు. ఈ ఇండెంట్లను ఓమ్నిమెడీలో రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్న నాగరాజు.. ఎండీ శ్రీహరిబాబు అలియాస్ బాబ్జీ తరఫున అధికారుల దగ్గరకు స్వయంగా వెళ్లి సంతకాల వ్యవహారం చక్కబెట్టేవాడు. ఐఎంఎస్ డైరెక్టరేట్ అధికారుల తెంపరితనం ఎంతవరకు పోయిందంటే.. మందులు, మెడికల్ కిట్లు తమకు అందకపోయినా, డిస్పెన్సరీలకు వచ్చినట్టుగా సంతకాలు పెట్టాలని డిస్పెన్సరీల సిబ్బందిని ఒత్తిడి చేసేవాళ్లు. ఎవరైనా మాట వినకపోతే వాళ్లపై బదిలీ, ఇతర వేధింపులకు దిగేవారని ఏసీబీ విచారణలో కొన్ని డిస్పెన్సరీల సిబ్బంది తెలియజేసినట్టు సమాచారం. మరికొన్నిసార్లు డిస్పెన్సరీల సిబ్బందిని సమావేశాల పేరిట డైరెక్టరేట్ కార్యాలయానికి పిలిపించి ఖాళీ ఇండెంట్లపై సంతకాలు పెట్టించుకునేవాళ్లని, తర్వాత వారికి నచ్చిన విధంగా రాసుకునేవారని తెలిసింది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టు అయిన ఐఎంఎస్ డైరెక్టర్ దేవికారాణి, వరంగల్ జేడీ పద్మతోపాటు ఐఎంఎస్ డైరెక్టరేట్‌లోని మరికొందరు సిబ్బంది కీలకంగా వ్యవహరించినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు.

### లోకం పోకడ




నిన్న డిసెంబర్ వరకు ఆపి ఎక్కువ ఖర్చు పెట్టించదల్చుకోలేదండీ.. ఆ బంగారం షాపింగేదో ఇప్పుడే చేద్దాం పదండి!

## చీటింగ్ కేసులో బీజేపీ నేతల అరెస్టు

- రిమాండ్‌కు తరలింపు, పరారీలో ప్రధాన ముద్దాయి కృష్ణకిశోర్
- కేంద్ర ప్రభుత్వ నామినేటెడ్ పదవి ఇప్పిస్తామంటూ రూ.2 కోట్లు వసూలు

**రంగారెడ్డి, నమస్తే తెలంగాణ:** కేంద్ర ప్రభుత్వ నామినేటెడ్ పదవి ఇప్పిస్తానని ఓ మహిళ నుంచి పెద్ద మొత్తంలో డబ్బు తీసుకొని మోసం చేసిన కేసులో ఇద్దరు బీజేపీ నేతలను సరూర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. చంపాపేటకు చెందిన తాళ్ల ప్రవర్ణారెడ్డికి నామినేటెడ్ పదవి ఇప్పిస్తామంటూ చంపాపేటకు చెందిన 'కారా' సభ్యుడు రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి నమ్మబలికారు. ఇందులో భాగంగా ఢిల్లీకి తీసుకెళ్లి కృష్ణకిశోర్ అనే చిత్తూరుకు చెందిన బీజేపీ నేతను పరిచయం చేశారు. నామినేటెడ్ పదవి ఇప్పిస్తామంటూ ప్రవర్ణారెడ్డి నుంచి 2016లో దశలవారీగా రూ.2.17 కోట్లు తీసుకొన్నారు. నెలలు గడుస్తున్నా నామినేటెడ్ పదవి ఇప్పించకపోగా ముగ్గురూ తప్పించుకు తిరుగుతున్నారు. దీంతో విసిగిపోయిన ప్రవర్ణారెడ్డి తనకు పదవి ఇప్పిస్తానంటూ డబ్బు తీసుకొని మోసం చేశారని మొత్తం తొమ్మిది మందిపై సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. తర్వాత కోర్టును కూడా ఆశ్రయించడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేయాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. దాంతో సరూర్‌నగర్ పోలీసులు బీజేపీ నేతలు కృష్ణకిషోర్, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిపై చీటింగ్ కేసు నమోదుచేసి గాలింపు చేపట్టారు. కాగా, మంగళవారం రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రధాన ముద్దాయి కృష్ణకిశోర్ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

## టీపీసీసీ అధ్యక్ష పదవికి ఉత్తమ్ గుడ్‌బై?

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్ణయించుకున్నట్టు తెలిసింది. రాజీనామా నిర్ణయాన్ని ఢిల్లీలోని ఏఐసీసీ నేతలకు తెలిపినట్టు సమాచారం. టీపీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్ అనుసరించిన వైఖరితోనే అసెంబ్లీ, స్థానికసంస్థలు, పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరంగా ఓటమి పాలైందని ఆ పార్టీ నేతల అభిప్రాయం. అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ వీడుతున్నా.. వారిని అడ్డుకోవడంలో విఫలమయ్యారని, టీపీసీసీ అధ్యక్ష పదవినుంచి తప్పుకోవాలని పార్టీవర్గాల నుంచి డిమాండ్ వినిపించింది. కానీ, అధిష్ఠానం మాత్రం ఉత్తమ్‌నే అధ్యక్షుడిగా కొనసాగిస్తూ వచ్చింది. సొంత నియోజకవర్గం హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో పట్టుపట్టి తన భార్యకు ఎమ్మెల్యే టికెట్ ఇప్పించుకున్నప్పటికీ గెలిపించుకోలేకపోయారు. భారీ మెజార్టీతో ఓటమి పాలవడంతో తప్పనిసరి పరిస్థితిలో టీపీసీసీ పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. ఇదిలా ఉంటే.. పార్టీలోని కొందరు నేతలు ఉత్తమ్ రాజీనామా చేశారని, మరికొందరు చేయలేదని పేర్కొంటున్నారు.

## ఎంబీఎస్ జువెలర్స్ ఎండీ సుఖేశ్‌గుప్తా అరెస్ట్

- చెక్‌బౌన్స్ కేసులో కోల్‌కతాకు తరలింపు



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఎంబీఎస్ జువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ సుఖేశ్‌గుప్తాను సుల్తాన్‌బజార్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు ఇక్కడి పోలీసులు ఆయనను కోల్‌కతాకు తరలించారు. ఆభరణాల వ్యాపారం చేసే సుఖేశ్‌గుప్తా.. రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా నిర్వహిస్తున్నాడు. కోల్‌కతాకు చెందిన ఎస్‌ఆర్‌ఈఐ ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్ లిమిటెడ్ నుంచి ఆషీ రియల్టర్స్ మేనేజింగ్ పార్టనర్‌గా ఉన్న సుఖేశ్‌గుప్తా రుణం తీసుకొన్నాడు. రుణాన్ని తిరిగి చెల్లించకపోవడం, చెల్లింపుల కోసం ఇచ్చిన చెక్కులు బౌన్స్ కావడంతో రుణం ఇచ్చిన సంస్థ కోల్‌కతాలో కోర్టును ఆశ్రయించింది. అప్పటి నుంచి ఫైనాన్స్ సంస్థ, సుఖేశ్‌గుప్తా మధ్య కోర్టులో కేసు విచారణ జరుగుతున్నది. ఈ క్రమంలో సుఖేశ్‌గుప్తా కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవడంతో కోల్‌కతా 11వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. అరెస్ట్ వారెంట్‌ను అమలుచేయాలని హైదరాబాద్‌లోని సుల్తాన్‌బజార్ పోలీసులను ఆదేశించింది. దీంతో సుల్తాన్‌బజార్ పోలీసులు అతడిని మంగళవారం అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం ట్రాన్సిట్ వారెంట్‌పై కోల్‌కతాకు తరలించారు.



చినజీయర్‌స్వామి అందించిన 'సత్య సంకల్ప' పుస్తకాన్ని పరిశీలిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ దంపతులు

# తిరునక్షత్ర మహోత్సవంలో గవర్నర్ దంపతులు

- తమిళిసై సౌందర్‌రాజన్‌ను ఆశీర్వదించిన చినజీయర్‌స్వామి

**శంషాబాద్:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్‌లో గల శ్రీరామనగరంలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి తిరునక్షత్ర మహోత్సవం రెండోరోజు మంగళవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు హాజరైన గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ దంపతులకు ఆశ్రమ అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ దంపతులు చినజీయర్‌స్వామి ఆశీస్సులు పొందారు. ఆశ్రమ ఆధ్యాత్మిక, ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా స్వామీజీ వారికి వివరించారు. అనంతరం చినజీయర్‌స్వామి దివ్యసాకేతంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.






# అభివృద్ధికి అడుగులు

- 1న హుజూర్‌నగర్‌లో మంత్రి కేటీఆర్ పర్యటన
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు
- సీఎం కేసీఆర్ హామీల అమలుకు రూట్‌మ్యాప్
- అధికారులతో సమీక్షించిన మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే శానంపూడి



మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఆర్‌ఎస్కేవీ అధ్యక్షుడు రాంబాబుయాదవ్. చిత్రంలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.



హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పురపాలకశాఖమంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షిస్తున్న విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే సైదిరెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి రూట్ మ్యాప్ సిద్ధమయింది. హుజూర్‌నగర్ ఉపఎన్నికలో విజ యం సాధించాక నిర్వహించిన కృతజ్ఞతా సభ లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ఇచ్చిన హామీల అమలుపై మంత్రి జగదీశ్‌రెడ్డి కసరత్తు పూర్తిచేశారు. నవంబర్ 1న పురపాలకశాఖ మంత్రి కేటీఆర్‌తో హుజూర్‌నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటీల్లో రహదారులు, డ్రైనేజీల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని, ఇందుకోసం అన్నిఏర్పాట్లుచేయాలని జగదీశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డితో కలిసి మంగళవారం హైదరాబాద్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాధాన్య అంశాలవారీగా సమస్యలను గుర్తించడంతోపాటు, త్వరితగతిన అభివృద్ధి జరిగేలా అంచనాలు రూపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో రహదారులు, డ్రైనేజీ పనులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మిషన్‌భగీరథ పనులు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో పైప్‌లైన్ పనులు పూర్తయ్యాకే అంతర్గత రహదారుల నిర్మాణాన్ని చేపట్టాలని తెలిపారు. నియోజకవర్గకేంద్రమైన హుజూర్‌నగర్‌లో దుమ్ముధూళితో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి మంత్రి దృష్టికి తీసుకురావడంతో ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ 1న పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ పర్యటన కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. హుజూర్‌నగర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి మట్టపల్లి క్రాస్ రోడ్ వద్ద ఉన్న వెంకటేశ్వరస్వామి దేవాలయం, పొట్టిశ్రీరాములు సెంటర్ నుంచి లింగగిరి రోడ్, గాంధీపార్క్ నుంచి గోవిందాపురం వరకు రహదారుల నిర్మాణం, సైడ్‌లైన్ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలోనూ సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. కొత్తగా నిర్మించతలపెట్టిన డ్రైనేజీ నిర్మాణాలపై నిపుణుల సలహాలు తీసుకోవాలని, సీసీ రోడ్ల నిర్మాణంలో ఆధునిక పరిజ్ఞానం వినియోగించుకోవాలని మంత్రి జగదీశ్‌రెడ్డి అధికారులకు సూచించారు. సమావేశంలో డీఆర్వో చంద్రయ్య, డీఆర్డీవో పీడీ కిరణ్‌కుమార్, హుజూర్‌నగర్ నగర పంచాయతీ కమిషనర్, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి కేటీఆర్‌ను కలిసిన టీఆర్‌ఎస్కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు

హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో టీఆర్‌ఎస్ ఘన విజయం సాధించిన సందర్భంగా టీఆర్‌ఎస్కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ మంగళవారం పురపాలకశాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఉప ఎన్నికలో టీఆర్‌ఎస్కేవీ నాయకత్వం, కార్మికులు, ఉద్యోగులు చేసిన కృషిని కేటీఆర్ కొనియాడారు. మంత్రిని కలిసినవారిలో హుజూర్‌నగర్ ఉప ఎన్నికల ఇంచార్జి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

## నేడు ఎమ్మెల్యే శానంపూడి ప్రమాణం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇటీవల జరిగిన ఉపఎన్నికలో హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన శానంపూడి సైదిరెడ్డి బుధవారం ప్రమాణం చేయనున్నారు. స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి సాయంత్రం 4గంటలకు అసెంబ్లీలోని తన చాంబర్‌లో సైదిరెడ్డితో ప్రమాణం చేయిస్తారు.

## రెవెన్యూ డివిజన్‌గా హుజూర్‌నగర్

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హుజూర్‌నగర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేసింది. సూర్యాపేట రెవెన్యూ డివిజన్‌లోని మూడు, కోదాడ రెవెన్యూ డివిజన్‌లోని నాలుగు మండలాలను కలిపి హుజూర్‌నగర్ రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటుచేయనున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని హుజూర్‌నగర్, మఠంపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం (మల్లారెడ్డిగూడెం), గరిడేపల్లి, పాలకవీడు, నేరేడుచర్ల మండలాలు ఈ రెవెన్యూ డివిజన్ పరిధిలోకి రానున్నాయి. కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై అభ్యంతరాలు, సూచనల స్వీకరణకు 30 రోజుల గడువు పేర్కొంటూ రెవెన్యూశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.



సిద్ధార్థ్‌ను అభినందిస్తూ ఉద్యోగ నియామకపత్రాన్ని అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

## అతి చిన్నవయసులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం!

- సిద్ధార్థ్‌ను అభినందించిన విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**మణికొండ, నమస్తే తెలంగాణ:** ఆసియాలోనే అతిచిన్న వయసులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని సంపాదించిన పిల్లి సిద్ధార్థ్‌ను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో నివాసముంటున్న పిల్లి రాజ్‌కుమార్, ప్రియ దంపతుల కుమారుడు 12 సంవత్సరాల సిద్ధార్థ్ మొదటి నుంచీ చదువులో దిట్ట. మణికొండలోని శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్నాడు. కంప్యూటర్ విద్యలో అతని ప్రతిభ, ఉత్సాహాన్ని గమనించిన క్యాప్‌జెమినీ సంస్థ ప్రతినిధులు తమ సాఫ్ట్‌వేర్ సంస్థలో డేటా సైంటిస్టుగా సిద్ధార్థ్‌ను నియమించారు. అతని చదువుకు అవసరమైన ఖర్చులను భరిస్తూ ఉద్యోగాన్ని అప్పగించారు. ప్రతినెలా రూ.25 వేల వేతనం చెల్లించేందుకు ఒప్పందం కుదిరినట్టు సిద్ధార్థ్ తల్లితండ్రులు తెలిపారు. తమ కుమారుడితో కలిసి మంత్రి సబితా ఇంద్రారెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యోగ నియామకపత్రాన్ని మంత్రి చేతులమీదుగా తీసుకున్నారు. చిన్నారి సిద్ధార్థ్‌కు మంచి భవిష్యత్తు ఉన్నదని, అతిచిన్న వయసులో ఉద్యోగం సాధించడం అభినందనీయమని మంత్రి సబితారెడ్డి కొనియాడారని మణికొండ మున్సిపాలిటీ టీఆర్‌ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు దిలీప్ తెలిపారు.

## జూనియర్ కాలేజీల్లో కౌన్సెలర్లు

- 404 కాలేజీల్లో ఎంపిక పూర్తి
- వచ్చేవారంలో సైకాలజిస్టులతో ప్రత్యేక శిక్షణ
- వచ్చే ఏడాది నుంచి ప్రైవేట్‌లోనూ తప్పనిసరి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థుల ఆత్మహత్యలను నివారించడంపై ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మొత్తం 404 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో కౌన్సెలర్లను నియమించే ప్రక్రియను దాదాపు పూర్తిచేశారు. వచ్చే ఏడాది నుంచి ప్రైవేట్ జూనియర్ కాలేజీల్లోనూ కౌన్సిలర్లను తప్పనిసరిగా నియమించాలని ఇంటర్ విద్యాశాఖ ఆదేశాలు జారీకి సిద్ధమైంది. నానాటికి పెరిగిపోతున్న ఒత్తిడిని తట్టుకోలేక పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో మానసిక ఒత్తిడి నుంచి విద్యార్థులు బయటపడేందుకు కౌన్సెలర్ల ద్వారా కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు. స్ట్రెస్ మేనేజ్‌మెంట్, చదువులో మెళకువలు, పరీక్షలకు సన్నద్ధమయ్యే విధానం, ప్రేరణ కల్గించడం, జ్ఞాపకశక్తిని పెంపొందించుకొనే విధానం వంటి మొత్తం ఐదుఅంశాలపై కౌన్సెలింగ్ అందించనున్నారు. తొలుత ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఈ విధానాన్ని ప్రవేశపెట్టి.. అనంతరం ప్రైవేట్‌లో కూడా అమలుచేయాలని ఇంటర్ విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. ప్రభుత్వ కాలేజీల్లోని రెగ్యులర్ లెక్చరర్లతోపాటు లైబ్రేరియన్లు, కాంట్రాక్టు లెక్చరర్లను కౌన్సెలర్లుగా నియమించినట్టు ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమిషనర్ సయ్యద్ ఒమర్ జలీల్ తెలిపారు. ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యలను నివారించడాన్ని సవాలుగా తీసుకొని అందుకు కావాల్సిన అన్ని రకాల చర్యలు చేపట్టినట్టు చెప్పారు. 404 జూనియర్ కాలేజీల్లో ఎంపికైన కౌన్సెలర్లకు నవంబర్ మొదటివారంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా ప్రారంభమయ్యే ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి ప్రారంభిస్తారని, నవంబర్ 8 లేదా 9 తేదీల్లో శిక్షణ చేపట్టేలా తేదీలు ఖరారు చేస్తున్నామని తెలిపారు. ఎంపికచేసిన పది మంది మానసిక వైద్యులు.. చదువులు, ఒత్తిడి, పరీక్షలు, జ్ఞాపకశక్తి, ప్రేరణ వంటి ఐదు అంశాలపై అవగాహన కల్పించనున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రైవేట్ కాలేజీల్లో కౌన్సెలర్లను నియమించనిపక్షంలో ఆయా కాలేజీల అనుబంధ గుర్తింపు నిలిపివేసేలా చర్యలు తీసుకోనున్నారు.

### చదువులో వెనుకబడినవారికి ప్రత్యేక తరగతులు

పాఠాలు సరిగా అర్థం చేసుకోలేని, చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించే ప్రయత్నాలను కూడా ఇంటర్ విద్యాశాఖ కొనసాగిస్తున్నది. ఇంటర్ పరీక్షల్లో ఒకటి లేదా రెండు సబ్జెక్టుల్లో ఫెయిలైనవారికి అదనపు తరగతులు నిర్వహించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. అలాగే రాష్ట్రంలోని 60కి పైగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో జేఈఈ, ఎన్ఐటీ, ఎంసెట్‌కు ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు.

## అఫిలియేషన్‌కు గడువు డిసెంబర్ 31

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలల అఫిలియేషన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను డిసెంబర్ 31 లోగా ముగించనున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్ తెలిపారు. అందుకోసం వీలైనంత త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పారు. అన్నిరకాల ప్రమాణాలున్న ప్రైవేటు జూనియర్ కళాశాలలకు మాత్రమే వచ్చే విద్యాసంవత్సరానికి అఫిలియేషన్ ఇస్తామని స్పష్టం చేశారు.

## ఓపెన్‌స్కూల్ పరీక్ష ఫీజుకు రేపు తుదిగడువు

- జనవరి 4 నుంచి ఎన్ఐవోఎస్‌లో సప్లిమెంటరీ పరీక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐవోఎస్) ద్వారా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ) చదువుతున్న అభ్యర్థులు చివరి సప్లిమెంటరీ పరీక్ష ఫీజును గురువారంలోగా ఆన్‌లైన్‌లో చెల్లించాలని హైదరాబాద్ ప్రాంతీయ సంచాలకుడు అనిల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. జనవరి 4నుంచి 18 వరకు జరిగే ఈ పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లింపు గడువు ఈ నెల 31తో ముగుస్తుందని తెలిపారు.

# సాకారమవుతున్న కేటీఆర్ కల



చివరి దశలో ఉన్న ఐటీటవర్ పనులను పరిశీలిస్తున్న మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్‌లో ప్రారంభానికి సిద్ధమవుతున్న ఐటీ టవర్

### తలమానికంగా నిలుస్తుంది

కరీంనగర్‌లో పూర్తి కావస్తున్న ఐటీ టవర్ తలమానికంగా నిలుస్తుంది. డిసెంబర్‌లో ఈ ఐటీటవర్‌ను ప్రారంభించేదుకు ఏర్పాట్లు చేస్తున్నాం. వచ్చే కంపెనీలు మూడువేల పైచిలుకు యువతీయువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాయి. స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ఐటీ టవర్ నిర్మానానికి నిధులు ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

- గంగుల కమలాకర్, మంత్రి

- కరీంనగర్‌లో ప్రారంభానికి సిద్ధమైన ఐటీ టవర్
- డిసెంబర్‌లో ప్రారంభోత్సవం
- మంత్రి గంగుల కమలాకర్ వెల్లడి

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ కల సాకారం కాబోతున్నది. హైదరాబాద్‌కే పరిమితమైన ఐటీ రంగాన్ని ద్వితీయశ్రేణి నగరాలకు విస్తరించాలన్న లక్ష్యం నెరవేరుతున్నది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని దిగువ మానేరు జలాశయం పరిధిలోని ఐటీటవర్ నిర్మాణానికి 2018 జనవరి 8న మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఆ వెంటనే పనులు మొదలుపెట్టేందుకు రూ.25 కోట్లు మంజూరుచేశారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పనులు చేయించడంపై ప్రత్యేకచొరవ చూపారు. ఫలితంగా పనులు పూర్తికావొచ్చాయి. ఫ్లగ్ అండ్ ప్లే పద్ధతిలో ఈ ఐటీ టవర్ పనులు వచ్చేనెలలో పూర్తిచేయించేందుకు మంత్రి గంగుల ప్రత్యేక చొరువ చూపుతున్నారు. సుమారు 62 వేల చదరపు అడుగుల విస్తీర్ణం గల స్థలం కంపెనీలకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ టవర్‌లో షిఫ్ట్‌కు 1100 నుంచి 1200 మంది సిబ్బంది పనిచేసే అవకాశం ఉంటుంది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో స్థానిక యువత కోసం లర్నింగ్‌సెంటర్‌తోపాటు ఏసీ, నాన్‌ఏసీ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ టవర్‌లో సెంట్రల్ ఏసీతోపాటు, 24 గంటల విద్యుత్‌సదుపాయం కల్పించేందుకు అవసరమైన జనరేటర్‌ను అందుబాటులో ఉంచుతున్నారు. ఇప్పటికే పలు ఐటీ కంపెనీలు టవర్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించడానికి ముందుకొచ్చాయి.

## పాడిరైతులకు 52.7 కోట్లు విడుదల

- పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** డెయిరీ సంఘాలకు పాలు విక్రయించే పాడిరైతులకు లీటరుకు రూ.4 చొప్పున ప్రోత్సాహం (ఇన్సెంటివ్) చెల్లించేందుకు రూ.52.7 కోట్లు విడుదల చేసినట్టు పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. వివిధ డెయిరీలకు పాలుపోసిన పాడిరైతులకు చెల్లించేందుకు విడుదలచేసిన నిధుల వివరాలను చెప్పారు. కరీంనగర్ జిల్లాకు 12.9 కోట్లు, ముల్కనూర్ డెయిరీ రైతులకు 1.24 కోట్లు, నార్మూల్ మదర్ డెయిరీ రైతులకు 10.85 కోట్లు, విజయ డెయిరీ రైతులకు 23.7 కోట్లు, విజయ డెయిరీకి రీయింబర్స్‌మెంట్ కింద మరో 4.01 కోట్లు మొత్తంగా 52.7 కోట్లతోపాటు , గోపాలమిత్రలకు రెండోవిడుత వేతనాలకు రూ.8.63 కోట్లు విడుదల చేసినట్టు ఆయన తెలిపారు.



## ఆర్టీఐ తొలి కమిషనర్ సుధాకర్‌రావు కన్నుమూత

**బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ:** ఉమ్మడి ఏపీ ఆర్టీఐ తొలి కమిషనర్ కలకుంట్ల సుధాకర్‌రావు (72) మంగళవారం బంజారాహిల్స్‌లోని స్వగృహంలో కన్నుమూశారు. వృత్తిరీత్యా ఇంజినీర్ అయిన సుధాకర్‌రావు స్వస్థలం మంచిర్యాల జిల్లా మందమర్రి. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీ కేవీపీలకు ఆయన అత్యంత సన్నిహితుడు. సుధాకర్‌రావు మృతికి ఏపీ సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. గురువారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

# ఆస్తికోసమే రజిత హత్య!

- తల్లిని కుమార్తె చంపిన కేసులో కొత్త కోణం
- రూ.10 కోట్ల ఆస్తి కోసం శశికుమార్ కుట్ర
- కీర్తి అసంతృప్తిని అవకాశంగా మార్చుకొని పన్నాగం



రజిత (ఫైల్)



కీర్తిరెడ్డి



శశికుమార్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ/హయత్‌నగర్:** హైదరాబాద్ శివారు మునగనూరు గ్రామం ద్వారకానగర్‌లో జరిగిన రజిత హత్య కేసులో కొత్త కోణం వెలుగు చూసింది. దాదాపు రూ.10 కోట్ల ఆస్తులను కాజేసేందుకే శశికుమార్ పథకం ప్రకారం రజితను ఆమె కుమార్తెతోనే చంపించాడని మంగళవారం ద్వారకానగర్‌లో ప్రచారం జరిగింది. కీర్తిరెడ్డితో కొంతకాలంగా సన్నిహితంగా ఉంటూ ఆమె వ్యక్తిగత రహస్యాలను సేకరించి బ్లాక్‌మెయిల్‌కు దిగాడని సమాచారం. చెడు తిరుగుళ్లు తిరుగొద్దని మందలించిన తల్లిని అతి కిరాతకంగా హత్యచేసిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ప్రాథమికంగా కీర్తిరెడ్డి పోలీసుల విచారణలో తానే తల్లి రజితను స్నేహితుడు శశికుమార్‌తో కలిసి చంపినట్టు చెప్పినప్పటికీ ఈ హత్యకు ఆస్తులే కారణమని ప్రచారం జరిగింది. దర్యాప్తు సాగుతున్న నేపథ్యంలో వివరాలు వెల్లడించలేమని పోలీసులు చెప్తున్నారు. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కీర్తి తల్లిదండ్రులు శ్రీనివాస్‌రెడ్డి, రజితకు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని నిర్నాముల, తుమ్మలగూడెం గ్రామాల్లో పదెకరాలకుపైగా వ్యవసాయ భూమి ఉన్నది. ప్రస్తుతం ఎకరం రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షలు పలుకుతున్నది. ద్వారకనగర్‌లో రూ.70 లక్షలు విలువైన ఇల్లు ఉన్నది. ఈ ఆస్తులన్నింటినీ గమనించిన శశికుమార్.. కీర్తిరెడ్డితో పరిచయం చేసుకొని ఆమె వ్యక్తిగత వివరాలను సేకరించాడు. ఆ తర్వాత ఆమెతో సన్నిహితంగా మెలిగాడు. కీర్తిరెడ్డి తన ప్రియుడు బాల్‌రెడ్డితో సన్నిహితంగా ఉన్న సమయంలో గర్భం దాల్చింది. ఈ విషయాన్ని ఇంట్లో చెప్పకుండా దాచిన కీర్తి అబార్షన్ కోసం శశికుమార్ సహాయాన్ని కోరింది. దీనిని అవకాశంగా తీసుకున్న శశి.. సహకరిస్తానని హామీ ఇవ్వడంతోపాటు కొన్ని అతి కోరికలు కోరాడు. ఇందుకు ఒప్పుకొన్న కీర్తి కొంతకాలంగా శశితో సన్నిహితంగా ఉంటూ వస్తున్నది. ఇది గమనించిన తల్లి రజిత.. బాల్‌రెడ్డితో పెండ్లి చేయడానికి నిర్ణయించుకున్నాక శశితో ఎందుకు తిరుగుతున్నావంటూ పలుమార్లు మందలించింది. కీర్తి ఈ విషయాన్ని శశికి చెప్పడంతో.. ఆస్తి దక్కదని భయపడ్డ అతను ఎలాగైనా రజిత అడ్డు తొలగించుకోవాలని పథకం వేశాడు. ఆ తర్వాత కొన్ని సందర్భాల్లో కీర్తి కూడా బాల్‌రెడ్డిని పెండ్లి చేసుకోవడంపై అసంతృప్తిని వ్యక్తంచేయడంతో శశి దీనిని అవకాశంగా మలుచుకున్నాడు. ఇదే అదునుగా ఈ నెల 19న రజితను ఆమె కుమార్తె కీర్తితో కలిసి దారుణంగా హత్య చేశాడని తెలుస్తున్నది. దర్యాప్తులో ఇంకా కీలక విషయాలు రాబట్టేందుకు పోలీసులు కీర్తిరెడ్డి, శశికుమార్‌ను విచారిస్తున్నారు. మొత్తం మూడు బృందాలు ఈ కేసు దర్యాప్తును చేపట్టాయి. శశికుమార్ తండ్రి విద్యుత్‌శాఖలో ఉన్నత ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఇటీవల అతడు సస్పెండ్ అయినట్టు సమాచారం.


**MSME-TOOL ROOM, HYDERABAD**
**(CENTRAL INSTITUTE OF TOOL DESIGN)**
(A Government of India Society, Ministry of MSME)
Balanagar, Hyderabad, PIN-500037.

**NOTIFICATION**

It is hereby notified to the ex trainees of the following course and admission batches **all DIPLOMA up to 2012, POST DIPLOMA up to 2017, all PG up to 2016, M.E. up to 2015** that those who have not claimed their original diploma / degree certificates; should do so within **15th Novemebr, 2019.** The detailed list can be referred from our website.

Contact Details : Room No. 102, Diploma Block,
E-Mail-adminltrg@citdindia.org, Website-www.citdindia.org

Sd/-
PRINCIPAL DIRECTOR

"తండ్రి జైలులో ఉన్నా పట్టింపులేని దుష్యంత్ (చౌతాలా)లాంటివారు మహారాష్ట్రలో లేరు. ఇక్కడ నైతికత, సత్యంపై ఆధారపడి రాజకీయాలు చేసేవారున్నారు. శరద్‌పవార్ లాంటివారు బీజేపీ వ్యతిరేక రాజకీయ వాతావరణాన్ని ఏర్పర్చారు. కాంగ్రెస్ బీజేపీతో ఏ పరిస్థితుల్లోనూ జతకట్టదు.



**సంజయ్ రౌత్, శివసేన సీనియర్ నేత**

దుష్యంత్ చౌతాలా గురించి సంజయ్‌రౌత్‌కు తెలిసినట్లు లేదు. మా నాన్న గత ఆరేండ్లుగా జైలులో ఉన్నాడు. ఆయన మంచి చెడ్డల గురించి ఎప్పుడూ రౌత్ అడుగలేదు. ఆయన శిక్షను పూర్తిచేసుకొనే బయటకు వస్తాడు. ఇలాంటి మాటలతో రౌత్ వ్యక్తిత్వం పెరుగదు.

**దుష్యంత్ చౌతాలా, హర్యానా ఉప ముఖ్యమంత్రి**



**చరిత్రలో నేడు**



**1502**
రెండోసారి భారత్-కాలికట్‌కు చేరుకున్న వాస్కోడీ గామా.

**1784**
ప్యారిస్‌లో మిలిటరీ వందనం అందుకుంటున్న నెపోలియన్. నెపోలియన్ మిలిటరీ శకం ప్రారంభం.





**1868**
అమెరికా కాంగ్రెస్‌కు లూసియానా నుంచి ఎన్నికైన మొదటి ఆఫ్రో అమెరికన్ జాన్ మెనార్డ్.

**ఉగ్రవాద నేత బాగ్దాదీని హతమార్చినట్టు అమెరికా చెప్పకుంటున్నది. అది నిజమే అని నమ్మినా ఈ ఘనత ఒక్క అమెరికాది మాత్రమే కాదు. ఉగ్రవాదంపై రష్యా, సిరియా, కుర్దిష్ వంటి భిన్నపక్షాలూ పోరాడాయి. ఉగ్రవాదంపై ఎంతోకాలంగా పోరాటం సాగుతున్నది. 2001లో ఉగ్రవాదంపై పోరాటం ప్రారంభమైనప్పటి నుంచి అమెరికా భూభాగంపై దాడి జరుగలేదు. అమెరికా కోణంలో ఉగ్రవాదంపై పోరాటం జయించింది. కానీ ఆ విజయ ఫలాలు ప్రపంచశాంతికి, అభివృద్ధికి దోహదపడటం లేదు.**

**గ్లోబల్ టైమ్స్**

**బాగ్దాదీని హతం చేయడంలోని ఘనత తనదే అన్నట్టుగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పకుంటున్నారు. కానీ ట్రంప్ ప్రతి దశలో గూఢచార అధికారులను అవమానించారు. బాగ్దాదీని గుర్తించి అతని నిర్మూలనకు పథకాన్ని రచించడంలో గూఢచారి దళాలు ఎంతో కృషిచేశాయి. ఈ దశలో సిరియా నుంచి దళాలను ఉపసంహరించుకోవడం వల్ల ఈ కార్యక్రమం మరింత క్లిష్టంగా మారింది. ట్రంప్ నాయకత్వం అధ్వాన్నంగా ఉన్నప్పటికీ సైనికులు, గూఢచార అధికారులు విజయవంతంగా బాగ్దాదీని హతమార్చారు.**

**టొరంటో స్టార్**



# బాగ్దాదీ హతం

ఐఎస్ఐఎస్ అగ్రనేత అబూ బకర్ అల్ బాగ్దాదీ హతమయ్యాడు. దశాబ్దకాలంగా ప్రపంచాన్ని వణికిస్తున్న రక్తపిపాసి బాగ్దాదీ అంతం కోసం ఆరేండ్లుగా అమెరికా చేపట్టిన వేట ముగిసింది. ఆపరేషన్ కైలా ముల్లర్ పేరుతో అమెరికా చేపట్టిన మిషన్ విజయవంతం అయ్యింది. బాగ్దాదీని సిరియాలోని అద్లిబ్ ప్రాంతంలోని ఓ రహస్య స్థావరంలో ఉండగా అమెరికా దళాలు మట్టుబెట్టడంతో ప్రపంచదేశాలు ఊపిరి పీల్చుకున్నాయి. అచ్చం అల్ కాయిదా నేత బిన్ లాడెన్‌ను పాకిస్థాన్‌లోని అబ్బాటోబాద్‌లో రహస్య స్థావరంలో అంతమొందించిన విధంగానే బాగ్దాదీ కూడా హతం కావటం గమనార్హం. పాకిస్థాన్‌లో బిన్ లాడెన్‌ను అంతం చేసినప్పుడు అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ప్రపంచానికి పట్టిన టెర్రరిస్టు పీడ విరగడ అయ్యిందని చెప్పుకొచ్చాడు. ఇందుకు ప్రపంచం కూడా సంబురపడింది. కానీ అది ఎక్కువ కాలం నిలువలేదు. ప్రపంచమంతా భరోసాగా ఉండొచ్చని అనుకుంటున్న తరుణంలోనే బాగ్దాదీ పుట్టుకొచ్చాడు. బాగ్దాదీని మట్టుబెట్టిన ట్రంప్ తనదైనశైలిలో టెర్రరిజంపై తన విజయాన్ని ప్రకటించాడు. ఇలా నాటి ఆఫ్ఘనిస్థాన్‌లోని జిహాదీ నేతలు మొదలు ఉగ్రవాద సంస్థల అధినేతలుగా చెప్పుకొన్న వారంతా ఆధునిక సమాజపు మానవీయతకు సవాలుగా మారినవారే. అయితే వ్యక్తులను అంతం చేయటం ద్వారా మాత్రమే ఉగ్రవాద మూలాలు పెకిలివేయబడుతాయని విశ్వసించటానికి వీలులేదు. మతం పునాదిగా ఊపిరి పోసుకుంటున్న టెర్రరిజానికి జవం, జీవంగా మారిన సామాజిక ఆధిపత్య రాజకీయాలకు తావులేని పరిస్థితులు ఏర్పర్చిన ప్పుడే ఉగ్రభూతం ఊపిరి ఆగుతుంది.

**నిజానికి ఆఫ్ఘనిస్థాన్‌లో రష్యా అనుకూల ప్రభుత్వాలకు వ్యతిరేకంగా మత మూకలను ఎగదోసి జిహాదీలకు, అల్ కాయిదాకు ప్రాణం పోయటం మొదలు, ఇరాక్‌లో సద్దాంహుస్సేన్‌ను కూలదోయటానికి చేసే యత్నాల్లో భాగంగా ఐసిస్‌కు కూడా నారు నీరు పోసింది అమెరికాయేననే ఆరోపణలున్నా యి. ఆరోపణల్లో వాస్తవం ఎంత ఉన్నా, ఆధిపత్య రాజకీయాలతో సామాజిక సమూహాలను ఆత్మన్యూనతకు గురిచేస్తూ, వారి ఆత్మగౌరవానికి భంగం కలిగించేరీతిలో ఎవరు ప్రవర్తించినా ప్రతిఫలం తీవ్రంగా ఉంటుందని సమకాలీన చరిత్ర చెబుతున్న సత్యం.**

ఐఎస్ఐఎస్ ఇరాక్, సిరియా, ఆఫ్ఘనిస్థాన్, లిబియా, ఇరాన్ మొదలు పశ్చిమాసియా అంతా పాగా వేసింది. మొత్తం పద్నాలుగు దేశాల్లో పాగా వేసి స్థానిక ప్రభుత్వాలపై తిరుగుబాటుకు ప్రేరేపించి అంతులేని హింసకు పురుడుపోసింది. ఆ క్రమంలో మతం పునాదిగా బాగ్దాదీ చేసిన దారుణాలు అంతాఇంతా కాదు. సంస్కృతి పరిరక్షణ పేరిట చర్చిలను, చారిత్రక కట్టడాలను నేల మట్టం చేశాడు. ప్రత్యర్థులను, బయటి ప్రపంచానికి భయభ్రాంతులకు గురిచేయటం కోసం బందీలుగా పట్టుకున్న వారి తలలు నరికివేత, సజీవ దహనాలతో అతి క్రూరంగా చంపిన వీడియోలను విడుదల చేసి ప్రపంచాన్ని కంటిమీద కునుకులేకుండా చేశాడు. 2003లో ఇరాక్‌పై అమెరికా దాడిచేసి, ఇరాక్ అధ్యక్షుడు సద్దాంహుస్సేన్‌ను పదవీచ్యుతున్ని చేసి అంతమొందించిన కాలంలో చిన్నపాటి మత బోధకుడిగా ఉన్న బాగ్దాదీ స్థానిక పరిస్థితులను, అమెరికా వ్యతిరేకతను వాడుకొని ఇస్లాం ప్రపంచ పరిరక్షకునిగా చెప్పుకొని అప్రతిహతంగా ఎదిగిపోయాడు. 2010లో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రసంస్థను ప్రారంభించి ఇరాక్, సిరియా సరిహద్దు ప్రాంతంలో 88 వేల చదరపు కిలోమీటర్ల మేర ఖలీఫా రాజ్యాన్ని స్థాపించి అంతులేని హింసాదౌర్జన్యాలకు పాల్పడ్డాడు. స్థానిక కుర్దుల సాయంతో ఐసిస్ సామ్రాజ్యాన్ని కుప్పకూల్చినా దాని మూలాలు కూకటివేళ్లతో పెకిలించటానికి దీర్ఘకాలిక కార్యాచరణ అవసరం.

ఉగ్రవాదాన్ని వ్యక్తికేంద్రంగా ఒకరి అమానవీయ ఆలోచన, హింసాత్మక ఆచరణ నుంచి మాత్రమే పుట్టుకొచ్చేదిగా చూస్తే సరిపోదు. ప్రతి సామాజిక హింసాత్మక చర్యలకు ముఖ్యంగా మతం పునాదిగా వేళ్లూనుకునే ఉద్యమాలకు విరుగుడు సామాజిక సమూహాల్లోంచే వెదకాలి. నిజానికి ఆఫ్ఘనిస్థాన్‌లో రష్యా అనుకూల ప్రభుత్వాలకు వ్యతిరేకంగా మత మూకలను ఎగదోసి జిహాదీలకు, అల్ కాయిదాకు ప్రాణం పోయటం మొదలు, ఇరాక్‌లో సద్దాంహుస్సేన్‌ను కూలదోయటానికి చేసే యత్నాల్లో భాగంగా ఐసిస్‌కు కూడా నారు నీరు పోసింది అమెరికాయేననే ఆరోపణలున్నాయి. ఆరోపణల్లో వాస్తవం ఎంత ఉన్నా, ఆధిపత్య రాజకీయాలతో సామాజిక సమూహాలను ఆత్మన్యూనతకు గురిచేస్తూ, వారి ఆత్మగౌరవానికి భంగం కలిగించేరీతిలో ఎవరు ప్రవర్తించినా ప్రతిఫలం తీవ్రంగా ఉంటుందని సమకాలీన చరిత్ర చెబుతున్న సత్యం. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఓ సందర్భంలో అబద్ధాల మీద ఆధారపడి యుద్ధాల ద్వారా లక్షలాది మందిని చంపేసిన మాట నిజమేనని ఒప్పుకున్న విషయం మరువరాదు. ఈ నేపథ్యంలోనే జర్మన్ పాత్రికేయుడు మోసుల్‌లో బాగ్దాదీని ఇంటర్వ్యూ చేయాలని ఐసిస్ అనుమతి కోరినప్పుడు- బాగ్దాదీ వ్యక్తి మాత్రుడు, ఆయన మరణిస్తే ఐసిస్ మండలి ఆయన స్థానంలో మరొకరిని ప్రతిష్ఠిస్తుందని చెప్పటాన్ని తేలికగా కొట్టిపారేయలేం. నాయకుల హతంతో ఉగ్రవాద బూతం మట్టికరిచినట్టుగా భావించలేం. ఇప్పటికైనా ఉగ్రవాద మూలాలకు అసలు కారణాలను పట్టుకొని రూపుమాపాల్సిన బాధ్యత ప్రపంచ దేశాలది. దేశాల మధ్య, సామాజిక సమూహాలు, ముఖ్యంగా మతసమూహాల మధ్య సమానత్వ భావనలు మాత్రమే శాంతికి నెలవు అవుతాయి. ఈ దిశగా ఇప్పటికైనా ప్రపంచ దేశాలు ఆలోచించి అడుగులు వేయాలి.

**జనగళం**

### మంటగలుస్తున్న మానవత్వం

ప్రవర్తన మార్చుకోమన్నందుకు కూతురే కన్న తల్లిని కడతేర్చిన ఉదంతం సమాజాన్ని కలవరపరుస్తున్నది. అలాగే మరోచోట కన్నతల్లే తన ఇద్దరు బిడ్డలను గొంతుకోసి చంపి, తానూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన దిగ్భ్రాంతికి గురిచేసేది. ఇలాంటి ఘటనలు ఈ మధ్యకాలంలో పరిపాటి అయిపోయాయి. వీటికి వ్యక్తుల్లోని చెడుకు మాత్రమే ఆపాదించి చూస్తే పరిష్కారం లభించదేమో. ఇలాంటి దారుణాల వెనుక కనిపించకుండా సమాజాన్ని అమానవీయం, నిర్వీర్యం చేస్తున్న విష సంస్కృతి కారణం. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్‌లు విరివిగా వినియోగంలోకి వచ్చిన తర్వాత మనుషుల్లోని మానవీయత ఆవిరైపోతున్నది. దీనిపై ప్రతి ఒక్కరూ ఆలోచించాలె. పరిష్కారమార్గాలు వెతుకాలె.

**-కొత్వాల్ ప్రవీణ్, బేగంపేట, హైదరాబాద్**

### నిర్లక్ష్యం వీడాలె

బోరుబావుల్లో పడి చిన్నారులు మృతి చెందుతున్న వార్తలు యావత్ దేశ ప్రజలను కంటతడి పెట్టిస్తున్నాయి. చిన్నపాటి నిర్లక్ష్యాల వల్లే ఇలాంటి ఘటనలు తరుచూ చోటుచేసుకుంటున్నాయి. అభం శుభం తెలియని పసిపిల్లలు అసువులు బాస్తున్నారు. కన్నవారికి కడుపు శోకం మిగులుతున్నది. బోరు బావులు తవ్వించినప్పుడు ఆ బావిలో నీళ్లు పడకపోతే మళ్లీ ఆ బావిని పూడ్చాల్సిన బాధ్యత ఆ బావి యాజమానులపై ఉంటుంది. కానీ యాజమానులు బావులను పూడ్చివేయడం లేదు. దీంతో పసిపిల్లలు బోరుబావుల్లో పడుతూ మృత్యువాత పడుతున్నారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నా బోరుబావుల యాజమానుల్లో మార్పు రావడం లేదు. ఇటీవల తమిళనాడులోని తిరుచ్చిలో బోరుబావిలో పడిన బాలుడు సుజిత్‌ను ప్రాణాలతో బయటకు తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, కేంద్రం కూడా చాలా ప్రయత్నాలు చేసింది. ఇందుకోసం జర్మనీ టెక్నాలజీని కూడా ఉపయోగించింది. అయినా సుజిత్ తల్లికి గర్భ శోకం తప్పలేదు. సినీనటులు మొదలు దేశ ప్రధాని వరకు బాలుడిని ప్రాణాలతో బయటకు తీసుకురావాలని చేసిన ప్రయత్నాలకు ఫలితం లేకుండా పోయింది. కాబట్టి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

**- నర్మాల కృష్ణతేజ, లక్ష్మీనగర్, కరీంనగర్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

**సందర్భం**



**సాసాల మల్లికార్జున్**

# రైతుబిడ్డ సర్దార్ పటేల్

మిగితా సంస్థాలన్నీ విలీనం అవుతున్న తరుణంలో హైదరాబాద్ నిజాం మాత్రం పాకిస్థాన్ ప్రేరణతో తప్పుడు పంథా తొక్కారు. పాక్‌లో చేరడం గానీ, స్వతంత్ర రాజ్యంగా మనుగడ సాగించడం గాని చేయాలని తలపోశారు. అలాంటి సమయంలో హైదరాబాద్ సంస్థానాన్ని స్వాధీనం చేసుకొని భారత గణతంత్రలో కలిపేందుకు సర్దార్ పటేల్ ఆపరేషన్ పోలోకు తెరలేపారు.

భారతదేశ చిత్రపటం ఈ రోజు ఇలా ఉందంటే దానికి కారణం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అవిశ్రాంత కృషి. దేశాన్ని సంఘటితపరిచి ఆధునిక భారత్‌ను తీర్చిదిద్దిన ఘనత పటేల్‌కే దక్కుతుంది. సర్దార్ వల్లభ్‌భాయ్ జీవన్‌బాయ్ పటేల్ 1875, అక్టోబర్ 31న గుజరాత్, కైరా జిల్లాలోని కరంసాద్ గ్రామంలోని ఒక రైతు కుటుంబంలో జన్మించారు. రైతులంటే పటేల్‌కు ఎనలేని ప్రేమ, ఎన్నో సందర్భాల్లో తను రైతు బిడ్డనని గర్వంగా ప్రకటించుకున్నాడు. పటేల్ ప్లీడర్ పట్టా తీసుకొని బోర్సాద్‌లో ప్రాక్టీస్ పెట్టిన సందర్భంలో ప్రభుత్వ దమననీతికి బలైన రైతుల కేసులనే ఎక్కువగా వాదించేవాడు. ఆయన ధాటికి, వాగ్ధాటికి ప్రభుత్వం కోర్టునే బోర్సాద్ నుంచి ఆనంద్‌కు మార్చిందంటే ఆయన సత్తా అర్థం చేసుకోవచ్చు.

ఎంతో ఇష్టపడి చిన్ననాటి నుంచి లక్ష్యంగా పెట్టుకొని చదివిన పటేల్ న్యాయవాద వృత్తిలో విశేషంగా రాణిస్తున్న సమయంలోనే మహాత్మా గాంధీని కలిశారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీ సాగిస్తున్న అహింసాయుత పోరాటంతో స్ఫూర్తి పొందారు. న్యాయవాద వృత్తిని వదిలిపెట్టి తానూ సంగ్రామంలోకి దూకారు. 1918లో బ్రిటిష్ ప్రభుత్వం గుజరాత్‌లోని ఖేడా జిల్లాలో భూమి శిస్తును భారీగా పెంచింది. పన్ను తగ్గించే వరకు సహాయ నిరాకరణ చేయాలని గాంధీజీ ప్రజలకు సూచించి, ఈ ఉద్యమాన్ని నడిపే బాధ్యతను పటేల్ భుజస్కంధాలపై పెట్టారు. రైతులను ముఖ్యంగా రైతు మహిళలను ఏకంచేసి పటేల్ పోరాడారు. ఈ ఉద్యమంలో మనకు ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. ఆస్తులు జప్తు చేయొచ్చు, కానీ మనం వెనక్కి తగ్గద్దు. మన పోరాటమే మనకు శ్రీరామరక్ష అని వారిలో ధైర్యం నూరిపోశారు. రైతుల సహాయ నిరాకరణ ఉద్యమ ఉధృతికి బ్రిటిష్ ప్రభుత్వం తగ్గి పన్నుల పెంపును రద్దుచేసింది. దీంతో ఉద్యమ సారథిగా పటేల్ పేరు దేశవ్యాప్తంగా మార్మోగిపోయింది. అప్పుడే ఆ ప్రాంత రైతులు సర్దార్ అని పటేల్‌కు బిరుదునిచ్చారు.

ఉప్పు సత్యాగ్రహంలో అరెస్ట్ అయిన పటేల్ జైళ్లో తనకు ఇస్తున్న ఆహారాన్నే ఇతర రాజకీయ ఖైదీలకు కూడా అందజేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు అధికారులు అంగీకరించకపోవడంతో వారికి ఇస్తున్న భోజనమే తనకు ఇవ్వాలని కోరాడు. ఏ కేటగిరి రేషన్లకు తాను మాత్రమే అర్హుడనగా, నిరాహారదీక్ష చేశాడు. మూడురోజుల తర్వాత తనకు కూడా మామూలు భోజనం ఇవ్వడం మొదలుపెట్టారు. పటేల్ రాజకీయేతర ఖైదీలను మరువలేదు. రాజకీయ ఖైదీలకు ఇవ్వగా మిగిలిన బ్రెడ్డును వారికి ఇప్పించేవాడు. తనకు పంపిన నెయ్యిని ఇతర రాజకీయ ఖైదీలతో పంచుకునేవాడు. తన గిన్నె ప్రతిరోజు ఖాళీగా తిరిగి వస్తుండటాన్ని గమనించిన సూపరింటెండెంట్ జరుగుతున్నదేమిటో తెలియక మీకు చాలినంత నెయ్యి అందుతున్నదా లేక మరికొంత పంపాలా అని వల్లభ్‌భాయ్‌ని అడిగాడు ఒకరోజు. అందుకాయన నేను రైతును. రైతుబిడ్డ ఎప్పుడైనా ఇతరులను ఆహారం కోసం అడుగుతాడా? మీరు ఇవ్వగలిగినంత ఇవ్వండన్నారు.

1931లో కరాచిలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షుడిగా వ్యవహరించిన పటేల్ కాంగ్రెస్ చరిత్రలోనే అరుదైన ఉపన్యాసం చేశారు. ఆయన తన ప్రసంగాన్ని తనకు లభించిన గౌరవాన్ని ప్రస్తావిస్తూ భారతీయులు ఎవరైనా కోరుకునే అత్యున్నత స్థానానికి మీరొక సాధారణ రైతును ఎంపిక చేశారన్నారు. ఒక రైతు కుమారుడిగా తనకు రైతు జీవితం తెలుసు. వారి హక్కుల కోసం పోరాడారు. ఇంకా ఆ సదస్సులో కాంగ్రెస్ మధ్యమార్గం పట్ల అసంతృప్తిగా ఉన్న యువ తీవ్రవాదులను ఉద్దేశించి మాట్లాడుతూ మీరు రైతులు, కార్మికుల గురించి మాట్లాడుతున్నారు. నేను రైతుల సేవలోనే వృద్ధుడినయ్యాను, ఆ విషయంలో మీలో ఎవరితోనైనా పోల్చుకునేందుకు నేను సిద్ధం. రైతులను త్యాగానికి, ఆస్తులను వదులుకునేందుకు నేను సిద్ధం చేసినంతగా మీరెవరు చేసి ఉండరన్నారు. ఇక జమీందారులను ఉద్దేశించి మాట్లాడుతూ మీరు మీ పిల్లల వలె చూసుకోవాల్సిన రైతులు బయట ఆకలికి మాడి పోతుం టే మీరు విందులు, వినోదాలతో సమయం వృథా చేయడం సరికాదని హెచ్చరించారు. ఇలా రైతుల పట్ల తన శ్రద్ధ కనబరుస్తూ తన అధ్యక్షత వహించిన ఈ సదస్సులో రైతుల ప్రాముఖ్యం చెప్పాడు. తన ఖాళీ సమయాల్లో రైతులను కలుసుకోవడం పట్ల ఆసక్తి చూపేవాడు.

వలసవాద పాలన అంతమవడంతో దేశవిభజన ఖాయమని, ఒకటికి మించిన విభజనలు జరుగుతాయనే అనుమానాలు స్వాతంత్ర్యానికి పూర్వం ఉండేవి. మన దేశ ఐక్యత ప్రశ్నార్థకంగా నిలిచిన పరిస్థితుల్లో 1947 జూన్‌లో స్టేట్స్ డిపార్ట్‌మెంట్‌ను తీసుకువచ్చారు. సుమారు 560కి పైగా ఉన్న సంస్థానాలతో చర్చలు జరుపడం దీని ప్రధాన లక్ష్యం. చాలా సంక్లిష్ట అంశమైన సంస్థానాల సమస్యను పటేల్ మాత్రమే పరిష్కరించగలరని మహాత్మా గాంధీ పేర్కొనడంలో ఆశ్చర్యం లేదు. అప్పటికే ఆయన వయసు 72 ఏండ్లు. భూదేవికి ఉన్నంత ఓపిక, భగీరథుడికి ఉన్నంత పట్టుదల, సముద్రానికి ఉన్నంత లోతైన భావాలు ఈ మూడు కలిగిన వ్యక్తే రైతు. అందుకేనేమో ఒక రైతు బిడ్డగా ఈ మూడు లక్షణాలను వివిధ సందర్భాల్లో ప్రదర్శించిన పటేల్‌ను ఈ జఠిల సమస్యను పరిష్కరించడానికి ఎంచుకున్నారనడంలో ఆశ్చర్యమేమి లేదు. పరిపాలనా దక్షత, కచ్చితత్వం, స్థిరచిత్తంతో పటేల్ తనదైనశైలిలో కృషి చేశారు. పటేల్ బృందం ఒక్కో సంస్థానంతో చర్చలు జరిపి అవ న్నీ స్వతంత్ర భారతావనిలో విలీనమయ్యేలా చేసింది. దేశ ప్రజల ప్రయోజనాలే అన్నిటికంటే ముఖ్యమని దానిలో ఎలాంటి రాజీకి ఆస్కారం లేదని మొట్టమొదట చెప్పిన వ్యక్తి ఆయన.

మిగితా సంస్థాలన్నీ విలీనం అవుతున్న తరుణంలో హైదరాబాద్ నిజాం మాత్రం పాకిస్థాన్ ప్రేరణతో తప్పుడు పంథా తొక్కారు. పాక్‌లో చేరడం గానీ, స్వతంత్ర రాజ్యంగా మనుగడ సాగించడం గాని చేయాలని తలపోశారు. అలాంటి సమయంలో హైదరాబాద్ సంస్థానాన్ని స్వాధీనం చేసుకొని భారత గణతంత్రలో కలిపేందుకు సర్దార్ పటేల్ ఆపరేషన్ పోలోకు తెరలేపారు. భారత దళాలు జరిపిన ఐదురోజుల మెరుపుదాడి పర్యవసానంగా 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాష్ట్రం దేశంలో విలీనమైంది.

ఆ క్లిష్ట పరిస్థితుల్లోనే అవసరమైతే బల ప్రయోగానికి వెనుకాడని ఉక్కు సంకల్పం గల నాయకుడు భారత్‌కు అవసరం పడ్డారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ రూపంలో నాటి రాజకీ య, సామాజిక పరిస్థితులకు అతికినట్లు సరిపోయే నాయకుడు భారత్ కు అందుబాటులో ఉన్నారు. అద్భుతమైన రాజనీతిజ్ఞత కనబరుచడం ద్వారా సర్దార్ పటేల్ దేశం ముక్క లు కాకుండా అడ్డుకోవడంతో పాటు దేశీయ సమస్యలు అంతర్జాతీయ అంశాలుగా మారకుండా అడ్డుకోగలిగారు. ఎంతో సంక్లిష్టమైన సమస్యలతో ముడిపడిన జునాగఢ్ సంస్థానాన్ని దేశంలో విలీనం చేసే క్రమంలోనూ పటేల్ ఎంతో సామర్థ్యంతో వ్యవహరించారు. జమ్ముకశ్మీర్ విషయంలోనూ సర్దార్ పటేల్‌కు స్వేచ్ఛగా వ్యవహరించే అవకాశం కల్పించి ఉంటే ఆ సమస్య అప్పుడే పరిష్కారమ య్యేదని చాలామంది అభిప్రాయం.

చైనాలో కమ్యూనిస్టులు పూర్తిగా బలపడకముందే టిబెట్‌లో మన స్థానాన్ని బలపరుచుకోవాల్సిన అవసరం ఉన్నదని పటేల్ సూచించినా నెహ్రూ పెడచెవిన పెట్టారు. తర్వాత టిబెట్ ను చైనా ఆక్రమించడం, సరిహద్దు వివాదంతో మనకు చైనాతో యుద్ధం జరుగడం మనకు తెలిసిందే. కెపీఎస్ మీనన్ ఒక పుస్తకంలో పటేల్ గురించి రాస్తూ గోవా సమస్యపై 1950లో విదేశీ వ్యవహారాల కమిటీ రెండు గంటల చర్చలో పాల్గొన్నపుడు సర్దార్ పటేల్ ఏం శ్రద్ధ చూపుతున్నట్లు కన్పించలేదు. ఎక్కువసేపు కళ్లు మూసుకొని అర్ధ నిద్రలో ఉన్నట్లు కనిపించారు. అంతలోనే ఉన్నట్లుండి లేచి లోపలకు వెళ్దామా ఇది (సమస్యకు పరిష్కారం) రెండు గంటల పని అని నెహ్రూతో అన్నారు. అం దుకు నెహ్రూ గట్టిగా వ్యతిరేకించారు. పటేల్ మరేమీ మాట్లాడక తిరిగి మౌనంలోకి జారుకున్నారు. సరిగ్గా పన్నెండేండ్ల తర్వాత భారతదేశం గోవాలోకి ప్రవేశించినప్పుడు ఆ పని ముగిసేందుకు రెండు గంటలకు మించి పట్టలేదని మీనన్ రాశాడు.

జీవితంలో ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించినా తన రైతు మూలాలు మరువక పదవీ వ్యామోహం లేక నిస్వార్థంగా దేశానికి సేవ చేసిన రైతు బిడ్డ సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్. దేశంలోని సంస్థానాలన్నింటిని విలీనం చేసి అఖండ భారతాన్ని నిర్మించిన సర్దార్‌పటేల్‌ను భారత ప్రభుత్వం సమయోచితంగా ఆదరిస్తూనే ఉన్నది. 1991లో ఆయనకు భారతరత్న ప్రకటించింది. అక్టోబర్ 31న ఆయన జయంతిని పురస్కరించుకొని రాష్ట్రీయ ఏక్తా దివస్‌గా పాటిస్తున్నారు. గతేడాది గుజరాత్‌లో ప్రపంచంలోకెల్లా అత్యంత ఎత్తయిన విగ్రహంగా పేరుగాంచిన పటేల్ నిలువెత్తు రూపాన్ని ఆవిష్కరించటం రైతుబిడ్డకు దక్కిన అపూర్వ గౌరవం.



**దేశంలోని సంస్థానాలన్నింటిని విలీనం చేసి అఖండ భారతాన్ని నిర్మించిన సర్దార్‌పటేల్‌ను భారత ప్రభుత్వం సమయోచితంగా ఆదరిస్తూనే ఉన్నది. 1991లో ఆయనకు భారతరత్న ప్రకటించింది. అక్టోబర్ 31న ఆయన జయంతిని పురస్కరించుకొని రాష్ట్రీయ ఏక్తా దివస్‌గా పాటిస్తున్నారు.**

**(వ్యాసకర్త: అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ హిస్టరీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల , కోరుట్ల)**

**(రేపు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా...)**

# సిన్మా మారుతున్నది!

**విశ్లేషణ**



**గటిక విజయకుమార్**

పండుగకు ఊరెళ్లి వస్తుంటే పిల్లలు యూట్యూబ్‌లో లేటెస్ట్ వీడియోలు చూస్తున్నారు. జార్జిరెడ్డి సినిమా ట్రైలర్ వారి కంట పడింది. బహుశా అది మరో అర్జున్‌రెడ్డి లాంటి సినిమా అనుకున్నారేమో. ట్రైలర్ చూసేశారు. వారికి నచ్చింది. జార్జిరెడ్డి ఎవరని జూనియర్ ఇంటర్ చదివే మనస్విని అడిగింది. ఏ జార్జిరెడ్డి అని తిరిగి అడిగితే, ఎవరో స్టూడెంట్ లీడర్ అట, ఆయన బయోపిక్ తీస్తున్నారట కదా అంది. జార్జిరెడ్డి ఎవరికోసం పోరాటం చేసిండు? తెలంగాణ కోసమా? అని ఇంజినీరింగ్ చదివే అభిజ్ఞ వాకబు చేశాడు. అప్పుడర్థమైంది 1969-72 ప్రాంతంలో విద్యార్థి ఉద్యమాలు నడిపిన జార్జిరెడ్డి గురించి తెలుసుకోవాలని వీరికి ఆసక్తి కలిగిందని. సినిమా ట్రైలర్ చూశాక, దానికి కొనసాగింపుగా యూట్యూబ్‌లో జార్జిరెడ్డిపైన విమలక్క పాడిన 'విప్లవ ధృవతారా.. తొలి అడుగుల చెగువేరా' అనే పాట విన్నారు. జార్జిరెడ్డి మాట్లాడిన మాటల వీడియో చూశారు. 'జీనా హైతో మర్‌నా సీకో కదం కదం పర్ లడ్‌నా సీకో' నినాదం విన్నారు. ఆ తర్వాత పిల్లల ప్రశ్నలు. పెద్దల సమాధానాలు. చాలా సేపే చర్చ జరిగింది. తర్వాత కూడా వారికి ఆసక్తి తగ్గలేదు. వికీపీడియాలోజార్జిరెడ్డి గురించి మరిన్ని విషయాలు చదివారు. విద్యాలయాల్లో విద్యార్థి సంఘాలుండేవని, అక్కడ సమాజం గురించి, దేశం గురించి ఆలోచనలు జరిగేవని, సైద్ధాంతిక వైరుధ్యాలుండేవని, ఇలా చాలా విషయాలు వారు తెలుసుకున్నారు. జార్జిరెడ్డి సినిమా ట్రైలర్ పుణ్యమాని చాలా విషయాలే అవగాహన చేసుకున్నారు. అంతకు మూడురోజుల ముందు పిల్లలు 'సైరా' సినిమా చూశారు. సమర సింహారెడ్డిలాగా ఒక ఫ్యాక్షన్ సినిమా మాదిరిగా ఉంటుందనుకున్న పిల్లలకు చరిత్ర పాఠంలా సైరా సినిమా అనిపించింది. ఆ సినిమాపైనా అలాగే చర్చ. ఐదో తరగతి చదివే శ్రీగుణ నుంచి ఎంబీబీఎస్ చదివే సంజన వరకు భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అనే ఒక యోధుడి పాత్ర ఉందా? అని పిల్లలు ఆశ్చర్యపోయారు. పెద్దలనడిగి వివరాలు సేకరించారు. కొద్దినెలల కిందట వచ్చిన 'మహానటి' సినిమా సందర్భంలో కూడా ఆ కాలంలో విలువలు, మానవత్వం కలిగిన నటీనటులుండేవారనే విషయంపై చర్చ జరిగింది. సావిత్రి నటించిన పాత సినిమా లు వెతికిమరీ పట్టుకొని చూశారు. సావిత్రి గురించి గూగుల్‌లో సెర్చ్ చేసి వివరాలు తెలుసుకున్నారు. 'మల్లేశం' సినిమా కూడా గ్రామీణ, చేతి వృత్తుల నేపథ్యాన్ని విడమరిచి చెప్పింది. సైరా, జార్జిరెడ్డి మాదిరిగానే కొమురంభీమ్, అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రలతో ఆర్‌ఆర్‌ఆర్ సినిమా కూడా సిద్ధమవుతున్నది. చరిత్ర పుస్తకాల్లో రాయబడని చారిత్రక సందర్భాలను సినిమాల ద్వారా పరిచయం చేసుకోవాల్సి వస్తున్నది. ఇలాంటి సినిమాల జయాపజయాలకు చిత్రసీమ లెక్కలు వేరే ఉంటాయోమో. కానీ నేటి తరానికి గత చరిత్రను తెలియచేసే సాధనంగా సినిమా మారడమే గొప్ప విజయంగా చూడాలి. సినిమా చిత్రీకరణలో, చరిత్రను ఉన్నదున్నట్లు తెరకెక్కించడంలో తేడాలు, లోటుపాట్లు, పొరపాట్లు ఉంటే ఉండవచ్చు. కానీ అంతిమంగా ఇలాంటి సినిమాలు పిల్లలపై చూపే సానుకూల ప్రభావం మాత్రం అమూల్యమైనది.

ఇప్పుడొచ్చే సినిమాలు సమాజంపై దుష్ప్రభావం చూపుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో, కొన్ని చిత్రాలు పిల్లలకు పాఠాలు నేర్పేంత గొప్పగా ఉండటం నిజంగా పెద్ద ఊరట. జార్జిరెడ్డి గురించి గానీ, ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి గురించి గానీ పాఠ్యపుస్తకాల్లో వారు చదువలేదు. ఎంపీసీలు, బైపీసీలే తప్ప చరిత్ర పాఠాలు చదివే అవకాశం లేని పిల్లలు భవిష్యత్తులో కూడా అలాంటివారి గురించి తెలుసుకునే అవకాశం లేదు. పిల్లలు, యువత అమితంగా ఇష్టపడే సినిమాల వల్ల అది సాధ్యం కావడం ఆశ్చర్యకరమే కాదు, ఆహ్వానించదగిన పరిణామం కూడా.

పిల్లలకు ఫోన్లు ఇవ్వవద్దని, సినిమాలు చూడనివ్వొద్దని, టీవీలకు దూరంగా ఉంచాలనే నీతివాక్యాలు చెప్పడానికి బాగానే ఉంటాయి. కానీ, వాటి ప్రభావానికి లోనుకాకుండా ఉంచడం ఎవరికీ సాధ్యం కాదు. అం దుకే ప్రభావితం చేసే వ్యాపకాలు సానుకూల దృక్పథాన్ని, ప్రాపంచిక జ్ఞానాన్ని అందించగలిగితే అంతకుమించిన ప్రయోజనం మరొకటి ఉండ దు. ఇటీవల వస్తున్న బయోపిక్‌లు ఈ విషయంలో చాలా సంతృప్తికరంగా ఉంటున్నాయి. పెద్దలే పిల్లలను వెంట పెట్టుకొని మరీ థియేటర్లకు వెళ్లే పరిస్థితులు రావడం శుభపరిణామమే.

**పిల్లలకు ఫోన్లు ఇవ్వవద్దని, సినిమాలు చూడనివ్వొద్దని, టీవీలకు దూరంగా ఉంచాలనే నీతివాక్యాలు చెప్పడానికి బాగానే ఉంటాయి. కానీ, వాటి ప్రభావానికి లోనుకాకుండా ఉంచడం ఎవరికీ సాధ్యం కాదు. అం దుకే ప్రభావితం చేసే వ్యాపకాలు సానుకూల దృక్పథాన్ని, ప్రాపంచిక జ్ఞానాన్ని అందించగలిగితే అంతకుమించిన ప్రయోజనం మరొకటి ఉండ దు. ఇటీవల వస్తున్న బయోపిక్‌లు ఈ విషయంలో చాలా సంతృప్తికరంగా ఉంటున్నాయి. పెద్దలే పిల్లలను వెంట పెట్టుకొని మరీ థియేటర్లకు వెళ్లే పరిస్థితులు రావడం శుభపరిణామమే.**

బయోపిక్‌లు కొత్తవేం కాదు. మహాత్మా గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ నుంచి మొదలుకుంటే అనేకమంది జాతీయ నాయకులపైనా, మిల్కాసింగ్ నుంచి మొదలుకుంటే అనేకమంది క్రీడాకారులపైనా, వివిధ రంగాల ప్రముఖులపైనా, రాజులపైనా, వీరులపైనా బయోపిక్‌లు వచ్చాయి. తక్కువ బడ్జెట్‌తో, అనామక తారలతో తీసే బయోపిక్‌లు కొన్నిసార్లు ఆడని సందర్భాలున్నాయి. దీనికి చాలా కారణాలున్నాయి. ఇదే ప్రయత్నం భారీ నిర్మాణ సంస్థలు, ప్రముఖ నటీనటులు చేస్తే మరింత ఎక్కువ ప్రయోజనం కలుగుతున్నది. అమీర్‌ఖాన్ (దంగల్), ఫర్హాన్‌అక్తర్ (మిల్కా సింగ్), రణ్‌వీర్‌సింగ్ (కపిల్‌దేవ్), అక్షయ్‌కుమార్ (తపన్‌దాస్), ప్రియాంకా చోప్రా (మేరీ కోమ్), దీపికా పదుకొనే (లక్ష్మీ అగర్వాల్) లాంటి ప్రముఖ తారల బాలీవుడ్ సినిమాలు ఈ కోవలోనివే. తెలుగులో మెగాస్టార్ చేసిన ప్రయత్నాన్ని యువతారలు కొనసాగిస్తున్నారు.

అమీర్‌ఖాన్ తీసిన లగాన్ సినిమా బ్రిటిష్ ఇండియాలో శిస్తుల విధానాన్ని, జేపీ దుత్తా తీసిన బార్డర్ 1971 యుద్ధ వాతావరణాన్ని కళ్లకు కట్టాయి. నాటి కాలమాన పరిస్థితులకు అద్దం పట్టాయి. ప్రముఖ దర్శకుడు మణిరత్నం పలు భారతీయ భాషల్లో తీసిన చిత్రాలు, తెలుగులో బి.నర్సింగరావు, విశ్వనాథ్, టి.కృష్ణ, మాదాల రంగారావు, ఆర్.నారాయణమూర్తి లాంటివారు తీసిన సిన్మాలు సామాజిక ప్రయోజనాలు సాధించినవే. నైతిక విలువలు పెంపొందించినవే. అవి అన్నివిధాలా విజయం కూడా సాధించాయి. చిరంజీవి లాంటి స్టార్ హీరో వంటివారితో తీసిన బయోపిక్ సినిమాల పరంపర కొనసాగాల్సిన అవసరం ఉన్నది. పెద్ద నిర్మాణ సంస్థలు, పేరున్న నటీనటులు తీసిన సినిమాలకు సహజంగానే ఆకర్షణ ఎక్కువ. బయోపిక్‌లు, సామాజిక, చారిత్రక ఇతివృత్తాల్లో వైవిధ్యం కూడా ఉంటుంది. కాబట్టి, అవి వ్యాపారపరంగా కూడా విజయం సాధించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

సినిమా అంటే ఇలాగే ఉండాలి, ఇలాంటి సినిమాలే జనం చూస్తారని ఓ దిక్కుమాలిన ఫార్ములాను ప్రేక్షకులపై రుద్దే సంప్రదాయం కూడా పోవాలి. ఈ దిశగా ఇటీవల బలమైన అడుగులే పడ్డాయి. సిన్మా నిజంగానే మారుతున్నది. ఇంకా మారాలి. సమాజంలో మార్పు తేవాలి.

ఏమిటిరా ఈ జీవితం అనుకుంటూనే బతుకడం కోసం తాపత్రయ పడుతాం. రేపటి నుంచి బంద్ చేయాలని తీర్మానించుకునే అలవాట్లనే ప్రతీ రోజూ కొనసాగిస్తాం. అట్ల ద్వేషిస్తూనే ప్రేమించే అంశాల్లో సినిమాలు చూడటం ఒకటి. వ్యాపకంలోనూ, వ్యసనంలోనూ ఓ ప్రయోజనం ఉంటే అది ఉత్తమాభిరుచి అవుతుంది. సినిమా చూడటమనేది చేయకూడని పని కాదని, చూసి నేర్చుకోవాల్సిన తప్పనిసరి కృత్యం అనేలా సిన్మా ఇంకా ఎదుగాలి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

# ఆరుగురు వలస కార్మికుల కాల్చివేత



- మరొక కార్మికుడికి తీవ్ర గాయాలు
- కశ్మీర్‌లో ఉగ్రవాదుల దుశ్చర్య
- బాధితులంతా బెంగాలీలు

**శ్రీనగర్, అక్టోబర్ 29:** జమ్ముకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో ఉగ్రవాదులు దారుణానికి పాల్పడ్డారు. మంగళవారం ఆరుగురు వలస కార్మికులను పొట్టనబెట్టుకున్నారు. వారు జరిపిన దాడిలో మరో వలస కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. వీరంతా పశ్చిమబెంగాల్‌లోని ముర్షీదాబాద్ జిల్లాకు చెందిన వారని పోలీసులు తెలిపారు. 370వ అధికరణాన్ని రద్దు చేసిన తర్వాత కశ్మీరీ లోయలో తాజా పరిస్థితిపై అధ్యయనం కోసం 23 మంది యూరోపియన్ యూనియన్ పార్లమెంట్ సభ్యుల ప్రతినిధి బృందం ఒకవైపు శ్రీనగర్‌లో పర్యటిస్తున్న సమయంలోనే.. వలస కార్మికులను ఉగ్రవాదులు పొట్టనబెట్టుకోవడం గమనార్హం. ఆర్టికల్ 370ని రద్దుచేసిన ఆగస్టు ఐదో తేదీ నుంచి ఇప్పటివరకు ఐదుగురిని ఉగ్రవాదులు కాల్చిచంపారు. వీరిలో నలుగురు లారీ డ్రైవర్లు కాగా, ఒకరు యాపిల్ పండ్ల వ్యాపారి.

**భద్రత బలగాలపై ఉగ్ర దాడి**

జమ్ముకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో ఉగ్రవాదులు మరోసారి కాల్పులకు తెగబడ్డారు. మంగళవారం ద్రాబ్‌గంలోని పదోతరగతి బోర్డ్ పరీక్ష కేంద్రం వద్ద కాపలా ఉన్న సీఆర్పీఎఫ్ సిబ్బందిపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. పరీక్ష కేంద్రం సమీపంలోని ఓ ఇంట్లోకి చొరబడిన నలుగురు ఉగ్రవాదులు పరీక్ష కేంద్రం వద్ద మోహరించిన సీఆర్పీఎఫ్ బలగాలపై దాదాపు గంటపాటు కాల్పులకు పాల్పడ్డారు. ఆరు నుంచి ఏడురౌండ్ల కాల్పులు జరిపారు. భద్రతా సిబ్బంది సైతం కాల్పులను దీటుగా ఎదుర్కొన్నది. అక్కడున్న ఐదుగురు విద్యార్థులను సురక్షితంగా కాపాడింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

# కొత్త సీజేఐగా బోబ్డే నియామకం!

## రాష్ట్రపతి ఆమోద ముద్ర.. నవంబర్ 18న బాధ్యతల స్వీకారం



**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు 47వ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా శరద్ అర్విండ్ బోబ్డే నియామకంపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మంగళవారం ఆమోద ముద్ర వేశారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను న్యాయ మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. న్యాయ మంత్రిత్వ శాఖలో పనిచేసే ఉన్నత స్థాయి అధికారులు ఈ నియామకానికి సంబంధించిన వారెంటును జస్టిస్ బోబ్డేకు మంగళవారం ఉదయం అందజేశారు. జస్టిస్ బోబ్డే నవంబర్ 18న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ పదవిలో ఆయన 17 నెలల పాటు కొనసాగుతారు. ఏప్రిల్ 23, 2021న ఆయన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేయనున్నారు. సంప్రదాయం ప్రకారం తన తర్వాత అత్యంత సీనియర్‌గా ఉన్న జస్టిస్ బోబ్డేను ప్రస్తుత సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్ సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ప్రస్తుత చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ నవంబర్ 17వ తేదీన పదవీ విరమణ చేయనున్నారు. బోబ్డే 24 ఏప్రిల్, 1956న నాగ్‌పూర్‌లో జన్మించారు. 2000లో బాంబే హైకోర్టులో అదనపు జడ్జిగా, 2012లో మధ్య ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పనిచేశారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలందిస్తున్నారు.






మంగళవారం శ్రీనగర్‌లో భద్రతాబలగాలపైకి రాళ్లు రువ్వుతున్న బాలిక, (పక్కన) శ్రీనగర్‌లోని దాల్ సరస్సులో విహరిస్తున్న ఈయూ ఎంపీలు

# కశ్మీర్‌లో ఈయూ ఎంపీలు

## స్వాగతం పలికిన బంద్‌లు, ఘర్షణలు
## పలుచోట్ల రాళ్లు రువ్విన ఆందోళనకారులు

**శ్రీనగర్, అక్టోబర్ 29:** ఐరోపా యూనియన్‌కు చెందిన 23 మంది పార్లమెంట్ సభ్యులు జమ్ముకశ్మీర్‌లో పరిస్థితిని అంచనా వేయడానికి రెండు రోజుల పర్యటన కోసం మంగళవారం రాష్ట్రానికి వచ్చారు. అయితే కశ్మీర్ లోయలో వారికి మూసి ఉన్న దుకాణాలు, భద్రతా దళాలు, ప్రజల మధ్య ఘర్షణలు స్వాగతం పలికాయి. బుల్లెట్ ప్రూఫ్ వాహనాల్లో భద్రతా దళాల ఎస్కార్ట్ వాహనాల నడుమ ఈయూ ఎంపీలు హోటల్‌కు చేరుకున్నారు. హోటల్‌లో వారికి కశ్మీరీ సంప్రదాయంలో ఘనస్వాగతం లభించింది. సీనియర్ భద్రతా అధికారులు కశ్మీర్ లోయలో పరిస్థితిని ఆ ఎంపీలకు వివరించారు. అనంతరం ఎంపీలు స్థానిక ప్రజలను, పంచాయత్ సభ్యులను, కార్పొరేటర్లను కలుసుకున్నారు. అనంతరం సాయంత్రం దాల్ సరస్సులో షికారా పడవలలో విహరించారు. ఈయూ ఎంపీల పర్యటన సందర్భంగా లోయ అంతటా బంద్ వాతావరణం కనిపించింది. కశ్మీర్ లోయలో, శ్రీనగర్‌లో భద్రతా దళాలకు, ఆందోళనకారులకు మధ్య జరిగిన ఘర్షణల్లో నలుగురు గాయపడ్డారు. ఆందోళనకారులు నగరంలో పలు చోట్ల రాకపోకలకు అంతరాయం కలిగిస్తూ రోడ్లపై పెద్ద పెద్ద బండరాళ్లను పెట్టారు. పలు చోట్ల ఆందోళనకారులు భద్రతా దళాలపైకి రాళ్లు రువ్వారు. రవాణా వాహనాలు కూడా రోడ్డెక్కలేదు. అయితే 10వ తరగతి పరీక్షలు మాత్రం యథాతథంగా జరిగాయి. జమ్ముకశ్మీర్‌కున్న ప్రత్యేక హోదాను కేంద్రం గత ఆగస్టు 5న రద్దు చేసిన తరువాత ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్న తొలి విదేశీ పర్యాటకులు ఈ 23 మంది ఈయూ ఎంపీలే కావడం గమనార్హం. ఎంపీలందరూ తమ తమ దేశాల్లో 'జాతీయత' అంశాన్ని ప్రముఖంగా లేవనెత్తే మితవాద పార్టీలకు చెందిన వారే కావడం విశేషం. ఎంపీలు బుధవారం ఆర్మీ ప్రధాన కార్యాలయాన్ని, స్థానికులను, దాల్ లేక్‌లోని పడవల యజమానులను కలుసుకుంటారని అధికార వర్గాలు తెలిపాయి.

**ఒంటరిగా కలిసేందుకు అనుమతివ్వలేదు**

పోలీసు భద్రత లేకుండా తాను ఒంటరిగా కశ్మీర్ ప్రజలను కలిసేందుకు భారత ప్రభుత్వం నిరాకరించిందని బ్రిటన్‌కు చెందిన ఎంపీ క్రిస్ డేవిస్ ఆరోపించారు. కశ్మీర్‌లో పర్యటించేందుకు తనకు పంపిన ఆహ్వానాన్ని ఏదో సాకు చెప్పి ఉపసంహరించుకుందని తెలిపారు. నిజానికి ఈయూకు చెందిన 27 మంది ఎంపీలు కశ్మీర్‌లో పర్యటించాలి. కానీ నలుగురు ఎంపీలు వేర్వేరు కారణాలతో కశ్మీర్‌కు వెళ్లకుండా ఢిల్లీ నుంచి తిరిగి తమ స్వదేశాలకు వెళ్లిపోయారు. కశ్మీర్ ప్రజలను ఒంటరిగా కలుస్తానని తాను చెప్పినందుకే భారత ప్రభుత్వం తనకు అనుమతి నిరాకరించిందని క్రిస్ డేవిస్ ఆరోపించారు.

**ప్రభుత్వం వాస్తవ పరిస్థితిని దాచిపెడుతున్నది: విపక్షాలు**

జమ్ముకశ్మీర్‌లో వాస్తవ పరిస్థితిని దాచిపెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఈయూ ప్రతినిధులను కలుసుకున్న స్థానిక కశ్మీరీలు వాస్తవాలను వారికి వివరించి ఉంటారని పీడీపీ నాయకుడు ఫిర్దౌస్ టక్ ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయంగా, అంతర్జాతీయంగా ఒత్తిడి తీవ్రమైనందునే కేంద్ర ప్రభుత్వం జమ్ముకశ్మీర్‌లో పరిస్థితులు సాధారణంగా ఉన్నాయన్న నాటకానికి తెరతీసిందని టక్ ఆరోపించారు. స్వదేశీ నాయకులను కశ్మీర్ వెళ్లకుండా అడ్డుకున్న కేంద్ర ప్రభుత్వం విదేశీ ఎంపీలను అక్కడికి ఎలా అనుమతించిందని కాంగ్రెస్ పార్టీ నిలదీసింది. ఇది భారత ప్రజాస్వామ్యానికి, పార్లమెంట్‌కు అవమానమని పేర్కొంది.

# సీఎం కుర్చీ ఇస్తామనలేదు!

## ఐదేండ్లూ నేనే ముఖ్యమంత్రి

- శివసేనకు తేల్చిచెప్పిన మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్
- తీవ్రంగా స్పందించిన శివసేన
- బీజేపీతో చర్చలు రద్దు
- 50-50 ఫార్ములాపై సీఎం మాట్లాడిన వీడియో విడుదల

**ముంబై, అక్టోబర్ 29:** మహారాష్ట్ర రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుపై చిక్కుముడి మరింత జఠిలంగా మారుతున్నది. సీఎం పీఠంపై బీజేపీ, శివసేన మధ్య విభేదాలు తీవ్రమవుతున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు రెండు పార్టీల మధ్య పొత్తు కుదిరిన సమయంలో (తదుపరి అసెంబ్లీ ఎన్నికల తర్వాత) శివసేనకు రెండున్నరేండ్లపాటు సీఎం పదవిని అప్పగిస్తామని తామెన్నడూ ఆ పార్టీకి హామీ ఇవ్వలేదని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మంగళవారం కుండబద్దలు కొట్టారు. తదుపరి ప్రభుత్వంలో ఐదేండ్లపాటు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని తేల్చిచెప్పారు. బీజేపీ లక్ష్యంగా తరచూ విమర్శలు గుప్పిస్తున్న శివసేన పత్రిక 'సామ్నా'పై ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. చర్చలను 'దారి తప్పించడమే' దాని పని అని విమర్శించారు. ముంబైలోని తన అధికారిక నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే ఐదేండ్లు బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వమే కొనసాగుతుందనడంలో ఎవరికీ ఎలాంటి సందేహాలు అవసరం లేదని స్పష్టంచేశారు. సీఎం పదవిని చెరో రెండున్నరేండ్లపాటు పంచుకునేలా లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా సమక్షంలో బీజేపీ, శివసేన మధ్య 50-50 ఫార్ములాపై ఒప్పందం కుదిరిందని శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్న విషయం తెలిసిందే. ప్రభుత్వ ఏర్పాటుపై చర్చలు మొదలుపెట్టడానికి ముందు ఈ ఒప్పందంపై రాత పూర్వక హామీ ఇవ్వాలని శివసేన డిమాండ్ చేస్తున్నది. దీనిపై తొలిసారిగా సీఎం ఫడ్నవీస్ స్పందించారు. సీఎం పీఠంపై శివసేనకు ఎలాంటి హామీ ఇవ్వలేదని, ఈ విషయాన్ని స్వయంగా అమిత్‌షాతో మాట్లాడి నిర్ధారించుకున్నానని ఆయన తెలిపారు. శివసేనకు ఉపముఖ్యమంత్రి పదవి ఇస్తారా అని విలేకరులు ప్రశ్నించగా.. దానిపై తగిన నిర్ణయం తీసుకుంటామని బదులిచ్చారు. తమకు 'ఇతర అవకాశాలు' ఉన్నాయని శివసేన చెబుతుండడంపై ఆయన స్పందిస్తూ.. రెండు పార్టీలకూ వేరే ప్రత్యామ్నాయాలు లేవన్నారు. తాము కలిసే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. బుధవారం బీజేపీ శాసనసభాపక్ష నేత ఎన్నిక జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలన్న డిమాండ్‌ను శివసేన వదులుకొని, డిప్యూటీ సీఎం పదవితో సర్దుకుపోవాలని కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథావలే సూచించారు. మరోవైపు, అసెంబ్లీలో బీజేపీ బలాన్ని నిరూపించుకోలేని పక్షంలోనే ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటుపై ఆలోచిస్తామని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) నేత నవాబ్ మాలిక్ చెప్పారు. కాగా 50-50 సూత్రంపై బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే అంతిమ నిర్ణయం తీసుకుంటారని బీజేపీ సీనియర్ నేత చంద్రకాంత్ పాటిల్ పేర్కొన్నారు.



మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌కు మద్దతు తెలుపుతున్న స్వతంత్ర ఎమ్మెల్యేలు వినోద్ అగర్వాల్, మహేశ్

### అప్పటి మాటేమిటి?

ముఖ్యమంత్రి పదవి విషయంలో శివసేనకు ఎలాంటి హామీ ఇవ్వలేదని సీఎం ఫడ్నవీస్ ప్రకటించిన కొన్ని గంటలకే శివసేన తీవ్రస్థాయిలో స్పందించింది. తదుపరి ప్రభుత్వ ఏర్పాటుపై రెండు పార్టీల మధ్య జరుగాల్సిన చర్చలను శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే రద్దు చేశారు. మంగళవారం సాయంత్రం ఈ చర్చలు జరుగాల్సి ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో బీజేపీ, శివసేన మధ్య సంబంధాలు మరింత దిగజారాయి. మరోవైపు, 50-50 ఫార్ములాపై సీఎంకు కౌంటర్ ఇస్తూ శివసేన ఒక వీడియో క్లిప్‌ను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసింది. 'మళ్లీ మేం అధికారంలోకి వస్తే, పదవులు, బాధ్యతలు సమానంగా పంచుకోవాలని నిర్ణయించాం' అని ఫిబ్రవరి 28న ఫడ్నవీస్ మీడియాతో మాట్లాడుతున్న ఆ వీడియోను ఠాక్రే సన్నిహితుడు హర్షల్ ప్రధాన్ విడుదల చేశారు. 'హామీని కాస్త గుర్తు తెచ్చుకోండి' అంటూ దానికి క్యాప్షన్ ఇచ్చారు.

### బీజేపీ, శివసేన.. మధ్యలో చౌతాలా



దుష్యంత్

హర్యానాలో బీజేపీ కొత్త మిత్రపక్షం జన్‌నాయక్ జనతాపార్టీ (జేజేపీ) అధ్యక్షుడు దుష్యంత్ చౌతాలాను లక్ష్యంగా చేసుకుని మహారాష్ట్రలో బీజేపీపై శివసేన విమర్శలు ఎక్కుపెట్టింది. 'తండ్రి జైల్లో ఉన్న దుష్యంత్ చౌతాలా వంటి నేతలు ఇక్కడ ఎవరూ లేరు. బీజేపీ వ్యతిరేక వాతావరణాన్ని సృష్టించిన శరద్‌పవార్‌తోపాటు బీజేపీతో ఎన్నటికీ చేతులు కలుపని కాంగ్రెస్ పార్టీలు ఇక్కడ ఉన్నాయి. మేం సత్యాన్ని, ధర్మాన్ని అనుసరించి రాజకీయాలు చేస్తాం' అని శివసేన నేత సంజయ్ రౌత్ మంగళవారం వ్యాఖ్యానించారు.దీనిపై దుష్యంత్ తీవ్రంగా స్పందించారు. ఆ వ్యాఖ్యలు సంజయ్ స్థాయికి తగవని పేర్కొన్నారు.



తిరుచిరాపల్లిలో సుజిత్‌కు నివాళులర్పిస్తున్న పాఠశాల విద్యార్థులు

# సుజిత్.. విషాదాంతం

- బోరుబావిలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారి
- తమిళనాడు సర్కార్ తీరుపై మద్రాస్ హైకోర్టు మండిపాటు

**తిరుచిరాపల్లి:** తమిళనాడులో 5 రోజుల క్రితం బోరుబావిలో పడిపోయిన బాలుడు సుజిత్ విల్సన్ (3)ను సజీవంగా వెలికితీసేందుకు అధికారులు 80 గంటల పాటు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు పూర్తిగా కుళ్లి పోయిన, చిన్నాభిన్నమైన సుజిత్ మృతదేహాన్ని వెలికితీశారు. ఆ మృతదేహానికి సమీప ప్రభుత్వ దవాఖానలో పోస్ట్‌మార్టం నిర్వహించిన తర్వాత తల్లిదండ్రులకు అప్పగించారు. గ్రామ శివారుల్లోని శ్మశానవాటికలో సుజిత్ మృతదేహాన్ని స్థానిక మత బోధకుడు ఖననం చేశారు. తిరుచిరాపల్లి జిల్లా నడుకట్టుపట్టిలో శుక్రవారం సాయంత్రం బోరుబావిలో పడిన సుజిత్‌ను రక్షించేందుకు ప్రభుత్వ యంత్రాంగం అహర్నిశలు కృషి చేసినా ప్రయోజనం లేకపోయింది. బాలుడి మృతదేహానికి రాష్ట్ర మంత్రులు వేలమండి నటరాజన్, విజయ్ భాస్కర్ , డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ నివాళులర్పించారు. మరోవైపు, బోరుబావుల్లో పడి బాలలు మరణిస్తున్న ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని మద్రాస్ హైకోర్టు తీవ్రంగా మందలించింది. వీ పొన్‌రాజ్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం.. నిబంధనల అమలుకు ఒక మృతదేహం కావాల్సి వచ్చిందా? అని నిలదీసింది. బోరుబావుల నియంత్రణకు ప్రభుత్వ నిబంధనలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన మీడియా నిర్మాణాత్మక పాత్ర పోషించడం లేదన్నది. బోరుబావుల్లో బాలలు పడిపోయినప్పుడు చేపట్టే సహాయ చర్యలపై మీడియా చేస్తున్న ప్రత్యక్ష ప్రసారాలు విషాదంతో ముగుస్తున్నాయని వ్యాఖ్యానించింది.

### నీటి తొట్టెలో పడి చిన్నారి మృతి

- టీవీలో సుజిత్ సహాయ చర్యలను తల్లిదండ్రులు చూస్తుండగా ఘటన
- తమిళనాడులో మరో విషాదం

**తూత్తుకుడి:** తమిళనాడులో ఘోరం జరిగింది. బోరుబావిలో పడిన చిన్నారి సుజిత్ విల్సన్‌ను కాపాడటానికి చేపడుతున్న సహాయ చర్యలను ఓ దంపతులు టీవీలో వీక్షిస్తూ చివరికి తమ కుమార్తెను కోల్పోయారు. ఈ విషాదకర ఘటన సోమవారం రాత్రి త్రేస్‌పురం గ్రామంలో చోటుచేసుకుంది. సోమవారం రాత్రి సమయంలో టీవీలో ప్రసారమవుతున్న సుజిత్ సహాయ చర్యలను చూస్తూ ఆ దంపతులు అలాగే కూర్చున్నారు. అక్కడే ఉన్న వారి రెండేండ్ల కుమార్తె రేవతి సంజనా ఆడుకుంటూ అటు ఇటూ తిరిగి నీళ్ల తొట్టె వద్దకు వెళ్లింది. అందులో నీళ్లు నిండుగా ఉండటంతో చేతులతో ఆడుకుంటూ తొట్టెలో పడిపోయింది. అయితే టీవీ చూస్తున్న ఆ దంపతులు తమ కుమార్తె కనిపించకపోవడంతో ఇల్లంతా వెతికారు. చివరికి నీటి తొట్టె లో అపస్మారక స్థితిలో ఉన్న చిన్నారిని గుర్తించిన వాళ్లు వెంటనే దవాఖానకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు బాలిక మరణించినట్లు ధ్రువీకరించారు.

# ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టండి

## సౌదీ కంపెనీలకు ప్రధాని ఆహ్వానం.. ఆ దేశపు మంత్రులతో వరుస భేటీలు

**రియాద్:** భారత్‌లోని ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టాలని ప్రధాని మోదీ సౌదీ కంపెనీలను ఆహ్వానించారు. ఇంధన రంగంలో పదివేల కోట్ల డాలర్ల పెట్టుబడులను ఆహ్వానించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం సౌదీ అరేబియా వచ్చిన ప్రధాని మోదీ మంగళవారం రియాద్‌లో జరిగిన 'ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనిషియేటివ్ 2019' కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. మౌలిక సదుపాయాల రంగంలో భారత్‌లో భారీ పెట్టుబడులకు అవకాశాలున్నాయని తెలిపారు. వచ్చే ఐదేండ్లలో భారత ఆర్థిక వ్యవస్థను ఐదు లక్షల కోట్ల డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఒక్క మౌలిక సదుపాయాల రంగంలోనే లక్షన్నర కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టాలని నిర్దేశించుకున్నామన్నారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలను ఆయన వివరించారు.





**సౌదీ రాజుతో చర్చలు**

ప్రధాని నరేంద్ర మోదీ, సౌదీ రాజు సల్మాన్ బిన్ అబ్దుల్ అజీజ్ అల్-సౌద్ సంయుక్తంగా ఉగ్రవాదాన్ని తీవ్రస్థాయిలో ఖండించారు. భద్రతవిషయంలో ఉభయ దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించాలని నిర్ణయించారు. ప్రధాని మోదీ మంగళవారం సౌదీ రాజును కలుసుకున్నారు. మోదీ కోసం సల్మాన్ విందు ఏర్పాటు చేశారు. వీరి భేటీపై భారత విదేశాంగ శాఖలోని ఆర్థిక సంబంధాల విభాగం కార్యదర్శి టీఎస్ త్రిమూర్తి మీడియాతో మాట్లాడుతూ, ఇద్దరు నేతలు అన్ని రూపాలలో ఉన్న ఉగ్రవాదాన్ని ఖండించారని, ద్వైపాక్షిక భద్రత సహకారాన్ని పెంపొందించాలని నిర్ణయించారని తెలిపారు. అలాగే వ్యవసాయం, చమురు, గ్యాస్, సముద్ర భద్రత, సృజనాత్మక సాంకేతిక పరిజ్ఞానం, పునరుత్పాదక ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులు వంటి అంశాలపై కూడా వారు చర్చలు జరిపారని చెప్పారు. అనంతరం మోదీ ట్విట్టర్‌లో స్పందిస్తూ, 'ఇంధన రంగంలో ఉభయ దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడంపై సౌదీ యువరాజు అబ్దులజీజ్ బిన్ సల్మాన్‌తో చర్చలు జరిపాం. ఉభయ దేశాల సంబంధాలకు ఇంధనం ముఖ్యమైన మూల స్తంభంగా ఉన్నది' అని పేర్కొన్నారు. భారత్‌లో చమురు, గ్యాస్ ప్రాజెక్టుల్లో సౌదీ పెట్టుబడులు పెడుతుందని చెప్పారు. సౌదీ లోని భారతీయుల 'కఠోర శ్రమ, నిబద్ధత' ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి దోహదపడిందని మోదీ చెప్పారు. దాదాపు 26 లక్షల మంది భారతీయులు సౌదీని తమ రెండో ఇల్లుగా మార్చుకున్నారని తెలిపారు.

**జోర్డాన్ రాజుతో భేటీ**

సౌదీలో జరుగుతున్న పెట్టుబడుల సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన జోర్డాన్ రాజు అబ్దుల్లా-2తో మోదీ భేటీ అయ్యారు. భారత్, జోర్డాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంతోపాటు వాణిజ్యం, పెట్టుబడులు వంటి రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకొనే అంశాలపై చర్చించారు.

### బోరిస్‌కు చుక్కెదురు!

#### బ్రిటన్ పార్లమెంటులో వీగిపోయిన ముందస్తు ఎన్నికల తీర్మానం



**లండన్:** బ్రిటన్ పార్లమెంటుకు డిసెంబర్ 12న ముందస్తు ఎన్నికలు నిర్వహించాలనుకున్న ఆ దేశ ప్రధాని బోరిస్ జాన్సన్‌కు చుక్కెదురైంది. ఇందుకు ఆయన సోమవారం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మెజారిటీ సభ్యులు తిరస్కరించారు. ఈ తీర్మానానికి ఎంపీలందరూ ఆమోదం తెలియచేయాలని గతవారం ఆయన కోరినా ప్రయోజనం లేకపోయింది. బ్రిటన్ చట్టాల ప్రకారం.. 650 మంది సభ్యులు గల పార్లమెంటులో ఏదైనా తీర్మానం ఆమోదం పొందాలంటే మూడింట రెండొంతుల (434 ఎంపీల) మెజారిటీ కావాలి. 'ప్రధాని బ్రిటన్ ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారు. అక్టోబర్ 31నాటికి ఐరోపా కూటమి( ఈయూ) నుంచి బ్రిటన్ వైదొలుగుతుందని ప్రచారం చేశారు. అదేం జరిగేలా లేదు' అని విపక్ష లేబర్ పార్టీ ఆరోపించింది. కాగా, బ్రెగ్జిట్ గడువును 2020 జనవరి 31 వరకు పొడిగించాలన్న బ్రిటన్ విజ్ఞప్తిని ఈయూ సోమవారం అంగీకరించింది. ఈ విషయాన్ని బోరిస్ పార్లమెంటుకు తెలిపారు.

# బగ్దాదీ జల సమాధి



బగ్దాదీ



ముహాజిర్

- ఐఎస్ అధిపతి శరీర అవశేషాలను సముద్రంలో కలిపిన అమెరికా
- బగ్దాదీ తలదాచుకున్న ఇంట్లో కుర్దిష్ ఇన్‌ఫార్మర్
- అతడు తెచ్చిన బగ్దాదీ లోదుస్తుల సాయంతో డీఎన్ఏ పరీక్ష

**వాషింగ్టన్, అక్టోబర్ 29:** వాయవ్య సిరియాలోని ఇడ్లిబ్ రాష్ట్రంలో అమెరికా ప్రత్యేక దళాలు చేపట్టిన ఆపరేషన్‌లో హతమైన ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) అధిపతి అబు బకర్ అల్-బగ్దాదీని సముద్రంలో ఖననం చేసినట్టు అధికారులు తెలిపారు. బగ్దాదీ మరణం అతని అనుచరులకు తీరని విఘాతమని అమెరికా రక్షణ మంత్రి మార్క్ ఎస్పర్ పేర్కొన్నారు. తమ దళాలు అన్ని విభాగాలలో అద్భుతంగా రాణించి అనుకున్న లక్ష్యాన్ని ఛేదించాయని అమెరికా జాయింట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ జనరల్ మార్క్ మిల్లే అన్నారు. ఈ ఆపరేషన్‌లో ప్రత్యర్థుల నుంచి కాల్పులు ఎదురైనప్పటికీ తమ సైనిక సిబ్బంది ఎవరూ గాయపడలేదన్నారు. 'నిర్దేశిత ప్రమాణాల ప్రకారమే బగ్దాదీ శరీర అవశేషాలను ఖననం చేయడం పూర్తయింది. సాయుధ ఘర్షణ చట్టం ప్రకారం బగ్దాదీని సముద్రంలో ఖననం చేశాం' అని మిల్లే పేర్కొన్నారు. 2011లో అల్‌ఖైదా నాయకుడు ఒసామా బిన్ లాడెన్‌ను సముద్రంలో సమాధి చేసినట్లే.. బగ్దాదీ అవశేషాలను కూడా సముద్రంలో జారవిడిచామని అమెరికా రక్షణ విభాగం పెంటగాన్‌కు చెందిన అధికారి వెల్లడించారు. తాము దాడి చేయడానికి ముందు బగ్దాదీ తలదాచుకున్న ఇంట్లో తమకొక ఇన్‌ఫార్మర్ ఉన్నాడని కుర్దిష్ అధికారి ఒకరు తెలిపారు. ఆ ఇంట్లో ఉన్నది బగ్దాదీయేనా అన్నది నిర్ధారించుకోవడానికి ఆ ఇన్‌ఫార్మర్ బగ్దాదీ లోదుస్తులను తీసుకొచ్చాడని చెప్పారు. వాటి సాయంతో డీఎన్ఏ పరీక్ష చేసి అక్కడున్నది బగ్దాదీయేనని నిర్ధారించుకున్నామని తెలిపారు.

**బగ్దాదీ వారసుడు కూడా హతం: ట్రంప్**

అల్ బగ్దాదీ అనంతరం ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థ పగ్గాలు చేపట్టనున్న వ్యక్తిని కూడా అమెరికా సైనికులు అంతమొందించారని అధ్యక్షుడు ట్రంప్ మంగళవారం వెల్లడించారు. 'అబు బకర్ బగ్దాదీ స్థానాన్ని భర్తీ చేయగల మొదటి వ్యక్తిని అమెరికన్ దళాలు మట్టుబెట్టినట్టు ఇప్పుడే వార్త అందింది' అని ట్రంప్ ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. బగ్దాదీ స్థానంలో మృతుడు ఐఎస్ పగ్గాలు చేపట్టేవాడని తెలిపారు. ట్రంప్ ఎవరిని ఉద్దేశించి ఈ ట్వీట్లు చేశాడో తెలియదు. అయితే, ట్రంప్ ఐఎస్ ప్రతినిధి అబు అల్-హస్సన్ అల్-ముహాజిర్ గురించి చెప్పారని ఓ అధికారి చెప్పారు. ఉత్తర సిరియాలోని అలెప్పో రాష్ట్రంలో అమెరికన్ దళాలు ముహాజిర్‌ను హతమార్చాయని వివరించారు. ముహాజిర్ మృతిని సిరియన్ దళాలు కూడా ధ్రువీకరించాయి. ఇదిలా ఉండగా, బగ్దాదీ మృతి నేపథ్యంలో అతని అనుచరులు భారీ ఎత్తున హింసాకాండకు పాల్పడవచ్చని కుర్దిష్ భద్రతా దళాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పలు నిర్బంధ కేంద్రాల్లో బగ్దాదీ అనుచరులు మహిళలు సహా 80వేల మందికి పైగా ఉన్నారు. అయితే ఆ క్యాంప్‌లలో బగ్దాదీ మృతి వార్తను ప్రకటించలేదు. కానీ సెల్‌ఫోన్ల ద్వారా వారికి ఈ వార్త ఎప్పుడో అంది ఉంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఐఎస్‌లో 14వేల నుంచి 30వేల వరకు సభ్యులున్నట్టు అంచనా. గత రెండేండ్లలో వీరు తమ స్వాధీనంలో ఉన్న భూభాగాన్ని కోల్పోయినప్పటికీ పలు ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడ్డారు. అయితే ఐఎస్‌కు తదుపరి నాయకుడు ఎవరు అవుతారన్న దానిపైనే ఆ సంస్థ సిరియా, ఇరాక్‌లో తన పట్టును బిగిస్తుందా లేక ప్రపంచమంతటా విస్తరించేందుకు ప్రయత్నిస్తుందా అన్నది ఆధారపడి ఉంటుందని పరిశీలకులు భావిస్తున్నారు. ఇంత వరకు బగ్దాదీ మరణాన్ని ఐఎస్ ధ్రువీకరించలేదు. అలాగే తమ సంస్థకు కొత్త అధిపతిని కూడా ప్రకటించలేదు. బగ్దాదీకి అత్యంత సన్నిహితులైన వారు ఐఎస్ పగ్గాలు చేపట్టవచ్చని నిపుణులు, భద్రత అధికారులు చెప్పారు. వారిలో ఇరాక్‌కు చెందిన టర్కీ జాతీయుడు అబ్దుల్లా ఖర్దాష్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. బగ్దాదీ ఎవరినైనా తన వారసుడిగా ఎంపికచేసి ఉంటే ఐఎస్ సురా కౌన్సిల్ ఆ వ్యక్తిని నాయకునిగా నియమిస్తుంది. అయితే బగ్దాదీ ఎంపికచేసిన వారిలో ఎంతమంది ఇంకా ప్రాణాలతో ఉన్నారన్నది తెలియరాలేదు.



### బగ్దాదీని తరిమిన జాగిలం చిత్రాన్ని విడుదల చేసిన ట్రంప్

బగ్దాదీని సొరంగంలో చివరి వరకూ తరిమి అతడి ఆత్మహత్యకు కారణమైన తమ జాగిలం ఫొటోను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం విడుదల చేశారు. ఈ ఆపరేషన్‌లో ఆ శునకం గాయపడిందన్నారు. ఆ కుక్క భద్రత రీత్యా ఇతర వివరాలను చెప్పలేమని పెంటగాన్ అధికారులు చెప్పారు. బగ్దాదీని పట్టుకోవడంలో, అతడిని హతమార్చడంలో ఆ శునకం గొప్ప పనిచేసిందని పేర్కొంటూ ట్రంప్.. తన ట్విట్టర్ ఖాతాలో బెల్జియన్ మాలినాయిస్ జాతికి చెందిన ఒక కుక్క ఫొటోను పోస్ట్ చేశారు. 2011లో పాక్‌లోని అబోతాబాద్‌లో ఒసామా బిన్ లాడెన్ దాగి ఉన్న స్థావరంపై అమెరికన్ కమాండోలు దాడి చేసినప్పుడు వారికి సహకరించిన జాగిలం కూడా బెల్జియన్ మాలినాయిస్ జాతికి చెందినదే.

# కోహ్లీని, మోదీని చంపుతాం

## ఎన్ఐఏకు లేఖ రాసిన లష్కరే తాయిబా.. అప్రమత్తమైన భద్రతా వర్గాలు



**న్యూఢిల్లీ:** టీమ్ ఇండియా సారథి విరాట్ కోహ్లీని, ప్రధాని మోదీని హతమార్చుతామని ఉగ్రవాద సంస్థ 'ఆలిండియా లష్కరే తాయిబా' హెచ్చరించింది. ఈ మేరకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు ఓ లేఖ పంపింది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్, నిర్మలా సీతారామన్, జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్, బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా, బీజేపీ సీనియర్ నేత అద్వానీ, ఆరెస్సెస్ అధిపతి మోహన్ భాగవత్ సహా 12 మంది తమ హిట్‌లిస్ట్‌లో ఉన్నారన్నది. ప్రముఖులను హతమార్చుతామని గతంలో పలు ఉగ్రవాద సంస్థలు హెచ్చరించినా వారి హిట్‌లిస్ట్‌లో ఓ క్రికెటర్ పేరు ఉండటం ఇదే తొలిసారి. పాక్ కేంద్రంగా పనిచేసే లష్కరే తాయిబా పేరుతో కాక.. కేరళలోని కోజికోడ్ జిల్లా కేంద్రంగా పనిచేసే 'ఆలిండియా లష్కరే తాయిబా హై పవర్ కమిటీ' పేరుతో ఈ లేఖ ఉండటం గమనార్హం. ఈ లేఖపై స్పందించిన ఎన్ఐఏ భద్రతా వర్గాలకు సమాచారం అందించింది. హిట్‌లిస్ట్‌లో ఉన్నవారికి భద్రతను పటిష్ఠం చేయాలని సూచించింది. లేఖ కాపీని క్రికెట్ బోర్డుకు కూడా పంపింది. వచ్చే నెల 3న ఢిల్లీలోని అరుణ్‌జైట్లీ క్రికెట్ మైదానంలో బంగ్లాదేశ్‌తో టీ20 మ్యాచ్ జరుగనున్న నేపథ్యంలో ఉగ్రవాదులు భారత టీం సభ్యులందరినీ టార్గెట్ చేసే అవకాశముందని, కాబట్టి భద్రతా చర్యలను పటిష్ఠం చేయాలని ఎన్ఐఏ సూచించింది.



పెద్దపల్లి ఎమ్మెల్యే స్వచ్ఛబాట పట్టారు. స్వచ్ఛతే హీ సేవలో భాగంగా ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి జిల్లా కేంద్రంలో అధికారులతో కలిసి రోడ్ల వెంట ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. - పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ

## చివరి ఆయకట్టుకు చేరిన గోదావరి జలాలు

**అర్వపల్లి:** ఎస్సారెస్పీ రెండోదశ కాల్వల చివరి ఆయకట్టు వరకు గోదావరి జలాలు అందినట్టు సీఎంవో ఓఎస్డీ శ్రీధర్‌దేశ్ పాండే పేర్కొన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లాలోని ఎస్సారెస్పీ డీబీఎం-71 కాల్వను ఆయన ఎస్సారెస్పీ అధికారుల బృందంతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డీబీఎం-71 కాల్వ ద్వారా ప్రతి ఎకరాకు గోదావరి నీటిని అందించనున్నట్టు తెలిపారు. డీబీఎం-71 కాల్వ పరిధిలోని ప్రతి చెరువు, కుంటలను గోదావరి జలాలతో నింపడమే లక్ష్యమని చెప్పారు. సుమారు 69 కిలోమీటర్ల పొడవున్న డీబీఎం-71 కాల్వకు గోదావరినీరు రావడం మొదటిసారి అని తెలిపారు. టెయిల్(చివర) నుంచి హెడ్(మొదట) వరకు గోదావరి జలాల పంపిణీ పద్ధతి విజయవంతమైందని చెప్పారు. పెన్‌పహాడ్ మండలం మాచారం గ్రామశివారులో గోదావరి జలాలతో కళకళలాడుతున్న రావిచెరువును చూసి ఆనందం వ్యక్తంచేశారు. ఆయన వెంట ఎస్సారెస్పీ ఈఎన్సీ నాగేందర్‌రావు, డీసీఈ దేవేందర్‌రెడ్డి, ఎస్ఈ సుధీర్, ఈఈ నారాయణ, డీఈ రవికుమార్, ఏఈలు తదితరులు ఉన్నారు.

వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేటలో నేతకాని కులస్థుల మూడు రోజుల 'దీపావళి-బతుకమ్మ' వేడుకలు మంగళవారం ముగిశాయి. మొదటి రోజు కేదారీశ్వరస్వామి వ్రతకల్పంతో ప్రారంభమైన వేడుకలు రెండో రోజైన సోమవారం గ్రామంలోని పురుషులు జోడెద్దుల ప్రతిమలను నిమజ్జనం చేశారు. చివరిరోజైన మంగళవారం బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహిళలంతా బతుకమ్మలతో ఊరేగింపుగా ఊరు శివారులోని చెరువు గట్టుకు చేరుకొని ఆటపాటలతో అలరించారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు. - హసన్‌పర్తి(వరంగల్)





# రోడ్డెక్కిన 6,441 బస్సులు

- యథావిధిగా ఆర్టీసీ సేవలు
- సత్ఫలితాలిస్తున్న ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- పరిస్థితిని సమీక్షిస్తున్న మంత్రి పువ్వాడ, ఇంచార్జి ఎండీ సునీల్‌శర్మ
- ఖమ్మంలో తాత్కాలిక సిబ్బందిని అడ్డుకున్న ఆర్టీసీ కార్మికులపై కేసు



ఖమ్మం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



జనగామ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు, విద్యార్థులు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్/ హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీసమ్మె నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యామ్నాయచర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 4,526 ఆర్టీసీ, 1,915 అద్దెబస్సులు కలిసి మొత్తం 6,441 బస్సులు తిరిగినట్టు ఆర్టీసీ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 4,526 మంది తాత్కాలిక డ్రైవర్లు, 6,441 మంది తాత్కాలిక కండక్టర్లు విధులు నిర్వర్తించారు. గ్రామీణ ప్రాంతాలకు బస్సులను నడిపిస్తుండటంతో్ ప్రయాణికులకు ఇబ్బందులు తప్పుతున్నాయి. రవాణా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఆర్టీసీ ఇంచార్జి ఎండీ సునీల్‌శర్మ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ అధికారులకు సూచనలు చేస్తున్నారు. వందశాతం ఆర్టీసీ బస్సులను నడిపించేందుకు ప్రత్యేకశ్రద్ధతో పనిచేస్తున్నారు. వరంగల్ రీజియన్‌లో 9 డిపోలుండగా, మొత్తం 866 బస్సులకుగాను మంగళవారం 709 బస్సులు ప్రయాణికులకు సేవలందించాయి. రద్దీకనుగుణంగా హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, భూపాలపల్లి, ఏటూర్‌నాగారం, సిద్దిపేట, పాలకుర్తి, నిజామాబాద్, నర్సంపేట రూట్లలో బస్సుల సంఖ్యను పెంచారు. ఉమ్మడి మెదక్ రీజియన్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఉన్న 8 డిపోల పరిధిలో మంగళవారం 544 బస్సులు ప్రయాణికులకు సేవలందించాయి. అందులో 385 ఆర్టీసీ, 159 ప్రైవేట్ బస్సులు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలోని నాలుగు డిపోల నుంచి 310 బస్సులను వివిధ రూట్లలో నడిపించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట డిపోలో 65 ఆర్టీసీ, 15 అద్దె బస్సులతో పాటు ఇతర ప్రైవేట్ వాహనాలు కలిపి మొత్తం 138 వాహనాలు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశాయి. సూర్యాపేట డిపోలో మొత్తం 97 బస్సులు, కోదాడ డిపో పరిధిలో మొత్తం 80 బస్సులు రోడ్డెక్కాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో 63 ఆర్టీసీ, 37 అద్దె బస్సులు రాకపోకలు కొనసాగించాయి. నారాయణపేట జిల్లాలో మొత్తం 79 ఆర్టీసీ, 34 హైర్ బస్సులు వివిధ రూట్లల్లో తిరిగాయి. వనపర్తి జిల్లాలో 95 బస్సులు, గద్వాల డిపో నుంచి 94 బస్సులను, వికారాబాద్, తాండూరు, పరిగి డిపోల నుంచి 198 బస్సులు ప్రయాణికులను నడిపారు. కరీంనగర్ రీజియన్‌లోని నాలుగు జిల్లాల్లో లక్ష్యానికి మించి బస్సులు నడిపించారు. 467 ఆర్టీసీ, 196 అద్దె బస్సులు నడిపారు.

✦ నిజామాబాద్ రీజియన్‌లో 460 బస్సులను నడిపించారు. ఆదిలాబాద్ జిల్లాలో 212 వాహనాలను అధికారులు ప్రయాణికులకు అందుబాటులో ఉంచారు. నిర్మల్ జిల్లాలో నిర్మల్ డిపో పరిధిలో 214, భైంసా డిపో పరిధిలో 55 బస్సులు నడిచాయి. ఇందులో 112 ఆర్టీసీ బస్సులు, 47 అద్దె బస్సులు, 110 ప్రైవేటు వాహనాలు ఉన్నాయి.

✦ ఖమ్మం జిల్లాలో ఖమ్మం, సత్తుపల్లి, మధిర డిపోల్లో బస్సులు యథావిధిగా నడిచాయి. సత్తుపల్లిలో అఖిలపక్షం బంద్ ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో మొత్తం 264 వివిధ వాహనాలు తిరిగాయి. ఖమ్మం డిపోలో తాత్కాలిక డ్రైవర్ కోటేశ్ విధులకు హాజరు కాకుండా అడ్డగించిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 90 శాతానికి పైగా ఆర్టీసీ బస్సులు నడిచాయి.

**ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుబోల్తా: ఆరుగురికి గాయాలు**

**వేములపల్లి:** ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పిడుగురాళ్ల ఆర్టీసీ డిపో బస్సు మంగళవారం తెల్లవారుజామున నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం వద్ద అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులతోపాటు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ బస్సు హైదరాబాద్ నుంచి ఆరుగురు ప్రయాణికులతో బస్సు పిడుగురాళ్లకు వెళ్తుంది. బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి దూసుకుపోవడంతో స్తంభం విరిగి కరెంట్ తీగలు బస్సుపై వాలాయి. ఫైబర్‌ఫ్రేమ్ కావడంతో త్రుటిలో భారీ ప్రమాదం తప్పింది.

## టీఎంయూకు నర్సింగరావు రాజీనామా



మాట్లాడుతున్న నర్సింగరావు

సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో టీఎంయూ గౌరవాధ్యక్షుడు నర్సింగరావు మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన యూనియన్ నాయకులకు రాజీనామా పత్రాన్ని సమర్పించారు. అనంతరం గజ్వేల్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కార్మికసంఘాల నేతల తప్పుడు నిర్ణయాల వల్ల కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రాజకీయ ప్రయోజనాల కోసం యూనియన్ నాయకులు సొంత నిర్ణయాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. టీఎంయూ జెండాను ఏకపక్షంగా మార్చడం తనకు బాధ కలిగించిందని ఆయన పేర్కొన్నారు.



బాన్సువాడ పట్టణంలోని ఎన్జీవోస్‌కాలనీలో పర్యటిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

## బంగారు బాన్సువాడగా మార్చడమే లక్ష్యం

స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

**బాన్సువాడ, నమస్తే తెలంగాణ:** బాన్సువాడ డివిజన్ కేంద్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి, బంగారు బాన్సువాడగా మార్చడమే లక్ష్యమని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బాన్సువాడ పట్టణంలోని ఎన్జీవోస్‌కాలనీ, టీచర్స్‌కాలనీ, పోచమ్మగల్లీ, మదీనాకాలనీ, ఇస్లాంపూర్, గౌలిగూడ కాలనీల్లో జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండేతో కలిసి ఎలక్ట్రిక్ వాహనంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేటీఆర్ సహకారంతో బాన్సువాడను మున్సిపాలిటీగా మార్చామని, బాన్సువాడకు రూ.25 కోట్లు మంజూరు చేయించినట్టు తెలిపారు. పట్టణంలో 8,700 ఇండ్లకు మిషన్ భగీరథ నల్లాలు బిగించి తాగునీటి సౌకర్యం కల్పించామని, అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు.



యాదగిరిగుట్ట పట్టణంలో వృత్తి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, విప్ గొంగిడి సునీతారెడ్డి, జెడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి ఉన్నారు.

## మహా దివ్యక్షేత్రంగా యాదాద్రి

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- సీఎం కేసీఆర్ చిత్రపటానికి మంత్రి క్షీరాభిషేకం

**యాదాద్రిభువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** యాదాద్రి అతి త్వరలోనే మహా దివ్యక్షేత్రంగా భక్తులకు దర్శనమివ్వనున్నదని ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఎంపీ బడుగుల లింగయ్యాయాదవ్, ప్రభుత్వవిప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి, జెడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డితో కలిసి మంగళవారం యాదాద్రిలో శ్రీలక్ష్మీనరసింహాస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం యాదాద్రిలో ఆలయ విస్తరణ పనులను పరిశీలించారు. యాదగిరిగుట్ట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్ర శిక్షణ, ఉపాధి దోహద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఆలేరు మండలంలోని కొలనుపాకలో అతి పురాతనమైన సోమేశ్వరాలయాన్ని సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చొరవ, చిన్న జీయర్ స్వామి వారి ఆశీస్సులతో యాదాద్రి ఆలయ విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయని, తిరుమల తరహాలో ఇక్కడ మహానగరం ఆవిష్కృతం కానున్నదని చెప్పారు.

**సీఎం కేసీఆర్ చిత్రపటానికి మంత్రి క్షీరాభిషేకం**

సీఎం కేసీఆర్ చిత్రపటంతో ఉన్న ఫ్లెక్సీకి మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యాయాదవ్ క్షీరాభిషేకం చేశారు. నీరా ఉత్పత్తులను విక్రయించేందుకు కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు గీత కార్మికులు రుణపడి ఉంటారని వారు ఈ సందర్భంగా చెప్పారు. అనంతరం యాదగిరిపల్లి గీత కార్మికులు మంత్రికి మోకును బహూకరించారు.

**అర్హులైన జర్నలిస్టులకు డబుల్‌బెడ్‌రూం ఇండ్లు**

**మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ/తెలంగాణ చౌరస్తా:** అర్హులైన ప్రతి జర్నలిస్టుకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్రిష్టియన్‌పల్లిలో జర్నలిస్టులకు డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి కలెక్టర్ రొనాల్డ్‌రోస్‌తో కలిసి భూమి పూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ.. క్రిష్టియన్‌పల్లిలో 10 ఎకరాల స్థలాన్ని ఇండ్ల నిర్మాణానికి ఎంపిక చేసినట్టు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నదన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో నూతనంగా ఎన్నికైన టీఎన్జీవో జిల్లా కమిటీని మంత్రి అభినందించారు.

## అటవీ అధికారులపై రైతు కుటుంబం దాడి

బీట్ ఆఫీసర్ స్వప్నకు తీవ్రగాయాలు



దాడికి గురైన బీట్ అధికారి స్వప్న

**నెన్నెల:** అటవీశాఖ భూమిలో అక్రమంగా మామిడితోట సాగుచేస్తున్నారని తెలిసి అడ్డుకొనేందుకు వెళ్లిన అటవీ అధికారులపై ఓ రైతు కుటుంబం మంగళవారం దాడికి పాల్పడింది. మంచిర్యాల జిల్లా కృష్ణపల్లి అటవీ రేంజి పరిధిలోని కన్నెపల్లి మండలం రెబ్బెన సెక్షన్ కొత్తపల్లి శివారులో ఆక్రమణకు గురైన అటవీ భూమిలోని చెట్లను తొలగించేందుకు రేంజ్ అధికారి గోవింద్‌చంద్ సర్దార్ మరో పది మంది సిబ్బంది వెళ్లారు. రైతు దరావత్ బాలునాయక్, అతని భార్య, ఇద్దరు కుమారులతో అటవీ అధికారులతో వాగ్వాదానికి దిగి, కారంచల్లి, రాళ్లతో దాడిచేశారు. దాడిలో రెబ్బెన సెక్షన్ బీట్ అధికారి స్వప్న చేతికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం బాలునాయక్ తప్పించుకుని అక్కడినుంచి వెళ్లిపోయారు. ఇదే భూమిని రెండేండ్ల కిందట స్వాధీనం చేసుకునేందుకు వెళ్లగా బాలునాయక్ ఆత్మహత్యకు యత్నించారు. దాడి చేసిన నలుగురుపై నెన్నెల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు రేంజి అధికారి గోవింద్‌చంద్ సర్దార్ తెలిపారు. అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షణ కల్పించేందుకు కృషిచేస్తామని బెల్లంపల్లి ఏసీపీ రహమాన్ తెలిపారు. అధికారులు రక్షణ కావాలని అడిగితే కల్పిస్తామని చెప్పారు. దాడిచేసిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట బెల్లంపల్లి రూరల్ సీఐ జగదీశ్, ఎస్సై మొగిలి ఉన్నారు.

## ఖనిలో ట్రిపుల్ తలాక్ కేసు

**ఫెర్టిలైజర్‌సిటీ:** ప్రేమించి పెండ్లి చేసుకొని నాలుగేండ్లపాటు కాపురం చేసి.. అదనపు కట్నం కోసం వేధించడమేకాకుండా ట్రిపుల్ తలాక్ చెప్పి ఇంట్లో నుంచి గెంటేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని తిలక్‌నగర్‌కు చెందిన నిషిత అఫ్రిన్, స్థానిక రమేశ్‌నగర్‌కు చెందిన అర్షద్‌పాషా 2015లో ప్రేమవివాహం చేసుకున్నారు. వీరికి బాబు(1) ఉన్నాడు. కొద్దిరోజులుగా అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో అఫ్రిన్‌ను భర్తతోపాటు అత్త నజీమున్నీసా, మామ కరీం పాషా, మరిది ఇర్షద్ పాషా, ఆడబిడ్డలు ఉన్నీసా, నికత్ ఉన్నీసా, ఇతర కుటుంబ సభ్యులు వేధించడం మొదలుపెట్టారు. ఈ నెల 17న భర్త అర్షద్ పాషా ట్రిపుల్ తలాక్ చెప్పి అఫ్రిన్‌ను ఇంట్లో నుంచి గెంటేశాడు. అఫ్రిన్ ఫిర్యాదు మేరకు భర్త, అత్తమామలతోపాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

## కారు బోల్తాపడి ఒకరి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం
- దవాఖానకు తరలింపు



శివ మృతదేహం

**మానకొండూర్ రూరల్:** కారు బోల్తాపడి ఒకరు మృతిచెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి శివారులో మంగళవారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి వరంగల్-కరీంనగర్ ప్రధాన రహదారిలో వరంగల్ నుంచి కారు (టీఎస్26సీ 3851)లో శివ(24), సమీర్, సుస్మా కరీంనగర్ వైపుగా వస్తున్నారు. గట్టుదుద్దెనపల్లి శివారులో ఉన్న పెట్రోల్ పంపు మూలమలుపు ప్రాంతంలో ముందుగా వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టెక్ చేయబోయే క్రమంలో వీరి కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శివ అక్కడికక్కడే మృతిచెందగా, సమీర్, సుస్మా పరిస్థితి విషమంగా ఉంది. డ్రైవర్ కార్తీక్ క్షేమంగా ఉన్నాడు. స్థానికులు వెంటనే 108, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కరీంనగర్ దవాఖానకు తరలించారు. కారులో ప్రయాణిస్తున్న వారంతా మహబూబ్‌నగర్‌కు చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. కాగా, పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.



జగిత్యాల జిల్లాలోని ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం కార్తీక శోభను సంతరించుకున్నది. మంగళ వారం సాయంత్రం పండితులు, అర్చకులు గోదావరి నదికి హారతినిచ్చి, ప్రత్యేక పూజలు చేశారు. - ధర్మపురి,నమస్తేతెలంగాణ

## రూ.50 కోసం హత్య!

ఒకే దుకాణంలో కూలీలుగా పనిచేస్తున్న ఇద్దరి మధ్య గొడవ

**లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 29:** డబ్బు పంపకాల్లో 50 రూపాయలు తేడా రావడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగి, ఒకరి హత్యకు దారితీసింది.. లక్ష్మీదేవిపల్లి ఏఎస్ఐ నారాయణ కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లిలోని ఓ టెంట్ దుకాణంలో తాటి కోటి, మడకం మురళీమోహన్ (36) కొన్నేండ్లుగా కూలీలుగా పనిచేస్తున్నారు. సోమవారం డబ్బు పంపకంలో రూ.50 కోసం గొడవపడి.. మద్యం మత్తులో ఉన్న మురళీమోహన్ కర్రతో కోటిపై దాడి చేశారు. సోమవారం రాత్రి మద్యం తాగి సెకండ్‌షో సినిమాకు వెళ్లి వచ్చిన కోటి.. లక్ష్మీదేవిపల్లి జాతీయ రహదారి పక్కన ఒక దుకాణం షట్టర్ వద్ద పడుకొన్న మురళీమోహన్ తలపై కర్రతో దాడిచేయగా, అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మోహన్ కుమారుడు ప్రసాద్ పోలీసులుకు ఫిర్యాదు చేశారు. హత్యకు పాల్పడిన కోటి పరారీలో ఉన్నట్టు ఏఎస్ఐ నారాయణ తెలిపారు. మోహన్ భార్య ఐదేండ్ల క్రితం చనిపోయింది.

# శ్రీశైలానికి స్థిరంగా వరద

- 1,70,529 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఎస్సారెస్పీ గేట్ల మూసివేత
- నిజాంసాగర్‌కు స్వల్ప ఇన్‌ఫ్లో
- లక్ష్మీబరాజ్‌లో 20 గేట్లు ఎత్తి నీటి విడుదల



నాగార్జునసాగర్ ప్రాజెక్టు 8 క్రస్టు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో స్థిరంగా కొనసాగుతున్నది. జూరాల, సుంకేశుల నుంచి 1,70,529 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 2,12,416 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. ప్రాజెక్టు గరిష్ఠనీటిమట్టం 885 అడుగులకు గాను మంగళవారం నాటికి 884 అడుగులకు చేరుకున్నది. 215 టీఎంసీలకు గాను 214 టీఎంసీలకు చేరింది. జూరాలకు వరద ప్రవాహం కొనసాగుతున్నది. 1,27,000 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండగా.. 1,09,583 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. ఆల్మట్టి ప్రాజెక్ట్‌కు 56,930 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 51,548 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. నారాణయణపుర ప్రాజెక్ట్‌కు 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 10,640 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. తుంగభద్ర డ్యాంకు 58,289 ఇన్‌ఫ్లో నమోదవగా.. 57,933 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. నాగార్జునసాగర్‌కు 1,71,180 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా అదేస్థాయిలో అవుట్‌ఫ్లో నమోదైంది. మూసీ ప్రాజెక్టుకు వెయ్యి క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 84 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. పులిచింతల ప్రాజెక్టుకు 91,906 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 1,06,156 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి 452 క్యూసెక్కుల వరద చేరుతున్నది. పూర్తిస్థాయి నీటిమట్టం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 17.802 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.719 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నిజామాబాద్ జిల్లాలోని ఎస్సారెస్పీ వరద గేట్లను మూసివేశారు. 1091 అడుగుల నీటిమట్టం, 90.313 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న ఎస్సారెస్పీ మంగళవారం సాయంత్రానికి పూర్తిస్థాయి నీటి మట్టంతో ఉన్నది. 14,520 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవగా.. ఐదు ఎస్కేప్ గేట్ల ద్వారా 2,500 క్యూసెక్కులు, కాకతీయ కాల్వ ద్వారా 5,500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

**ఎల్లంపల్లికి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో**

ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 51,162 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. దీంతో 8 గేట్లను ఎత్తి 43,440 క్యూసెక్కుల నీటిని దిగవకు వదులుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జిల్లా పరిధిలో మంథని మండలం సిరిపురంలో నిర్మించిన పార్వతి బరాజ్‌కు 43 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 38 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో సరస్వతి బరాజ్ వైపు వదులుతున్నట్టు అధికారులు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని లక్ష్మీ బరాజ్‌లో మంగళవారం 20 గేట్లను ఎత్తినట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ బరాజ్‌లో 95.40 మీటర్ల ఎత్తులో 5.172 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. 2 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1.80 లక్షల అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులోని సరస్వతీ బరాజ్ అన్ని గేట్లను మూసి వేశారు. మధ్యాహ్నం ఇన్‌ఫ్లో పది వేలకు చేరడంతో బరాజ్‌లో అన్ని గేట్లు మూసివేశారు. బరాజ్‌లో 9 టీఎంసీ నీరు నిల్వ ఉన్న ట్టు ఇంజినీర్లు తెలిపారు. సరస్వతి బరాజ్ నుంచి వస్తున్న నీరు తగ్గడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కాళేశ్వరం వద్ద గోదావరి నది నిలకడగా ప్రవహిస్తున్నది. మంగళవారం ఉదయం కాళేశ్వరం వద్ద రెండు లక్షల క్యూసెక్కులు రాగా, సాయంత్రం వరకు 1,90,000 క్యూసెక్కులుగా ఉన్నది. 8.20 మీటర్ల ఎత్తులో పారుతున్నట్టు అధికారులు తెలిపారు.

## బాబ్లీ ప్రాజెక్టు గేట్ల మూసివేత

హాజరైన సీడబ్ల్యూసీ, మూడు రాష్ట్రాల అధికారులు



**కమ్మర్‌పల్లి, నమస్తేతెలంగాణ:** ఎస్సారెస్పీ ఎగువన గోదావరిపై మహారాష్ట్రలో ఉన్న బాబ్లీ ప్రాజెక్టు గేట్లను సుప్రీంకోర్టు ఆదేశాల అమలులో భాగంగా మంగళవారం మూసివేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. ఏటా బాబ్లీ గేట్లను జూలై ఒకటిన తెరిచి, అక్టోబర్ 29న మూసివేస్తారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం కేంద్ర జల సంఘం అధికారులు, ఎస్సారెస్పీ అధికారులు, ఆంధ్రప్రదేశ్ అధికారులు బాబ్లీకి చేరుకున్నారు. కేంద్ర జల సంఘం నుంచి ఈఈ గంగాధర్, ఎస్సారెస్పీ ఈఈ రామారావు, నాందేడ్ ఈఈ గవానే, ఆంధ్రప్రదేశ్ నుంచి ఈఈ మోహన్ రావు, ఎస్సారెస్పీ డీఈఈ జగదీశ్ బాబ్లీ గేట్ల మూసివేత ప్రక్రియకు హాజరయ్యారు. మధ్యాహ్నం 1.35 గంటలకు ప్రాజెక్టుకున్న మొత్తం 14 గేట్లను అధికారుల సమక్షంలో మూసివేశారు.

నమస్తే తెలంగాణ
# ఆట
8
[ కరీంనగర్ ]
బుధవారం 30 అక్టోబర్ 2019
WWW.NTNEWS.COM

## కిలిమంజారోను అధిరోహించిన హైదరాబాద్ దివ్యాంగుడు

ఈ ఘనత సాధించిన తొలి ట్రిపుల్ ఆంపుటీగా శేఖర్ గౌడ్ చరిత్ర




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ క్రీడాప్రతినిధి:** సంకల్పం ముందు ఎంతటి కఠిన లక్ష్యమైనా, ఆకాశాన్నంటే పర్వతమైనా తల దించాల్సిందేనని హైదరాబాద్‌కు చెందిన దివ్యాంగుడు శేఖర్ గౌడ్ నిరూపించాడు. ఒక్క కాలే ఉన్నా కృత్రిమ అవయవాల సాయంతో ఆఫ్రికా ఖండంలోని అత్యంత ఎతైన పర్వతం కిలిమంజారో (19,341 అడుగులు)ను అధిరోహించాడు. ఈ ఘనత సాధించిన తొలి ట్రిపుల్ ఆంపుటీగా (మూడు కృత్రిమ అవయవాలు గల) చరిత్ర సృష్టించాడు. ఈ నెల 22న వారి జట్టు అధిరోహణ ప్రారంభించగా.. 19,341 అడుగుల ఎత్తు ఉన్న శిఖరాగ్రానికి ఈ నెల 27వ తేదీ ఉదయం శేఖర్ చేరుకున్నాడు. అదే రోజే భావన దహారియా కూడా ఈ పర్వతాన్ని అధిరోహించారు. ఈ నెల 22న మోషి చేరుకున్న బృందం.. ఎన్నో వ్యయప్రయాసల కోర్చి ఆరు రోజుల అనంతరం 27న విజయవంతంగా శిఖరాగ్రానికి చేరారు.

## సెమీస్‌లో నిఖత్ జరీన్



**టోక్యో:** ఒలింపిక్ టెస్ట్ ఈవెంట్ బాక్సింగ్ టోర్నీలో ఏడుగురు భారత బాక్సర్లు సెమీఫైనల్ చేరారు. తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ (51 కేజీలు)తో పాటు నాలుగుసార్లు ఆసియా క్రీడల పతక విజేత శివ థాపా (63 కేజీలు) ఇందులో ఉన్నారు. మంగళవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో శివ 5-0తో యూకీ హిరాకవా (జపాన్)ను చిత్తుచేసి సెమీస్‌లో అడుగుపెట్టగా.. మిగిలిన ఆరుగురు బాక్సర్లు రింగ్‌లో దిగకుండానే సెమీఫైనల్‌కు చేరారు. బుధవారం జరుగనున్న సెమీస్ బౌట్‌లో జపాన్‌కే చెందిన డైసుకె నారిమసుతో శివ థాపా తలపడనున్నాడు. జరీన్, థాపాతో పాటు సుమిత్ సాంగ్వాన్ (91 కేజీలు), ఆశీష్ (69 కేజీలు), వన్‌లిమ్‌పుయ (75 కేజీలు), సిమ్రన్‌జీత్ కౌర్ (60 కేజీలు), పూజా రాణి (75 కేజీలు) సెమీస్ చేరడం ద్వారా కనీసం కాంస్య పతకాలు ఖాయం చేసుకున్నారు. మరో భారత బాక్సర్ అనంత్ చోప్రా క్వార్టర్స్‌లో 2-3తో తోషో కశివాసకి (జపాన్) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

## త్వరలోనే వస్తా



**న్యూఢిల్లీ:** తాను అతి త్వరలో మైదానంలో అడుగుపెడుతానని టీమ్ఇండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఆశాభావం వ్యక్తం చేశాడు. జిమ్‌లో కసరత్తులు చేస్తున్న ఫొటోను అతడు మంగళవారం ట్వీట్ చేశాడు. దీంతో పాటు కమింగ్ సూన్ అనే క్యాప్షన్ ఇచ్చాడు. వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ అనంతరం వెన్నునొప్పి కారణంగా కొంత కాలంగా ఆటకు దూరమైన స్పీడ్‌స్టర్ క్రమంగా కోలుకుంటున్నాడు. దీంతో అతడికి శస్త్రచికిత్స అవసరం లేదని, సహజంగానే గాయం నయమవుతుందని బ్రిటన్ వైద్యులు తేల్చారు. బుమ్రా ఇప్పటికే రన్నింగ్‌తో పాటు వ్యాయామం సైతం చేస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

# ఈడెన్‌లో గులాబీ



> డే అండ్ నైట్ టెస్టు ఆడేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అంగీకరించింది. ఇది టెస్టు క్రికెట్ పురోగతికి దోహదపడుతుంది. నేనూ నా సహచరులంతా దీనికోసం చాలా కృషి చేశాం. మేం ఇక్కడ ఉన్నది ఇందుకే. గులాబీ బంతితో ఆడేందుకు ఒప్పుకున్న విరాట్ కోహ్లీకి ధన్యవాదాలు.
>
> **- గంగూలీ, బీసీసీఐ అధ్యక్షుడు.**



## భారత టెస్టు చరిత్రలో సరికొత్త అధ్యాయం

రెండో టెస్టు డే అండ్ నైట్‌గా ఆడేందుకు అంగీకరించిన బంగ్లాదేశ్.. నవంబర్ 22న టీమ్ఇండియా తొలి 'ఫ్లడ్ లైట్ టెస్ట్'

**ఇటీవల దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన అనంతరం విరాట్ కోహ్లీ మాట్లాడుతూ.. టెస్టులకు ప్రేక్షకాదరణ పెరగాలంటే పేరెన్నికగన్న ఐదారు టెస్టు సెంటర్లు ఉంటే చాలని అన్నాడు. దీంతో పాటు ఆటను అభిమానులకు మరింత చేరువ చేయడానికి అనువైన మార్గాలను అన్వేషించాల్సిన అవసరముందన్నాడు. అప్పటికి సౌరవ్ గంగూలీ బీసీసీఐ అధ్యక్ష పీఠం అధిరోహించలేదు. నామినేషన్ మాత్రమే వేశాడు. వెంటనే ఈ విషయంపై దృష్టి సారించిన దాదా వారం తిరిగేలోపే చకచకా అన్నీ చక్కబెట్టాడు. డే నైట్ టెస్టులు ఆడే విషయంలో ముందు టీమ్ఇండియా కెప్టెన్ కోహ్లీతో ముచ్చటించాడు. దీనికి విరాట్ నుంచి సానుకూల స్పందన రావడంతో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కి లేఖ రాశాడు. దాదా కోరడం.. బంగ్లాదేశ్ కూడా ఎప్పటి నుంచో ఇలాంటి అవకాశం కోసమే ఎదురు చూస్తుండటంతో వెంటనే అటు నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ వచ్చింది. దీంతో ఎట్టకేలకు టీమ్ఇండియా ఫ్లడ్‌లైట్ల వెలుగులో గులాబీ బంతితో తొలిసారి మైదానంలో దిగనుంది. ఇంకెందుకు ఆలస్యం.. క్రికెట్ అంటే పడిచచ్చే ఈడెన్ గార్డెన్స్ అభిమానులారా సిద్ధమైపోండి..! వచ్చే నెల 22నే పింక్ టెస్టుకు తెరలేచేది.**

**కోల్‌కతా:** భారత క్రికెట్ చరిత్రలో మరో అరుదైన ఘట్టానికి ఈడెన్ గార్డెన్స్ వేదిక కానుంది. బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌లో భాగంగా నవంబర్ 22-26 మధ్య ఇక్కడ జరుగనున్న రెండో టెస్టు మ్యాచ్‌ను టీమ్ఇండియా గులాబీ బంతితో ఆడనుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో నాలుగేండ్ల క్రితమే తొలి డే అండ్ నైట్ టెస్టు జరిగినా.. భారత్ మాత్రం ఫ్లడ్ లైట్‌ల కింద ఆడేందుకు ఇన్నాళ్లు ససేమీరా అంటూ వచ్చింది. సౌరవ్ గంగూలీ బీసీసీఐ అధ్యక్ష పీఠం అధిరోహించాక కెప్టెన్ కోహ్లీతో ఈ అంశంపై చర్చించాడు. దీనికి విరాట్ సమ్మతం తెలపడంతో బంతి దాదా కోర్టుకు చేరింది. బెంగాల్ టైగర్ స్వయంగా బంగ్లా క్రికెట్ బోర్డుకు లేఖ రాయడంతో పాటు వారితో డే నైట్ టెస్టుకు ఓకే అనిపించాడు. దీంతో గత వారం రోజులుగా నెలకొన్న సందిగ్ధతకు తెరపడినట్లైంది.



### సమస్యలేంటి..

గతేడాది చివర్లో టీమ్ఇండియా ఆస్ట్రేలియా పర్యటనకు బయల్దేరే ముందే క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) డె అండ్ నైట్ టెస్టు ప్రతిపాదన బీసీసీఐ ముందుంచింది. ఆసీస్ పర్యటనకు వస్తున్న అన్ని జట్లు ఒక్క మ్యాచ్‌నైనా గులాబీ బంతితో ఆడుతున్నాయని పట్టుబట్టింది. అయినా భారత బోర్డు మాత్రం సీఏ ప్రతిపాదనను తిరస్కరించింది. సంప్రదాయ క్రికెట్ ప్రభ కోల్పోతున్న తరుణంలో ఐదురోజుల ఆటను ఆసక్తికరంగా మార్చేందుకు జరుగుతున్న మార్పులకు ఎట్టకేలకు బీసీసీఐ కూడా పచ్చ జెండా ఊపింది. అయితే అసలు పింక్ బంతితో ఆడేందుకు భారత్ విముఖత చూపడానికి ప్రధాన కారణం.. బంతి పాతబడ్డాక స్పిన్నర్లకు పట్టు చిక్కకపోవడమే. టెస్టుల్లో టీమ్ఇండియా ప్రధాన బలం స్పిన్ బౌలింగే అనేది ఎప్పటి నుంచో ఉన్నదే. బంతిపై ఉన్న మెరుపు తొలగించడం వరకే పేసర్ల పని ఆ తర్వాత మిగిలిన భారమంతా స్పిన్నర్లే చూసుకునే చందంగా భారత బౌలింగ్ ఉండేది. కానీ ఇటీవలి కాలంలో టీమ్ఇండియా పేస్ విభాగం రాటుదేలింది. స్పిన్నర్లతో పోటీపడి మన పేసర్లు వికెట్లు పడగొడుతున్నారు. ఇటీవలి దక్షిణాఫ్రికా సిరీసే దీనికి చక్కటి ఉదాహరణ. ఎప్పటికైనా పింక్ బంతితో ఆడాల్సిందే.. అలాంటిది మంచి పేస్ బలగం ఉన్న సమయంలోనే.. బలహీన ప్రత్యర్థి బంగ్లాదేశ్‌పై ఆ ప్రయోగం చేస్తే పోలా అని కోహ్లీ కూడా భావించి ఉంటాడు. ఇక సన్నద్ధత విషయానికొస్తే.. ఇరు జట్లకు సమానమైన సమయమే ఉంది. గతంలో ఈ రెండు జట్లు గులాబీ బంతితో మ్యాచ్ ఆడింది లేదు. కాబట్టి ఎవరికీ అదనపు ప్రయోజనం ఉండదు. ఇక బంతి నాణ్యత విషయం అంటారా మందు మొదలు పెడితే కదా ప్రత్యామ్నాయాలు అందుబాటులోకి వచ్చేది.

### లంచ్, టీ స్థానంలో.. టీ, డిన్నర్

డే అండ్ నైట్ టెస్టు మ్యాచ్ మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమవుతుంది. మామూలు మ్యాచ్‌ల మాదిరిగా ఇందులో లంచ్ బ్రేక్ ఉండదు. మొదటి సెషన్ అనంతరం టీ విరామం.. ఆ తర్వాత రెండో సెషన్ పూర్తయ్యాక డిన్నర్ ఉంటుంది. నిర్ణీత ఓవర్లు పూర్తి కాకుంటే చివరి సెషన్‌ను పొడిగించే అవకాశం ఉంటుంది. వెలుతురులేమి కారణంగా మ్యాచ్‌ను ముందే ముగించే ఇబ్బంది తలెత్తదు.

## ఫలించిన దాదా దౌత్యం

**నాయకుడు** ఎక్కడున్నా నాయకుడే అన్న నానుడిని నూటికి నూరుపాళ్లు నిజం చేస్తూ.. సౌరవ్ గంగూలీ అనుకున్నది సాధించాడు. భారత్‌లో తొలి డే అండ్ నైట్ టెస్టు నిర్వహణకు రంగం సిద్ధం చేసి సంప్రదాయ క్రికెట్‌కు పూర్వ వైభవం తీసుకురావడంలో ప్రధానమైన మొదటి అడుగు వేశాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో మూడో టెస్టు జరిగిన రాంచీ స్టేడియం ప్రేక్షకులు లేక వెలవెలబోయిన దృశ్యాన్ని గమనించిన దాదా.. ఇకపై ఇలాంటి పరిస్థితులు ఎదురుకావొద్దనే ఉద్దేశంతో తెలివిగా పావులు కదిపాడు. ముందు కెప్టెన్ కోహ్లీని ఫ్లడ్‌లైట్ల కింద ఆడేందుకు ఒప్పించిన మాజీ సారథి ఆ తర్వాత బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కి విజ్ఞప్తి చేశాడు. రెండు మూడు రోజుల వ్యవధి తర్వాత ఈ అంశంపై మా అభిప్రాయం చెబుతాం అన్న బీసీబీ 24 గంటలు తిరిగేలోపే అంగీకారాన్ని తెలిపింది. ఈ వ్యవహారం అంతా సజావుగా సాగడం వెనుక దాదా దౌత్యం ఫలించిందనే చెప్పాలి. నాలుగేండ్ల క్రితం (2015 నవంబర్‌లో) ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మధ్య తొలి డే అండ్ నైట్ టెస్టు జరగ్గా.. అప్పటి నుంచి భారత్ విదేశీ పర్యటనకు వెళ్లే ప్రతీసారి ఆతిథ్య దేశాలు ఒక్క మ్యాచ్ అయినా గులాబీ బంతితో ఆడాలనే ప్రతిపాదనలు పెట్టడం దానిని బీసీసీఐ నిరాకరించడం యథాలాపంగా జరుగుతూ వస్తున్నది. సమస్య ఎలాంటిదో దాన్ని ఎదుర్కొంటే కదా తెలిసేది అనే వ్యక్తిత్వం గల దాదా.. ఈ విషయంలోనూ తనదైన మార్క్ చూపించాడు. ముందు బరిలో దిగి ఆడితేనే కదా గులాబీ బంతితో ఎదురయ్యే సమస్యలు ఏంటో తెలిసేది అంటు మనవాళ్లను రంగంలోకి దింపేందుకు రెడీ అయ్యాడు. బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా ఉన్న దశలోనే క్యాబ్ సూపర్ లీగ్ ఫైనల్‌ను గులాబీ బంతితో ఆడించిన అనుభవం గంగూలీకి ఉన్న విషయం తెలిసిందే. రాత్రి పూట మంచు ప్రభావం, స్పిన్నర్లకు బంతిపై పట్టు చిక్కకపోవడం, లైట్ల వెలుతురులో బంతి సరిగ్గా కనిపించకపోవడం, గులాబీ బంతి నాణ్యత అనుకున్న స్థాయిలో లేకపోవడంతో త్వరగా మెత్తబడటం ఇలాంటి కారణాల వల్ల ఇన్నాళ్లు డే అండ్ నైట్ టెస్టులకు దూరంగా ఉంటూ వస్తున్న టీమ్ఇండియా ఇక మైదానంలో ఈ సవాళ్లను ఎలా అధిగమిస్తుందో వేచి చూడాలి!

# షకీబ్‌పై నిషేధం

రెండేండ్లు వేటు వేసిన ఐసీసీ
బుకీ సంప్రదింపులను తెలుపకపోవడమే కారణం
భారత పర్యనటతో పాటు టీ20ప్రపంచకప్‌నకు దూరం

**ఢాకా:** ఆటగాళ్ల సమ్మెతో ఇప్పటికే అతలాకుతలమైన బంగ్లాదేశ్ క్రికెట్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు టెస్టు, టీ20 కెప్టెన్, స్టార్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) రెండేండ్లు సస్పెన్షన్ వేటు వేసింది. ఓ బుకీ పలుమార్లు సంప్రదించినా.. ఆ విషయాన్ని అవినీతి నిరోధక విభాగానికి (ఏసీయూ) తెలియజేయని కారణంగానే షకీబ్‌పై ఐసీసీ చర్యలు తీసుకుంది. తక్షణమే అతడిపై ఓ ఏడాది పూర్తి నిషేధం అమలు చేయనుండగా... తర్వాతి 12 నెలలు సస్పెండ్ చేసింది. దీంతో వచ్చే నెల జరిగే భారత పర్యటనకు అతడు దూరమయ్యాడు. వచ్చే ఏడాది ఐపీఎల్‌తో పాటు అక్టోబర్ 18 నుంచి నవంబర్ 15 వరకు జరిగే టీ20 ప్రపంచకప్(2020)నకు షకీబ్ అల్ హసన్ దూరం కానున్నాడు.



> నేను ప్రేమించే ఆటకు దూరమైనందుకు తీవ్ర వేదనకు గురవుతున్నా. అయితే బుకీల సంప్రదింపులను తెలుపనందుకు నాపై తీసుకున్న చర్యలను అంగీకరిస్తున్నా. క్రికెట్‌లో అవినీతిని అంతమొందించేందుకు ఆటగాళ్ల సాయాన్ని ఐసీసీ ఏసీయూ వినియోగించుకుంటున్నది. ఆ విధంగా నేను నా విధిని నిర్వర్తించలేదు. **- షకీబ్**

### మూడుసార్లు సంప్రదింపులు

భారత్‌కు చెందిన దీపక్ అగర్వాల్ అనే బుకీ.. షకీబ్‌ను మూడు సందర్భాల్లో సంప్రదించాడని ఐసీసీ తేల్చింది. మ్యాచ్‌లకు ముందుగానే జట్ల కూర్పు, అంతర్గత ప్రణాళికను తెలియజేయాలని షకీబ్‌ను కోరాడని వెల్లడించింది. 2017లో బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లో, ఆ తర్వాత జింబాబ్వే, శ్రీలంకతో జనవరి 2018లో జరిగిన త్రైపాక్షిక సీరీస్ సందర్భంలో షకీబ్‌తో అగర్వాల్ మాట్లాడడని వెల్లడించింది. అలాగే ఐపీఎల్లో సన్‌రైజర్స్ తరపున ఆడుతున్న బంగ్లా ఆల్‌రౌండర్‌ను 2018 ఏప్రిల్ 26న కింగ్స్ ఎలెవెన్‌తో మ్యాచ్‌కు ముందు కూడా అగర్వాల్ సంప్రదించాడని పేర్కొంది. అయితే ఈ విషయంపై షకీబ్ ఒక్కసారి కూడా ఐసీసీ అవినీతి నిరోధక విభాగానికి (ఏసీయూ) ఫిర్యాదు చేయలేదు. ఈ ఏడాది జనవరి, ఆగస్టులో ఐసీసీ ఏసీయూతో మాట్లాడిన సందర్భంలోనూ.. బుకీ సంప్రదింపుల గురించి వెల్లడించలేదు. అయితే అగర్వాల్ విచారణ సందర్భంగా షకీబ్ పేరు బయటకు వచ్చింది. ఆ తర్వాత లోతుగా విచారణ జరుపగా అగర్వాల్ తనను సంప్రదించినట్టు షకీబల్ హసన్ ఐసీసీ ఏసీయూ ఎదుట అంగీకరించాడు. ఐపీఎల్ మ్యాచ్‌కు ముందు అంతర్గత విషయాలు తెలపాలని అగర్వాల్ పంపిన కొన్ని మెసేజ్‌లను తొలగించినట్టు అతడు అంగీకరించాడు. అయితే నేరుగా కలవాలన్న అగర్వాల్ విజ్ఞప్తిని షకీబ్ తిరస్కరించాడడని ఐసీసీ తెలిపింది. దీనివల్లే ఐదేండ్ల గరిష్ఠ నిషేధం నుంచి అతడు తప్పించుకున్నాడు. ఐసీసీ విచారణను, చర్యలను అంగీకరిస్తున్నానని చెప్పడంతో అప్పీలు చేసుకునే అవకాశాన్ని కూడా షకీబ్ కోల్పోయాడు. ఐసీసీ ఆదేశాల మేరకు కొంతకాలంగా అన్ని క్రికెట్ కార్యకలాపాలకు షకీబ్‌ను బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) దూరంగా ఉంచింది. భారత పర్యటనకు ముందు జరిగిన శిక్షణ శిబిరంలో, మీర్పూర్‌లో ప్రాక్టీసు మ్యాచ్ ఆడేందుకు కూడా అనుమతించలేదు.



> అతడు తప్పుచేశాడనేది స్పష్టమవుతున్నది. దాన్ని అతడు కూడా గుర్తించాడు. ఐసీసీ నిర్ణయంలో బంగ్లా ప్రభుత్వం జోక్యం చేసుకోదు. కానీ బంగ్లా క్రికెట్ బోర్డు అతడి వెన్నంటే నిలుస్తుంది. అతడు తిరిగి వచ్చి మరింత కాలం దేశానికి సేవలందిస్తాడని ఆశిస్తున్నా.
>
> **- షేక్ హసీనా, బంగ్లాదేశ్ ప్రధాని.**

### బంగ్లాకు పెద్ద దెబ్బే

ప్రపంచ క్రికెట్‌లో పసికూన ముద్రను చెరిపేసుకొని ఎదుగుతున్న బంగ్లాకు షకీబ్ నిషేధం పెద్ద శరాఘాతంలా మారింది. ఆల్‌రౌండర్‌గా జట్టు భారాన్ని భుజాన మోసిన షకీబ్.. అన్ని ఫార్మాట్లలో కలిపి మొత్తం 11 వేలకు పైగా పరుగులు చేయడంతో పాటు 500 వికెట్లు సైతం తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రస్తుతం టెస్టు, టీ20 జట్లకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ ఏడాది జరిగిన వన్డే ప్రపంచకప్‌లో 606 పరుగులు చేసి అత్యధిక పరుగుల వీరుల జాబితాలో మూడో స్థానంతో పాటు 11 వికెట్లను సైతం పడగొట్టాడు.



## టీ20 విశ్వకప్‌నకు నెదర్లాండ్స్



**దుబాయ్:** వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరిగే టీ20 ప్రపంచకప్ టోర్నీకి నెదర్లాండ్స్ జట్టు అర్హత సాధించింది. మంగళవారం ఇక్కడ జరిగిన క్వాలిఫయింగ్ టోర్నీ ప్లేఆఫ్‌లో యూఏఈని 8 వికెట్ల తేడాతో ఓడించిన డచ్ టీమ్ పొట్టి ప్రపంచకప్‌లో అడుగుపెట్టింది. నెదర్లాండ్ బౌలర్లు బ్రెండన్ గ్లోవర్ (4/12), మీకెరెన్ (2/17), గుగ్‌టెన్ (2/13) విజృంభించడంతో తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ 20 ఓవర్లలో 9 వికెట్లకు 80 పరుగులే చేయగలిగింది. ఆతిథ్య జట్టులో తొలి ఐదుగురు బ్యాట్స్‌మెన్‌లో ముగ్గురు డకౌట్ కాగా.. 9 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. ఎనిమిదో స్థానంలో వచ్చిన కెప్టెన్ అహ్మద్ రజా (22) మినహా మరెవరూ 20 పరుగుల మార్కు చేరుకోలేకపోయారు. ఇక స్వల్ప లక్ష్యఛేదనకు దిగిన నెదర్లాండ్ 15.1 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి టార్గెట్ ఛేదించింది. దీంతో పపువా న్యూగినియా, ఐర్లాండ్ తర్వాత టీ20 ప్రపంచకప్‌నకు క్వాలిఫయింగ్ పోటీల ద్వారా అర్హత సాధించిన మూడో జట్టుగా నెదర్లాండ్ నిలిచింది.

## మళ్లీ ఓడిన హైదరాబాద్

**జంషెడ్‌పూర్:** ఇండియన్ సూపర్ లీగ్‌లో కొత్తగా అడుగుపెట్టిన హైదరాబాద్ ఎఫ్‌సీ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ బోణీ కొట్టలేకపోయింది. మంగళవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 1-3తో జంషెడ్‌పూర్ చేతిలో ఓటమి పాలైంది. తొలి మ్యాచ్‌లో కోల్‌కతా చేతిలో చిత్తుగా ఓడిన హైదరాబాద్ ఈ మ్యాచ్‌లో పోరాడినా గెలుపు రుచి మాత్రం చూడలేకపోయింది. జంషెడ్‌పూర్ తరపున ఫారూఖ్ చౌదరి (34వ ని.లో), అనికెత్ (62వ ని.లో), కెస్టల్ (76వ ని.లో) తలా ఓ గోల్ చేయగా.. హైదరాబాద్ తరపున మార్సెలినో (45వ ని.లో) ఏకైక గోల్ సాధించాడు.

## బంగ్లాకు కొత్త సారథులు

టీ20లకు మహ్మదుల్లా, టెస్టులకు మోమినుల్

**ఢాకా:** రెగ్యులర్ కెప్టెన్ షకీబ్ అల్ హసన్‌పై ఐసీసీ నిషేధం విధించడంతో.. భారత పర్యటనలో బంగ్లాదేశ్ టీ20 జట్టుకు మహ్ముదుల్లా రియాద్, టెస్టులకు మోమినుల్ హక్ సారథులుగా వ్యవహరించనున్నారు. భారత్‌లో మూడు టీ20లు, రెండు టెస్టులు ఆడే జట్లను బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు మంగళవారం ప్రకటించింది. టీ20 సిరీస్‌కు షకీబ్ స్థానంలో యువ స్పిన్నర్ తైజుల్ ఇస్లామ్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. తమీమ్ ఇక్బాల్, మహమ్మద్ సైపుద్దీన్ గైర్హాజరీతో మహమ్మద్ మిథున్, ఇమ్రుల్ కైస్ పునరాగమనం చేశారు. ఢిల్లీ వేదికగా వచ్చే నెల 3న జరిగే తొలి టీ20తో ప్రారంభమయ్యే పర్యటన... 22 నుంచి 26వ తేదీ మధ్య కోల్‌కతాలో జరిగే డే అండ్ నైట్ టెస్ట్‌తో ముగియనుంది.



## రోహన్ జంట ఔట్

**సార్‌బ్రుకెన్ (జర్మనీ):** సార్‌లోర్‌లక్స్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత మిక్స్‌డ్ డబుల్స్ జోడీ రోహన్ కపూర్-సంజన సంతోష్‌కు తొలి రౌండ్‌లోనే ఓటమి ఎదురైంది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో చివరి వరకు పోరాడిన భారత జంట 19-21, 21-13, 14-21తో ఫ్రెంచ్ ద్వయం ఇలోయ్-మార్గొట్ ద్వయం చేతిలో పరాజయం పాలైంది. లక్ష్యసేన్, మిథున్ మంజునాథ్‌కు తొలి రౌండ్‌లో బై లభించడంతో.. నేరుగా రెండో రౌండ్‌లో అడుగుపెట్టారు. భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్.. ఈ టోర్నీ నుంచి తప్పుకుంది. వచ్చే నెలలో జరిగే చైనా ఓపెన్‌లో సైనా బరిలోకి దిగే అవకాశముంది.

## ప్రిక్వార్టర్స్‌లో జోష్న ఓటమి

**కైరో:** ప్రపంచ మహిళల స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ ప్లేయర్ జోష్న చినప్ప ప్రిక్వార్టర్స్‌లో ఓటమిపాలైంది. సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన పోరులో ప్రపంచ 12వ ర్యాంకర్ జోష్న 5-11, 3-11, 6-11తో టాప్ సీడ్ నూరుల్ షెర్బినీ (ఈజిప్ట్) చేతిలో ఓటమిపాలైంది. మూడుసార్లు ప్రపంచ చాంపియన్ షెర్బినీ జోరు ముందు జోష్నా నిలువలేకపోయింది.

## కాంస్య పోరుకు వీర్ దేవ్

**బుడాపెస్ట్:** అండర్-23 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ రెజ్లర్ వీర్ దేవ్ గులియా కాంస్యం పతక పోరుకు అర్హత సాధించాడు. 79 కేజీల విభాగం సెమీఫైనల్లో 1-8తో అబుబకర్ అబాకరోవ్ (అజర్‌బైజాన్) చేతిలో ఓటమి పాలై కాంస్య ఆశలతో సరిపెట్టుకున్నాడు. అంతకుముందు తొలి రౌండ్‌లో వీర్ 3-1తో బొటండ్ లుకాస్ (హంగేరి)పై.. 7-2తో లిగాన్ చై (చైనా)పై.. గెలిచి క్వార్టర్స్‌కు అర్హత సాధించాడు. ఇక క్వార్టర్స్‌లో అదరగొట్టిన 22 ఏండ్ల వీర్ దేవ్ 12-1తో డామ్జిన్ (మంగోలియా)ను మట్టికరిపించాడు. సెమీస్ చేరడం ద్వారా అతడికి కాంస్య పతక పోరులో తలపడే అవకాశం దక్కింది. మరో యువ రెజ్లర్ రవీందర్ 61 కేజీల విభాగంలో సెమీఫైనల్‌కు అర్హత సాధించాడు. మరోవైపు రెపిచేజ్ విభాగంలో నవీన్ (70 కేజీలు)కు అవకాశం దక్కింది. నవీన్ తొలి రౌండ్‌లో రష్యా రెజ్లర్ చెర్మన్ వాలీవ్ చేతిలో 0-11తో ఓటమి పాలయ్యాడు. ఆ తర్వాత చెర్మన్ ఫైనల్ చేరడంతో నవీన్‌కు రెపిచేజ్ విభాగంలో పోటీపడే అవకాశం దక్కింది.

## వండర్‌లా లాభాల్లో భారీ క్షీణత

**చెన్నై, అక్టోబర్ 29:** అమ్యూజ్‌మెంట్ పార్క్ నిర్వహణలో అతిపెద్ద సంస్థయైన వండర్‌లా హాలీడేస్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. సెప్టెంబర్ 30తో ముగిసిన మూడు నెలలకాలానికిగాను సంస్థ రూ.16.02 లక్షల నికర లాభాన్ని మాత్రమే ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో సంస్థ రికార్డు స్థాయి రూ.93.99 లక్షల లాభాన్ని గడించింది. గత త్రైమాసికంలో సంస్థ ఆదాయం రూ.43.36 కోట్ల నుంచి రూ.43.92 కోట్లకు పెరిగింది. ఈ సందర్భంగా కంపెనీ జాయింట్ ఎండీ జార్జ్ జోసెఫ్ మాట్లాడుతూ..ఆర్థిక మందగమన పరిస్థితులు అమ్యూజ్‌మెంట్ పార్కులపై పడిందని, హైదరాబాద్, కేరళ, కర్ణాటకల్లో అకాల వర్షాలు కురియడం కూడా పనితీరుపై ప్రభావం పడిందన్నారు.



# మార్కెట్లలో ఉద్దీపనోత్సవం

### ఆదాయ పన్ను తగ్గింపు ఆశలతో జోష్

**భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు.. సెన్సెక్స్ 582, నిఫ్టీ 160 పాయింట్లు వృద్ధి**

**ముంబై, అక్టోబర్ 29:** దీపావళి పటాకుల కాంతులతో దలాల్‌స్ట్రీట్ మెరిసిపోయింది. కేంద్ర ప్రభుత్వం మరోదఫా ఉద్దీపన పథకాలు ప్రకటించనుండటం, ఆదాయం పన్నును తగ్గించే అవకాశాలు ఉన్నట్లు వచ్చిన వార్తలతో కొనుగోళ్ల జడివానలో మదుపరులు తడిసి ముద్దయ్యారు. సంవత్ 2076 తొలి సెషన్ ప్రారంభంలోనే లాభాలబాట పట్టిన 30 షేర్ల ఇండెక్స్ సెన్సెక్స్ ఏ దశలోనూ వెనక్కితిరిగి చూసుకోలేదు. వచ్చేవారాల్లో కేంద్రం మరోదఫా ఉద్దీపన పథకాలు, ఆదాయం పన్నును మరింత తగ్గించనున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ, నీతి ఆయోగ్ వర్గాలు ఇచ్చిన సంకేతాలు మార్కెట్లకు బూస్ట్ నిచ్చాయి. ఫలితంగా ఒక దశలో 666 పాయింట్లకు పైగా లాభపడిన సెన్సెక్స్ చివరకు 581.64 పాయింట్లు లేదా 1.48 శాతం లాభపడింది. ఇంట్రాడేలో 39,917లను తాకిన సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 39,831.84 వద్ద ముగిసింది. దీంతో మార్కెట్ నాలుగు నెలల గరిష్ఠ స్థాయిని తాకినట్లు అయింది. మరోవైపు జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 159.70 పాయింట్లు(1.37 శాతం) ఎగబాకి 11,786.85 వద్ద స్థిరపడింది. కార్పొరేట్ల ఆశావాదక ఆర్థిక ఫలితాలు, అమెరికా-చైనా దేశాల మధ్య జరుగుతున్న చర్చలు కొలిక్కిరానున్నట్లు వచ్చిన సంకేతాలతో అంతర్జాతీయ మార్కెట్లు దౌడ్‌తీశాయి. అంచనాలకుమించి ఆర్థిక ఫలితాలను ప్రకటించడంతో టాటా మోటర్స్ షేరు 17 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. వీటితోపాటు టాటా స్టీల్, యెస్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, మారుతి సుజుకీ, టెక్ మహీంద్రా, టీసీఎస్‌లు ఏడు శాతానికి పైగా లాభపడ్డాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 2.30 శాతం అధికమైంది. మరోవైపు, కొటక్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, ఎస్బీఐలు 3.41 శాతం వరకు మార్కెట్ వాటాను కోల్పోయాయి. రంగాలవారీగా చూస్తే ఆటో, మెటల్ షేర్లకు మదుపరుల నుంచి వచ్చిన కొనుగోళ్ల మద్దతుతో ఈ రంగ షేర్లు నాలుగు శాతానికి పైగా లాభపడగా... ఇంధనం, ఇండస్ట్రీయల్, ఐటీ సూచీలు కూడా 2.32 శాతం బలపడ్డాయి. 30 షేర్ల ఇండెక్స్‌లో 26 లాభపడగా, కేవలం నాలుగు మాత్రమే నష్టపోయాయి. షేర్ల విషయానికి వస్తే 1,435 కంపెనీ షేర్లు అడుగు ముందుకుపడగా, 1,029 షేర్లు పతనం చెందాయి.

#### దూసుకుపోయిన టాటా మోటర్స్

**విశ్లేషకుల** అంచనాలకుమించి ఆర్థిక ఫలితాలను ప్రకటించడంతో టాటా మోటర్స్ షేరు ధర భారీగా పుంజుకున్నది. ఒక దశలో 18 శాతానికి పైగా లాభపడిన కంపెనీ షేరు ధర చివరకు 16.63 శాతం లాభంతో రూ.172.55 వద్ద ముగిసింది. అటు ఎన్ఎస్ఈలోనూ 16.55 శాతం ఎగబాకి రూ.172.15 వద్ద స్థిరపడింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ మరో రూ.7,103.20 కోట్లు పెరిగి రూ.49,821.20 కోట్లకు చేరుకున్నది. మార్కెట్ వర్గాలు అంచనావేసిన దానికంటే అధికంగా ఫలితాలు నమోదు చేసుకోవడం, చైనాలో పనితీరు మెరుగుపడటం, నూతన కార్లను మార్కెట్లోకి విడుదల చేయడం, అలాగే జేఎల్ఆర్ ఎట్టకేలకు లాభాల్లోకి రావడం సంస్థకు కలిసొచ్చిందని మార్కెట్ విశ్లేషకులు వెల్లడించారు. బీఎస్ఈలో కంపెనీకి చెందిన 94.17 లక్షల షేర్లు ట్రేడింగ్ జరుగగా, అదే ఎన్ఎస్ఈలో 18 కోట్ల షేర్లు చేతులు మారాయి.

#### ఎయిర్‌టెల్, ఇండిగో షేర్లు డౌన్

ఆర్థిక ఫలితాల విడుదలను వాయిదావేస్తున్నట్లు భారతీ ఎయిర్‌టెల్ ప్రకటించడంతో కంపెనీ షేరు కుప్పకూలింది. ఒక దశలో ఐదు శాతానికి పైగా పతనం చెందిన కంపెనీ షేరు ధర చివరకు 3.41 శాతం పతనంతో రూ.359.95 వద్ద స్థిరపడింది. 30 షేర్ల ఇండెక్స్‌లో ఇదే అతిపెద్ద పతనం. అటు ఎన్ఎస్ఈలోనూ కంపెనీ షేరు 3.29 శాతం తగ్గి రూ.360.80 వద్దకు జారుకున్నది. మరోవైపు ఇండిగో పేరుతో విమానయాన సేవలు అందిస్తున్న ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేరు కూడా 3.03 శాతం తగ్గి రూ.1,410.30 వద్ద పరిమితమైంది. కంపెనీ షేరు ధర వరుసగా మూడోరోజులుగా 12 శాతం పతనం చెందింది.



#### రూ.2.73 లక్షల కోట్లు పెరిగిన సంపద

**స్టాక్ మార్కెట్ల** భారీ ర్యాలీతో మదుపరుల సంపద అమాత్రం పెరిగింది. సంవత్ 2076కి లాభాలతో స్వాగతం పలికిన ఈక్విటీ ఇన్వెస్టర్లు వరుసగా కొనుగోళ్లు జరుపడంతో సూచీలు ఆకాశమే హద్దుగా దూసుకుపోయాయి. దీంతో మదుపరుల సంపద కూడా భారీగా పెరుగుతున్నది. మంగళవారం ఇన్వెస్టర్ల సంపద మరో రూ.2.73 లక్షల కోట్ల మేర పెరిగింది. కార్పొరేట్ల ఆశాజనక ఫలితాలకు తోడు, అమెరికా-చైనా దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు కొలిక్కి వచ్చే అవకాశం ఉండటంతో దలాల్‌స్ట్రీట్ వర్గాలు ఎగబడి కొనుగోళ్లు జరిపారు. దీంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2,73,355.21 కోట్లు పెరిగి రూ.1,52,04,693.34 కోట్లకు చేరుకున్నది. బ్రెగ్జిట్, అమెరికా ఫెడరల్ రిజర్వు మరోదఫా వడ్డీరేట్లను తగ్గించే అవకాశం ఉండటంతో అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి గురికాగా, కానీ అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఒకటైన భారత్ మార్కెట్లు మరింత బలపడే అవకాశం ఉన్నదని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. ఇప్పటి వరకు కార్పొరేట్ల ఆశాజనక ఆర్థిక ఫలితాలు, ఈవారం చివర్లో విడుదలకానున్న ఆటోమొబైల్ వాహన విక్రయ గణాంకాలు మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేయనున్నాయన్నారు.

## దిగొచ్చిన పసిడి

### తులంపై రూ.548 తగ్గిన ధర



**న్యూఢిల్లీ, అక్టోబర్ 29:** రికార్డు స్థాయిలో దూసుకుపోతున్న పసిడి ధరలు ఎట్టకేలకు దిగొచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ పడిపోవడం, దేశీయంగా పెళ్లిళ్ల సీజన్‌లో అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉండటంతో ధర రూ.39 వేల దిగువకు పడిపోయింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర రూ.38,857కి పడిపోయింది. గతంతో పోలిస్తే ధరలో రూ.548 తగ్గుదల కనిపించింది. పసిడితోపాటు వెండి భారీగా పడిపోయింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో కిలో వెండి ధర ఏకంగా రూ.1,190 తగ్గి రూ.47,090 వద్ద ముగిసింది. అంతకుముందు ఇది రూ.48,280గా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న మందకొడి పరిస్థితుల వల్లనే ప్రాంతీయంగా ధరలు భారీగా తగ్గాయని, దివాలీ తర్వాత డిమాండ్ అంతంత మాత్రంగానే ఉంటుందని గతంలోనే అంచనావేసినట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకులు తపన్ పటేల్ తెలిపారు. అమెరికా-చైనా దేశాల మధ్య జరుగుతున్న చర్చలు ఆశావాదంగా ఉన్నప్పటికీ అతి విలువైన లోహాలపై తీవ్ర ఒత్తిడి నెలకొన్నదన్నారు. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 1,493 డాలర్ల వద్దకు చేరుకోగా, వెండి 17.77 డాలర్ల వద్ద నిలిచింది.

## ఓలాలో మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు!

### రూ.1,400 కోట్లు ఇన్వెస్ట్ చేసేయోచనలో టెక్నాలజీ దిగ్గజం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 29:** ప్రముఖ ట్యాక్సీ సేవల సంస్థ ఓలాలో పెట్టుబడులు పెట్టడానికి అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించి ఇరు సంస్థల మధ్య జరుగుతున్న చర్చలు తుది దశకు చేరుకున్నాయని, 150-200 మిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టే అవకాశం ఉన్నదని కంపెనీకి చెందిన ఉన్నతాధికారు ఒకరు తెలిపారు. మన కరెన్సీలో ఇది రూ.1,050 కోట్ల నుంచి రూ.1,400 కోట్ల అంచనా. ప్రస్తుతం చర్చలు అడ్వాన్స్ స్టేజ్‌లో ఉన్నాయని, వచ్చే 10 నుంచి 15 రోజుల్లో ఈ ఒప్పందం కుదిరే అవకాశం ఉన్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. ఈ విషయంపై ఇరు సంస్థల ప్రతినిధులు స్పందించడలేదు. 2017లోనే జతకట్టిన ఇరు సంస్థలు..ప్రత్యేక ప్లాట్‌ఫామ్‌ను తయారుచేశాయి. ప్రస్తుతం ఓలా ప్లాట్‌ఫామ్ కింద 20 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు. వీరిలో ఇండియా, బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో అత్యధికంగా ఉన్నట్లు తెలిపింది.

# ముగ్గురు మనోళ్లే

- టాప్-10 అత్యుత్తమ సీఈవోల్లో భారత సంతతి సారథులు
- 9వ స్థానంలో సత్య నాదెళ్ల
- 100 మందితో హెచ్‌బీఆర్ జాబితా



శంతను నారాయణ్ | అజయ్ బంగా | సత్య నాదెళ్ల

**న్యూయార్క్, అక్టోబర్ 29:** ప్రపంచ అత్యుత్తమ సీఈవోల్లో ముగ్గురు భారత సంతతి సీఈవోలు టాప్-10లో స్థానం సంపాదించారు. ఈ ఏడాదికిగాను హార్వర్డ్ బిజినెస్ రివ్యూ (హెచ్‌బీఆర్).. ప్రపంచవ్యాప్తంగా వివిధ సంస్థల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన 100 మంది సీఈవోలతో ఓ జాబితాను విడుదల చేసింది. తాజా జాబితాలో అడోబ్ సీఈవో శంతను నారాయణ్ 6వ స్థానంలో నిలువగా, మాస్టర్‌కార్డ్ సీఈవో అజయ్ బంగా 7వ స్థానం పొందారు. ఇక మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల 9వ స్థానాన్ని దక్కించుకున్నారు. కాగా, ఈ జాబితాలో చోటు సంపాదించిన భారతీయుల్లో డీబీఎస్ బ్యాంక్ సీఈవో పియూష్ గుప్తా (89వ స్థానం) కూడా ఉన్నారు. 2015 నుంచి కేవలం ఆర్థికపరమైన అంశాలేగాక, పర్యావరణ, సామాజిక, పాలనాపరమైన అంశాలనూ పరిగణనలోకి తీసుకుని ఈ ర్యాంకులను ప్రకటిస్తున్నట్లు హెచ్‌బీఆర్ వెల్లడించింది.

**బెజోస్‌కు దూరమైన అగ్రస్థానం**

2014 నుంచి ఏటా అత్యుత్తమ సీఈవోల్లో అగ్రస్థానంలో కొనసాగుతున్న అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్.. ఈసారి ఆ గౌరవాన్ని దక్కించుకోలేకపోయారు. పర్యావరణ, సామాజిక, పాలనాపరమైన అంశాల్లో (ఈఎస్‌జీ) బెజోస్ స్కోర్ తక్కువగా ఉందని హెచ్‌బీఆర్ స్పష్టం చేసింది. ఈ దఫా మొదటి స్థానంలో అమెరికా టెక్నాలజీ సంస్థ ఎన్‌వీఐడీఐఏ సీఈవో జెన్సన్ హంగ్ నిలిచారు. టాప్-100లో ఉన్న ప్రముఖ సీఈవోల్లో నైక్ సీఈవో మార్క్ పార్కర్ (20వ స్థానం), జేపీమోర్గాన్ చేజ్ చీఫ్ జామీ డిమాన్ (23), లాక్‌హీడ్ మార్టిన్ సారథి మార్లిన్ హీసన్ (37), డిస్నీ సీఈవో రాబర్ట్ ఐగర్ (55), యాపిల్ సీఈవో టిమ్ కుక్ (62), సాఫ్ట్‌బ్యాంక్ అధిపతి మసయోషి సన్ (96) ఉన్నారు. ఉత్తర అమెరికా, ఐరోపా, ఆసియా, లాటిన్ అమెరికా, ఆస్ట్రేలియాల్లోని సంస్థలను పరిగణనలోకి తీసుకున్నామని హెచ్‌బీఆర్ వెల్లడించింది. అలాగే 15 ఏండ్లుగా పని చేస్తున్న సీఈవోలను లెక్కించామన్నది. కాగా, మహిళా సీఈవోలు తక్కువగా ఉన్నారని హెచ్‌బీఆర్ తెలిపింది. 2018లో ముగ్గురు మహిళలు ఈ జాబితాలో ఉండగా, ఈసారి నలుగురున్నారు. అంతకుముందు ఏండ్లలో ఇద్దరే ఉన్నారని గుర్తుచేసింది.

## డీహెచ్‌ఎఫ్‌ఎల్‌పై ఎస్‌ఎఫ్‌ఐవో విచారణ!

**న్యూఢిల్లీ, అక్టోబర్ 29:** రుణ పీడిత సంస్థ డీహెచ్‌ఎఫ్‌ఎల్ ఆర్థిక అవకతవకలపై తీవ్ర నేరాల దర్యాప్తు విభాగం (ఎస్‌ఎఫ్‌ఐవో) విచారణ చేసే వీలున్నది. ఈ మేరకు త్వరలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయనుందని సంబంధిత వర్గాల సమాచారం. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌వోసీ) ముంబై కార్యాలయం.. డీహెచ్‌ఎఫ్‌ఎల్ ప్రమోటర్ల ఆర్థిక అవకతవకలు, నిధుల మళ్లింపుపై సమగ్ర విచారణ జరిపింది. ఈ నివేదికను రెండు రోజుల క్రితం కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సమర్పించింది. ఎస్‌ఎఫ్‌ఐవో విచారణకు ఈ నివేదిక చాలని అధికారులు అంటున్నారు. బ్యాంకులకు రూ.97 వేల కోట్లు బకాయిపడిన డీహెచ్‌ఎఫ్‌ఎల్.. రూ.31 వేల కోట్లను దారి మళ్లించినట్లు ఆరోపణల్ని ఎదుర్కొంటున్నది.

### 'ఆధార్‌తో లింక్ చేయాలి'

**హైదరాబాద్, అక్టోబర్ 29:** పింఛనుదారులు తమ జీవన ప్రమాణ పత్రమును ఆన్‌లైన్‌లో తప్పక ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని ఉద్యోగ భవిష్య నిధి (ఈపీఎఫ్‌వో) తెలిపింది. మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో సమీప ఈపీఎఫ్ కార్యాలయం లోగాని ఈ-సేవ/మీ-సేవ సెంటర్లలోగానీ అనుసంధానం ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని సూచించింది. ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ నెంబర్, బ్యాంక్ పాసు పుస్తకం, పీపీవో సంఖ్యలకు సంబంధించిన జీరాక్స్‌లను వెంట తీసుకెళ్లాలని కోరింది.

# రూ.2.3 లక్షల కోట్ల విమానాలు

### ఎయిర్‌బస్‌కు 300 ప్లేన్ల ఆర్డర్ ఇచ్చిన ఇండిగో



**ముంబై, అక్టోబర్ 29:** దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో దూసుకుపోతున్నది. వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్న ఇండిగో.. తాజాగా 300 ఎయిర్‌బస్ 320 నియో విమానాలను ఆర్డర్ ఇచ్చింది. అతిపెద్ద విమానాల ఆర్డర్లలో ఇదికూడా ఒకటి. విమానాల ధర వెల్లడించకపోయినప్పటికీ, ఆర్డర్ విలువ 33 బిలియన్ డాలర్ల కంటే అధికంగా ఉంటుందని అంచనా. మన కరెన్సీలో ఇది రూ.2.3 లక్షల కోట్లకు పైమాటే. ఇండిగో పొదిలోకి అత్యంత పొడువైన ఏ321 ఎక్స్‌ఎల్‌ఆర్‌తోపాటు ఏ320 నియో, ఏ321 నియోలు చేరబోతున్నాయి. ఈ సందర్భంగా ఇండిగో సీఈవో రోనోజాయ్ దత్ మాట్లాడుతూ.. విమానయాన రంగంలో మరింత పట్టుసాధించాలనే ఉద్దేశంతో ఈ అతిపెద్ద ఆర్డర్ ఇచ్చినట్లు, తక్కువ ధరకే విమానయానం కల్పించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

**సెలోమ్ ఏవియేషన్‌తో అవెరెక్సీ ఒప్పందం**

విమానాల లీజింగ్ అండ్ అసెట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి సేవలు అందించే హైదరాబాద్ కేంద్రస్థానంగా పనిచేస్తున్న అవెరెక్సీ.. ఐర్లాండ్‌కు చెందిన సెలోమ్ ఏవియేషన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నది. ఇరు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందంతో విమానాల కొనుగోలు ప్రక్రియ మరింత సులభతరంకానున్నది. ఈ సందర్భంగా అవెరెక్సీ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ మనీష్ సింగ్ మాట్లాడుతూ.. భారత్‌తోపాటు ఇతర దేశాల్లో వ్యాపారాన్ని విస్తరించాలనే ఉద్దేశంతో సెలోమ్ ఏవియేషన్‌తో జట్టుకట్టినట్లు చెప్పారు. ఈ జాయింట్ వెంచర్‌కోసం 10 లక్షల డాలర్ల మేర పెట్టుబడులు పెట్టినట్లు, వచ్చే మూడేండ్లకాలంలో 10-15 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని అంచనావేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ జేవీలో పది మంది సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా, వచ్చే మూడేండ్లలో ఈ సంఖ్యను 100కి పెంచుకోవాలనుకుంటున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేయతలపెట్టిన ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఔత్సాహికులైన అర్హత కలిగిన ఇంజినీరింగ్ పట్టా పొందిన నిపుణులకు అత్యాధునిక టెక్నాలజీపై శిక్షణ ఇవ్వనున్నారు.

## 2 నుంచి హైదరాబాద్‌లో డాటా టెక్నాలజీ సదస్సు

**హైదరాబాద్, అక్టోబర్ 29:** రాష్ట్ర రాజధాని మరో అంతర్జాతీయ సదస్సుకు వేదిక కాబోతున్నది. వచ్చే నెల 2 నుంచి 8 వరకు హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ డాటా సైన్స్ టెక్నాలజీ కాన్ఫరెన్స్ నిర్వహించబోతున్నారు. 2030 నాటికి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో డాటా సైన్స్, పబ్లిక్-ప్రైవేట్-పార్టనర్‌షిప్‌కు సంబంధించి సవివరంగా చర్చించనున్నారు. గచ్చిబౌలిలోని హయత్ హోటల్‌లో జరుగనున్న ఈ అంతర్జాతీయ సదస్సుకు రాష్ట్ర ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్, వీ-హబ్ సీఈవో దీప్తి రావుల, జాడ్స్ అకాడమి డైరెక్టర్ రోనాల్డ్‌లు తదితరులు హాజరుకానున్నారు. దేశీయ డాటా వీక్ 2019 లో భాగంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో అంతర్జాతీయ డాటా సైన్స్ టెక్నాలజీ రంగంలో వస్తున్న పెను మార్పులపై ప్రధానంగా చర్చించనున్నట్లు డాటా సైంటిస్ట్ పార్వతి కృష్ణన్ చెప్పారు. భారత్‌తోపాటు ఆరు దేశాలకు చెందిన సుమారు 250 మంది డెలిగేట్స్ పాల్గొననున్నారు. డాటా సైన్స్ ప్రొఫెషన్స్‌లో డిమాండ్-సప్లయ్‌ల మధ్య అంతరం 50 శాతానికి పైగా ఉన్నదని, దీనిని తగ్గించడానికి ఇలాంటి గ్లోబల్ సదస్సులు ఎంతో అవసరమని ఆమె వ్యాఖ్యానించారు.

## వేలాది ఉద్యోగాలు కట్?

- వ్యయ నియంత్రణలో టెలికం పరిశ్రమ
- నష్టాల నుంచి గట్టెక్కేందుకు ఉద్యోగుల తొలగింపులు



**ముంబై, అక్టోబర్ 29:** ఆర్థికపరమైన ఒత్తిళ్లతో నలిగిపోతున్న టెలికం సంస్థలు.. సంస్థాగత వ్యయాన్ని తగ్గించుకోవడం కోసం వేలాది ఉద్యోగుల తొలగింపు దిశగా అడుగులు వేస్తున్నాయి. పడిపోతున్న వ్యాపారం, పెరుగుతున్న నష్టాల మధ్య ఇటీవలి సుప్రీం తీర్పు.. ఇప్పటికే ఉన్న పాత టెల్కోలను పెనం మీది నుంచి పొయ్యిలో పడేసింది. టెలికం శాఖ నిర్వచించిన ఏజీఆర్‌ను సుప్రీం సమర్థించడంతో టెల్కోలు పెద్ద ఎత్తున కేంద్రానికి చెల్లింపులు జరుపాల్సి వస్తున్నది. దీంతో వ్యయ నియంత్రణ చర్యలకు ఆయా సంస్థలు పదును పెడుతున్నాయి. వివిధ విభాగాల్లో ఉద్యోగులను తీసేసేందుకు సిద్ధమవుతున్నాయి. కొత్త నియామకాలు, జీతాల పెంపు, పదోన్నతులను నిలిపి వేయడమేగాక, అదనపు ఉద్యోగులపై వేటు వేయనున్నాయి. ఇప్పటికే 2017లో 3 లక్షలుగా ఉన్న టెలికం ఉద్యోగులు.. ఇప్పుడు 2.30 లక్షలకు పడిపోయారు. మరోవైపు పరిశ్రమ రుణ భారం రూ.7 లక్షల కోట్లకు పెరిగింది. ప్రస్తుతం ఎయిర్‌టెల్‌లో 16 వేలకుపైగా ఉద్యోగులుండగా, జియోలో 15 వేలకుపైగా ఉద్యోగులున్నారు. వొడాఫోన్ ఐడియాలో దాదాపు 10 వేల ఉద్యోగులున్నారు. టెలికం కంపెనీలు మనుగడ కోసం యుద్ధం చేస్తున్నాయని భారత సెల్యులార్ ఆపరేటర్ల సంఘం చేసిన వ్యాఖ్యలు పరిశ్రమ దుస్థితికి అద్దం పడుతున్నాయి. ఇక ప్రభుత్వ సంస్థలు బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ పునరుద్ధరణ చర్యల్లో భాగంగా ఉద్యోగులకు స్వచ్ఛంధ పదవీ విరమణ (వీఆర్ఎస్) ఆఫర్లను ఇస్తున్న విషయం తెలిసిందే. బీఎస్ఎన్ఎల్‌లో దాదాపు 1.68 లక్షలు, ఎంటీఎన్ఎల్‌లో సుమారు 22 వేల మంది ఉద్యోగులున్నారు. జియో రాకతో ఒకప్పుడు దాదాపు 15 సంస్థల వరకున్న టెలికం కంపెనీలు.. ప్రస్తుతం నాలుగింటికి పడిపోయిన సంగతీ విదితమే. విలీనాలతోనే పెద్ద ఎత్తున ఉద్యోగాలు పోయాయి.

**ఉద్యోగ భద్రత పెరుగాలి: డీబీఎస్**

ఉద్యోగ భద్రత పెరుగాలని, ఆదాయం పన్ను తగ్గింపులు ముఖ్యం కాదని డీబీఎస్ బ్యాంక్ అభిప్రాయపడింది. వినియోగ సామర్థ్యం పుంజుకోవాలంటే ముందుగా ఉద్యోగ భద్రత పెరుగాలన్నది. కాబట్టి ఉన్న ఉద్యోగాలు పోకుండా, కొత్త ఉద్యోగాలు వచ్చేలా ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించింది.

# ఉచిత కాల్స్ ఉండవ్..!

- చౌక డాటాకూ చెల్లు
- టెలికం కష్టాలపై ప్రభుత్వ కమిటీ
- ఆఫర్లన్నీ దూరమయ్యే అవకాశం
- త్వరలో ఉద్దీపన ప్యాకేజీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 29:** ఉచిత మొబైల్ కాల్స్, చౌక ఇంటర్నెట్‌లతో కూడిన ప్యాకేజీలు దూరం కానున్నాయా?.. కస్టమర్లకు టెలికం సంస్థలు ఎడాపెడా అందిస్తున్న పలు ఆకర్షణీయ ఆఫర్లకు కాలం తీరిందా?.. అంటే అవుననే సమాధానం వస్తున్నది. టెలికం కంపెనీల వార్షిక ఏజీఆర్‌పై సుప్రీం కోర్టు ఇటీవలి ఆదేశాలు.. పరిశ్రమను తీవ్రంగా ప్రభావితం చేసిన విషయం తెలిసిందే. టెలీ కమ్యూనికేషనేతర వ్యాపారం నుంచి వచ్చే ఆదాయాన్నీ వార్షిక సర్దుబాటు స్థూల ఆదాయం (ఏజీఆర్) లెక్కింపులో కలుపాలన్న కేంద్రం వాదనతో అత్యున్నత న్యాయస్థానం ఏకీభవించిన సంగతి విదితమే. దీంతో టెలికం శాఖకు టెల్కోలు మూడు నెలల్లోగా రూ.1.42 లక్షల కోట్లు చెల్లించాల్సి వస్తున్నది. ప్రధాన టెలికం ఆపరేటర్లు భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు ఇప్పుడు దీనిపై తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో టెల్కోల కష్టాలపై కేంద్ర ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కార్యదర్శుల కమిటీకి క్యాబినెట్ సెక్రటరీ రాజీవ్ గౌబా నేతృత్వం వహించనున్నారు. ఆర్థిక, న్యాయ, టెలికం శాఖల కార్యదర్శులు ఈ కమిటీలో ఉండనున్నారు. సోమవారం భారతీ ఎయిర్‌టెల్ చైర్మన్ సునీల్ మిట్టల్, ఆయన సోదరుడు రాజన్ మిట్టల్.. టెలికం శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, ఆ శాఖ కార్యదర్శి అన్షు ప్రకాశ్‌లను కలిసి పరిశ్రమను ఆదుకోవాలని కోరిన నేపథ్యంలో మంగళవారం కమిటీ ప్రకటన ప్రాధాన్యతను సంతరించుకున్నది. కాగా, టెలికం సంస్థలు ఎదుర్కొంటున్న అన్ని రకాల ఆర్థిక సమస్యలు-ఒత్తిళ్లపై కమిటీ అధ్యయనం చేయనుండగా, వారి డిమాండ్లనూ పరిశీలించనున్నారు. అలాగే ఓ ఆర్థిక ఉద్దీపన ప్యాకేజీ కోసం కూడా కమిటీ శ్రమించనున్నది. ఈ క్రమంలోనే ఆయా టెలికం సంస్థల ఆదాయం పెరిగే మార్గాలను కమిటీ అన్వేషించనున్నది. దీంతో కస్టమర్లను ఆకట్టుకునేందుకు అందిస్తున్న ఉచిత ఆఫర్లన్నింటినీ వెనుకకు తీసుకోవాలన్న సూచనల్ని కమిటీ చేసే వీలుందని టెలికం శాఖ వర్గాల సమాచారం. పరిశ్రమను ఆదుకునేందుకు ప్రభుత్వానికి ఈ సిఫార్సులను కమిటీ చేయనుందని అంటున్నారు. ఇందులో భాగంగానే టెలికం కంపెనీల ఆదాయాన్ని ప్రభావితం చేస్తున్న ఉచిత మొబైల్ ఫోన్ కాల్స్, చౌక డాటా ఆఫర్లను ఆపేయాలని కేంద్రానికి కమిటీ నివేదిక ఇవ్వొచ్చని తెలుస్తున్నది. ఇదే జరిగితే బెయిల్ అవుట్ ప్యాకేజీ కింద టెలికం సంస్థలకు కేంద్రం ఈ మేరకు సూచనలు చేయవచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. టెలికం రెగ్యులేటర్ ట్రాయ్.. వాయిస్ ఫోన్ కాల్స్, డాటా సర్వీసులకు కనీస చార్జీలను ప్రకటించే అవకాశాలున్నాయి. అప్పుడు అన్ని సంస్థలు వీటిని విధిగా పాటించాల్సిందే. ఇటీవలే జియో ఇంటర్‌కనెక్ట్ యూసేజ్ చార్జీ (ఐయూసీ)లను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దీంతో టాప్ అప్‌లు తెరపైకి రాగా, కస్టమర్లలో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. అలాంటిది ఉచిత కాల్స్ ఆఫర్ కూడా దూరమైతే మొబైల్ వినియోగదారులపై మరింత భారం పడనున్నది. అలాగే ఎడాపెడా ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్న కస్టమర్లకూ ధరల మోత మోగనున్నది. రిలయన్స్ జియో రాకతో దేశీయ టెలికం పరిశ్రమ ముఖచిత్రం మారిపోగా, ఉచిత కాల్స్, చౌక డాటా ఆఫర్లకు తెర లేచింది. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత తక్కువ ధరకు ఇంటర్నెట్ లభిస్తున్నది భారత్‌లోనే. ఒక జీబీ డాటా ఖరీదు రూ.8గా ఉన్నది.

#### తగ్గనున్న స్పెక్ట్రం చార్జీలు

**స్పెక్ట్రం** చార్జీల భారాన్ని మోయలేకున్నామని టెలికం కంపెనీలు ప్రభుత్వంతో మొర పెట్టుకుంటున్న విషయం తెలిసిందే. జియో రాకతో మార్కెట్‌లో పోటీ పెరిగిపోయి అప్పటిదాకా ఉన్న సంస్థల ఆదాయానికి గండి పడిన సంగతి విదితమే. దీంతో భారీ నష్టాలు వాటిల్లుతున్నాయి. ఈ నేపథ్యంలోనే అధిక స్పెక్ట్రం చార్జీలపై టెల్కోలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, వీటిని కమిటీ పరిశీలించనున్నది. రాబోయే 5జీ స్పెక్ట్రం వేలంలోనూ తాము పాల్గొనలేమని టెల్కోలు ప్రభుత్వానికి సంకేతాలిస్తున్నాయి. ఈ క్రమంలోనే స్పెక్ట్రం చార్జీలు తగ్గనున్నాయన్న సంకేతాలు బలంగా కనిపిస్తున్నాయి. ఇదిలావుంటే తమ వార్షిక ఆదాయంలో 5 శాతం యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్‌కు ఇవ్వాలన్న నిబంధనను సడలించాలని, తక్కువ మొత్తాన్ని నిర్ణయించాలని టెలికం ఆపరేటర్లు డిమాండ్ చేస్తుండగా, దీన్ని కూడా కమిటీ పరిశీలించే వీలుంది.



**వడ్డీ, జరిమానాలు వద్దు**

ఏజీఆర్‌పై సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో బకాయిలపై వడ్డీ, జరిమానాలు వద్దని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రభావిత టెలికం సంస్థలు కోరాయి. అలాగే అసలు బకాయిల చెల్లింపునకు పదేండ్ల సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశాయి. టెలికం శాఖ నిర్వచించిన ఏజీఆర్‌ను సుప్రీం సమర్థించడంతో ఎయిర్‌టెల్ దాదాపు రూ.42 వేల కోట్లు, వొడాఫోన్ ఐడియా సుమారు రూ.40 వేల కోట్లు, జియో రూ.14 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాల్సి వచ్చేలా ఉంది. మిగతా మొత్తం ప్రభుత్వ రంగ సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌తోపాటు మూతబడిన సంస్థలు ఇవ్వాల్సి ఉన్నది. ముఖ్యంగా ఎయిర్‌టెల్, వొడాఫోన్‌లపై పెనుభారమే పడుతున్నది. మూడు నెలల్లోగా రూ.80 వేల కోట్లకుపైగా చెల్లించాల్సి ఉన్నది. వీటిపై వడ్డీ, జరిమానాలు వర్తిస్తాయని అత్యున్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వానికి టెల్కోలు పైవిధంగా విజ్ఞప్తి చేస్తున్నాయి. మరోవైపు ఏజీఆర్ అంశాన్నే ప్రధానంగా తీసుకుని కమిటీ ముందుకెళ్లాలని భారతీయ సెల్యులార్ ఆపరేటర్ల సంఘం (సీవోఏఐ) విజ్ఞప్తి చేసింది. అలాగే 60 రోజుల్లోగా పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలను సూచిస్తే బాగుంటుందని అభిప్రాయపడింది. మంగళవారం కమిటీ ఏర్పాటును సీవోఏఐ ప్రధాన కార్యదర్శి రాజన్ మాథ్యూస్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన పీటీఐతో మాట్లాడుతూ దేశీయ టెలికం పరిశ్రమలో నెలకొన్న విపత్కర పరిస్థితుల దృష్ట్యా కమిటీ సిఫార్సులు ఎంత త్వరగా వస్తే అంత మంచిదన్నారు.





హైదరాబాద్ నగరంలో ఏటా సంప్రదాయంగా నిర్వహించే సదర్ ఉత్సవాలు మంగళవారం రాత్రి వేడుకగా జరిగాయి. ముషీరాబాద్, నారాయణగూడ వైఎంసీఏ ప్రాంతంలోనూ సదర్ సంబురాలు అలరించాయి. వేడుకల్లో శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ నాయిని నర్సింహారెడ్డి, ఎంపీలు బీబీ పాటిల్, బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, డిప్యూటీ మేయర్ బాబాఫసియుద్దీన్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి సముద్రాల వేణుగోపాలాచారి తదితరులు పాల్గొన్నారు. -ముషీరాబాద్, నమస్తే తెలంగాణ/హిమాయత్‌నగర్

## చాలెంజ్.. గ్రీన్ చాలెంజ్



అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి విసిరిన గ్రీన్‌చాలెంజ్‌ను స్వీకరించిన ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ మంగళవారం బేగంపేటలోని మెట్రోరైల్ భవన్‌లో మూడు రకాల మొక్కలు నాటారు. రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో బాగుందని కితాబునిచ్చారు. గ్రీన్ చాలెంజ్‌ను మరింత ముందుకు తీసుకెళ్లేందుకుగాను ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్ సిన్హా, ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్, పీసీబీ సభ్య కార్యదర్శి అనిల్‌కుమార్ పేర్లను నామినేట్ చేశారు.

-హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ



# తగ్గిన దీపావళి కాలుష్యం

- గతంతో పోలిస్తే కొంచెం నయం
- నివేదికను వెల్లడించిన పీసీబీ
- 2.5 మైక్రోగ్రాంల పీఎం 2014లో 124గా ఉండగా, 2019లో 82గా నమోదు



**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** దీపావళి రోజు కాలుష్యం గతంతో పోలిస్తే కొంచెం తగ్గిందని పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్(పీసీబీ) వెల్లడించింది. ఈ నెల 27న దీపావళి రోజు పటాకులు కాల్చడం వల్ల వాయు, శబ్ద కాలుష్యం సాధారణస్థాయి కంటే రెండు రెట్లు పెరిగిందని కాలుష్య నియంత్రణ మండలి మంగళవారం అధికారికంగా తెలిపింది. నిరంతర పర్యవేక్షణ కేంద్రాల్లోని గత నాలుగేండ్ల గణాంకాలతో పోలిస్తే మాత్రం దీపావళి కాలుష్యం ఏటేటా కొంత తగ్గుతున్నదని పేర్కొన్నది. ప్రజల్లో అవగాహన పెరగడం, ప్రభుత్వపరంగా చేపడుతున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు.. కాలుష్యస్థాయి తగ్గడానికి దోహదపడ్డాయని పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ దాసరి ప్రసాద్ తెలిపారు. సల్ఫర్ డై ఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ కొన్నిచోట్ల ప్రమాదకరస్థాయిని దాటినా.. చాలా ప్రాంతాల్లో సాధారణస్థాయిలోనే ఉండటం గమనార్హం. దీపావళి రోజున తేమ ఏర్పడి వాయు వేగం తక్కువగా ఉన్నందున గాలిలో వాయు కాలుష్యం, దుమ్ముకణాలస్థాయి పెరిగిందని పీసీబీ వెల్లడించింది. పీసీబీ.. కంటిన్యూయస్ ఆంబియంట్ ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్స్ ( సీఏఏక్యూఎంఎస్) ద్వారా కాలుష్యాన్ని కొలుస్తున్నది. హైదరాబాద్‌లో ఆరు చోట్ల వాయు నాణ్యతను పర్యవేక్షించే కేంద్రాలుండగా, శబ్ద కాలుష్యస్థాయిని కొలువడానికి పదిచోట్ల రియల్ టైమ్ నాయిస్ మానిటరింగ్ స్టేషన్లు ఉన్నాయి. వీటితోపాటు మ్యానువల్ మానిటరింగ్ ఉంటుంది. వీటిపై ఈ నెల 20 నుంచి వచ్చేనెల 3 వ తేదీ వరకు ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతుందని పీసీబీ వెల్లడించింది. హైదరాబాద్ నగరంలో 2014 నుంచి దీపావళి రోజున డాటాను పరిశీలిస్తే.. కాలుష్య సాంద్రత ఏటేటా తగ్గుతున్నది. సీఏఏక్యూఎంఎస్‌ల పర్యవేక్షణలోని పార్టిక్యులేట్ మ్యాటర్(పీఎం) 10 మైక్రాన్ల, 2.5 మైక్రాన్ల కాలుష్యం తగ్గిందని దాసరి ప్రసాద్ వెల్లడించారు. మ్యానువల్ స్టేషన్లలో కాలుష్యం పెరిగినా.. నిరంతర పర్యవేక్షణ కేంద్రాల్లో తగ్గినట్టు తెలిపారు. పీఎం 2014లో 179 మైక్రోగ్రామ్స్ ఉండగా, 2018నాటికి అది 108కి తగ్గిందని వెల్లడించారు. ఇక 2014లో 2.5 పీఎం 124గా ఉండగా, 2019లో 82కు తగ్గిందని చెప్పారు. దీపావళి రోజున గాలిలో పార్టిక్యులేట్ మ్యాటర్(దుమ్ము కణాలు) 2.5 మైక్రాన్ల పరిమాణంలో 71.6 మైక్రోగ్రామ్స్‌గా ఉన్నదని మ్యానువల్ విధానంలో తేలిందని పీసీబీ తెలిపింది. ఇది సాధారణంగా ఉండే 22 మైక్రోగ్రామ్స్ కంటే మూడు రెట్లు అధికమని తేల్చింది. 10 మైక్రాన్ల దుమ్ము ధూళి కణాలు సాధారణంగా 85 మైక్రోగ్రామ్స్ కాగా, దీపావళి రోజున 163.4కు పెరిగిందని అధికారులు వెల్లడించారు.



ప్రముఖ జర్నలిస్టు సతీశ్‌చందర్ రాసిన 'బీ ఫర్ బ్యాలెట్' గ్రంథాన్ని మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆవిష్కరిస్తున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, నమస్తే తెలంగాణ దినపత్రిక సంపాదకుడు కట్టా శేఖర్‌రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయసంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు కార్యదర్శి కే శివకుమార్‌నాయుడు తదితరులు

# బాల్యం నుంచే రాజకీయాలు

- రాజకీయాలు, విశ్లేషణలపై గురుకులాల్లో ప్రత్యేక క్యాంపులు
- గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్
- సతీశ్‌చందర్ 'బీ ఫర్ బ్యాలెట్' గ్రంథం ఆవిష్కరణ
- సీఎం కేసీఆర్ ఓ లెజెండ్: ఏపీ ఏడీజీ పీవీ సునీల్ కుమార్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**

తెలంగాణ ఏర్పడిన తర్వాత గురుకుల విద్యాలయాల్లో బాల్యం నుంచే రాజకీయాలు, వాటిపై స్పష్టమైన అవగాహన రావాలనే ఉద్దేశంతో సమ్మర్ సమురాయ్ పేరిట రాజకీయాలు, విశ్లేషణలకు సంబంధించిన ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ప్రముఖ జర్నలిస్టు సతీశ్‌చందర్ రాసిన 'బీ ఫర్ బ్యాలెట్' గ్రంథాన్ని మంగళవారం.. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హార్వర్డ్ యూనివర్సిటీలో లభ్యం కాని ఎంతోసమాచారం సతీశ్‌చందర్ రాసిన ఈ గ్రంథంలో లభ్యమైందని తెలిపారు. రాజకీయాల్లో దశలు, పరిణామాలపై సమకాలీన పరిస్థితులపై ఇంతకంటే మంచి పుస్తకం మరొకటి లేదని ప్రశంసించారు. పాలిటిక్స్ అనేవి ఉన్నతమైన సృజనశీలమైనవని ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ అడిషనల్ డీజీ, సీఐడీ పీవీ సునీల్‌కుమార్ అన్నారు. తాను చూసిన రాజకీయ నాయకుల్లో తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అద్భుతమైన రాజకీయవేత్త అని కొనియాడారు. తాను ఎన్నో సమస్యలు, పరిష్కారాల గురించి తరచూ ఆలోచిస్తుంటానని.. ఇవే సవాళ్లను కేసీఆర్ గారైతే ఎలా చేస్తారని ఎప్పుడూ అనుకుంటుంటానని చెప్పారు. కేసీఆర్ నిజంగా లెజెండ్ అని.. టీఆర్‌ఎస్ పార్టీని స్థాపించినప్పుడు ఎవరూ తెలంగాణ వస్తదని అనుకోలేదని.. కానీ తెలంగాణ వచ్చింది.. అధికారమూ వచ్చింది.. అభివృద్ధికి సంబంధించిన ఎన్నో కార్యక్రమాలు జరుగుతున్నాయని సునీల్‌కుమార్ అన్నారు. రాజకీయాల్లో ఏదైనా సాధించొచ్చు అనే మంచి సందేశమిచ్చే పుస్తకం సతీశ్‌చందర్ రాసిన 'బీ ఫర్ బ్యాలెట్' అని చెప్పారు. నమస్తే తెలంగాణ దినపత్రిక సంపాదకుడు కట్టా శేఖర్‌రెడ్డి ప్రారంభోపన్యాసంచేస్తూ సతీశ్‌చందర్‌తో తనకు ఎంతో సాన్నిహిత్యమున్నదని తెలిపారు. ఇవాళ 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పొలిటికల్ లీడర్‌షిప్' అనే వ్యవస్థను ప్రారంభించి నేటి యువతరానికి రాజకీయ పోకడలు, విలువలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించడం సమాజ ఉన్నతికి దోహదపడుతుందని చెప్పారు. సతీశ్‌చందర్ పుస్తకాన్ని చదివితే గతకాలపు దొంతరలు మళ్లీ కండ్లముందు కదలాడాయన్నారు. ఈ పుస్తకం అందరికీ ఒక రాజకీయ పాఠ్యాంశం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయసంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు కార్యదర్శి కే శివకుమార్‌నాయుడు, యూఐడీఏఐ మాజీ ఏడీజీ పీఎస్‌ఎన్ మూర్తి, ప్రొఫెసర్ శ్రీపతి రాముడు తదితరులు పాల్గొన్నారు.

# బోటు బాధితులకు పరిహారం

ఐదు కార్మిక కుటుంబాలకు రూ.6.30 లక్షల చొప్పున చెక్కులు అందజేసిన మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, చామకూర మల్లారెడ్డి



ఏపీలోని కచులూరు బోటు ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర కార్మికశాఖ తరపున చెక్కులు అందజేస్తున్న మంత్రులు దయాకర్‌రావు, మల్లారెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, ముఖ్యకార్యదర్శి శశాంక్‌గోయల్ తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా కచులూరు వద్ద బోటు ప్రమాదంలో మృతిచెందిన ఐదుగురు కార్మికుల కుటుంబాలకు కార్మికశాఖ తరపున ప్రభుత్వం రూ.6.30 లక్షల చొప్పున పరిహారాన్ని అందజేసింది. బోటు ప్రమాదంలో చనిపోయినవారిలో కార్మికశాఖ గుర్తింపు కార్డులు ఉన్న గొర్రె రమాదేవి, బస్కె రేణుక, కొమ్ముల పుష్ప, కొండూరు కౌసల్య, బస్కె లలిత కుటుంబాలకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ముఖ్యకార్యదర్శి శశాంక్ గోయల్ చెక్కులను మంగళవారం ఆర్టీసీ చౌరస్తాలోని అంజయ్యభవన్‌లో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. బోటు ప్రమాద ఘటన బాధాకరమని, పరిహారం అందజేయడం ద్వారా ఆ కుటుంబాలకు కొంత ఊరట కలిగించామని చెప్పారు. కార్మికుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. ప్రమాదంలో చనిపోయినవారి కుటుంబాలకు ఇచ్చే పరిహారం మొత్తాన్ని రూ.2 లక్షల నుంచి రూ.6.30 లక్షలకు పెంచారని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు బోటు ప్రమాద ఘటనాస్థలికి వెళ్లి గల్లంతైనవారి కుటుంబసభ్యులకు అండగా ఉన్నామని తెలిపారు. మృతుల కుటుంబాలకు సీఎం కేసీఆర్ రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారన్నారు. త్వరలోనే రెండు రాష్ట్ర ప్రభుత్వాల పరిహారం మృతుల కుటుంబాలకు అందజేస్తామని చెప్పారు.





మంగళవారం హైదరాబాద్‌లో 'స్ట్రోక్ కేర్ ఆన్ వీల్స్' ప్రత్యేక అంబులెన్స్‌లను ప్రారంభించిన రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి ఏ శాంతికుమారి

# రోగి ముంగిట్లో వైద్యం

పక్షవాతానికి అంబులెన్స్‌లోనే చికిత్స.. 105910 నంబర్‌కు ఫోన్‌చేస్తే చాలు

'స్ట్రోక్ కేర్ ఆన్ వీల్స్' పేరుతో ప్రత్యేక అంబులెన్స్‌లను ప్రారంభించిన యశోద హాస్పిటల్స్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పక్షవాతం బారినపడే రోగులను రక్షించేందుకు యశోద హాస్పిటల్స్ ప్రత్యేకమైన అంబులెన్స్‌లను ప్రారంభించింది. 105910 నంబర్‌కు ఒక్క ఫోన్‌చేస్తే చాలు అక్కడవాలిపోయే ఈ తరహా అంబులెన్స్ సేవలు తెలుగు రాష్ట్రాల్లో ఇదే ప్రథమం. మంగళవారం వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి ఏ శాంతికుమారి 'స్ట్రోక్ కేర్ ఆన్ వీల్స్' పేరుతో ఏర్పాటు చేసిన ప్రత్యేక అంబులెన్స్‌లను ప్రారంభించారు. అత్యవసర చికిత్స అందించడంలో ముందుండటం అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా రోగి ఇంటి దగ్గరికే స్ట్రోక్ వైద్యాన్ని తీసుకొచ్చిన యశోద హాస్పిటల్స్‌కు ట్రాఫిక్ విభాగపు అదనపు పోలీస్ కమిషనర్ అనిల్‌కుమార్ అభినందనలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మరణాలకు దారితీస్తున్న వాటిలో రెండోకారణం పక్షవాతం. ఇండియాలో ప్రతి లక్ష మందిలో 156 మంది పక్షవాతం బారినపడుతుండగా, మన రాష్ట్రంలో రోజుకు 100 నుంచి 200 మందికి పక్షవాతం వస్తున్నది. హైదరాబాద్‌లో రోజూ 50 నుంచి 60 మంది పక్షవాతం బారినపడుతున్నారు. పక్షవాతానికి ప్రధాన కారణం అధిక రక్తపోటు కాగా, మధుమేహం కూడా ఓ కారణమవుతున్నది. పక్షవాతం కూడా మూడుపదుల వయసులోనే కనిపిస్తుండటం ఆందోళనకరమైన విషయం. పోషకాహారం తీసుకోకపోవడం, జంక్ ఫుడ్ తీసుకోవడం, పొగతాగడం, ఆల్కహాల్ లాంటి దురలవాట్లతో ఈ ముప్పు ఎక్కువవుతున్నది. గుండె జబ్బులు, సికిల్ సెల్ అనీమియా, మోయా-మోయా లాంటి సమస్యలు చిన్నారుల్లో పక్షవాతానికి కారణమవుతున్నాయి.

### ఏమిటీ అంబులెన్స్?

పక్షవాతం వచ్చినప్పుడు ప్రతిక్షణం కీలకమైనదే. పక్షవాతం వల్ల ప్రతి నిమిషానికి మనిషిలో 1.9 మిలియన్ల నాడీకణాలు చనిపోతాయి. ఒకసారి నాడీకణాలు చనిపోతే మళ్లీ కొత్త కణాలు ఏర్పడవు. అవి నశించిపోకుండా చూసుకోవాలి. బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు కనిపించగానే 105910 నంబర్‌కు ఫోన్‌చేస్తే యశోద హాస్పిటల్ నుంచి వెంటనే అంబులెన్స్ వచ్చేస్తుంది. ఆ లోపు దగ్గర్లోని స్కానింగ్ సెంటర్‌లో సిటి స్కాన్ చేయించుకోవడం అయిపోతుంది. అంబులెన్స్ రాగానే రోగికి థ్రాంబోలైటిక్ ఇంజెక్షన్ ఇస్తే పక్షవాత లక్షణాలు తగ్గిపోతాయి.

### వీటి సంఖ్య పెంచుతాం

'స్ట్రోక్ కేర్ ఆన్ వీల్స్ కాన్సెప్ట్' ద్వారా సకాలంలో రోగి దగ్గరికి చేరి థ్రాంబోలైటిక్ ఇంజెక్షన్ ఇచ్చి వాళ్లను కాపాడేందుకు అవకాశం ఉంటుంది. గంట ముందు ఈ ఇంజెక్షన్ ఇచ్చినా ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. అలా నెలకు పదిమందిని రక్షించగలిగినా మా ప్రయత్నం ఫలించినట్టే. మొదట నాలుగైదు అంబులెన్స్‌లతో ప్రారంభించినా, వీటి సంఖ్య పెంచుతాం.

**- డాక్టర్ జీఎస్ రావు, మేనేజింగ్ డైరెక్టర్, యశోద హాస్పిటల్స్**

### త్వరగా ఇంజెక్షన్ ఇస్తే కాపాడొచ్చు

పక్షవాతంలో ఇష్కిమిక్ స్ట్రోక్, హెమరేజిక్ స్ట్రోక్ అనే రకాలు ఉంటాయి. జీవనశైలి, అధిక ఒత్తిడి.. చిన్న వయసులోనే స్ట్రోక్ రావడానికి కారణం. థ్రాం బోలైటిక్ థెరపీ వచ్చాక నాలుగున్నర గంటలలోపు ఈ ఇంజెక్షన్ ఇవ్వగలిగితే పేషెంట్‌ను కాపాడొచ్చు.

**- డాక్టర్ కోమల్‌కుమార్, సీనియర్ న్యూరాలజిస్ట్, స్ట్రోక్ స్పెషలిస్ట్ యశోద హాస్పిటల్స్**

# మహిళా రిజర్వేషన్‌కు మద్దతివ్వాలి

- పార్టీలు అందుకు ముందుకు రావాలి
- పార్లమెంట్ నిర్వహణ విధానాల్లో సంస్కరణలు అవసరం
- జైట్లీ తొలి స్మారకోపన్యాసంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 29:** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌కు అవసరమైన 'మహిళా రిజర్వేషన్ బిల్లు'ను ఆమోదించేందుకు రాజకీయ పార్టీలు ముందుకు రావాలని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ఢిల్లీ యూనివర్సిటీలో కేంద్రమాజీ మంత్రి అరుణ్ జైట్లీ తొలి స్మారకోపన్యాసం చేస్తూ ప్రస్తుతం పార్లమెంట్‌లో మహిళల ప్రాతినిధ్యం 13 శాతం మాత్రమే ఉన్న సంగతి గుర్తుచేశారు. పార్లమెంట్ నిర్వహణ విధి విధానాల్లో సంస్కరణలు తేవాల్సి ఉన్నదని ఆయన చెప్పారు. చట్టసభల సభ్యులకు ప్రవర్తనా నియమావళిని అమలులోకి తీసుకు రావాల్సి ఉన్నదన్నారు. సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించే సభ్యులపై ప్రిసైడింగ్ అధికారులు చర్య తీసుకునేందుకు అధిక అధికారాలు అప్పగించాలని పేర్కొన్నారు. ఏడాదికొక సారి పార్లమెంట్ ఉభయ సభలు ఉమ్మడిగా సమావేశం కావాలని, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల పదవీ కాలం సుదీర్ఘంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సంస్కరణల అమలు వల్ల పార్లమెంటరీ సంస్థలపై ప్రజల్లో నమ్మకం పెంపొందించవచ్చునన్నారు. లోక్‌సభలో, రాష్ట్రాల అసెంబ్లీల్లో మూడోవంతు సీట్లను మహిళలకు కేటాయించేందుకు ప్రతిపాదించిన మహిళా రిజర్వేషన్ బిల్లు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉంది. ఈ బిల్లుకు పలు రాజకీయ పార్టీల నుంచి తీవ్రస్థాయిలో ఆటంకాలు ఎదురయ్యాయి. 2014లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళా రిజర్వేషన్ బిల్లును ముందుకు తేలేదు. ఒకవేళ ప్రభుత్వం బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడితే కాంగ్రెస్ మద్దతునిచ్చే అవకాశాలు ఉన్నాయి.





పంటపొలాల్లో కొయ్యకాలుకు నిప్పు పెట్టడానికితోడు దీపావళి పర్వదినం సందర్భంగా టపాసులు భారీగా కాల్చడం వల్ల ఢిల్లీలో కాలుష్యం భారీగా పెరిగింది. దీంతో కాలుష్యాన్ని నియంత్రించేందుకు వాటర్ ట్యాంకర్‌తో వాతావరణంలోకి నీళ్లను వెదజల్లుతున్న దృశ్యం.

## ఆర్టీసీ సభకు షరతులతో అనుమతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ కార్మిక సంఘాలు సరూర్‌నగర్‌లో బుధవారం నిర్వహించనున్న 'సకల జనుల సమరభేరి' సభకు హైకోర్టు షరతులతో కూడిన అనుమతిని మంజూరుచేసింది. మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల మధ్య సభ పూర్తిచేయాలని స్పష్టంచేసింది. ఎలాంటి సంఘటన జరిగినా బాధ్యత వహిస్తామని జేఏసీ నేత అశ్వత్థామరెడ్డి అఫిడవిట్ ఇవ్వాలని పేర్కొన్నది. ఊరేగింపులు, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకూడదని, గరిష్ఠంగా ఆరుగురే ప్రసంగించాలని తెలిపింది. సమావేశాన్ని రికార్డు చేయడానికి పోలీసులకు అనుమతించింది. నేరంతో సంబంధమున్న వ్యక్తులు, ఎన్‌బీడబ్ల్యూ జారీఅయినవారు సమావేశానికి హాజరైనట్టు తెలిస్తే పోలీసులు చర్యలు తీసుకోవచ్చని సూచించింది.

# సీపీడీసీఎల్ విభజనపై ఏపీ జీవో

ఏపీ సదరన్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ పరిధిలోకి రెండు జిల్లాలు

పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌పై ఏకపక్ష ఉత్తర్వు!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్యుత్ సంస్థల విభజనలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక్కోసంస్థపై ఒక్కోతీరుగా వ్యవహరిస్తున్నది. ఇరురాష్ర్టాలకు ఆమోదయోగ్యంగా ఉన్న అంశాలపై మాత్రమే జీవోలు విడుదల చేసుకోవాల్సి ఉండగా.. ఏకపక్షంగా జీవోలు విడుదల చేస్తున్నది. ఉమ్మడి ఏపీ విభజనలో భాగంగా 67 విద్యుత్ సంస్థలపై ఏకాభిప్రాయం కుదరడంతో ఆయా సంస్థల విభజనకు తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు జీవోలు విడుదల చేసుకున్నాయి. మరో 23 సంస్థల విభజనపై ఇరు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉన్నాయి. తెలంగాణ జిల్లాలతోపాటు రాయలసీమలోని కర్నూలు, అనంతపురం జిల్లాలు కలిసిఉన్న సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (సీపీడీసీఎల్) విభజన జీవోను ఏపీ ప్రభుత్వం ఈ నెల 24న విడుదల చేసింది. ఈ కంపెనీ పరిధిలో ఉన్న కర్నూలు, అనంతపురం జిల్లాలను ఏపీ సదరన్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ పరిధిలోకి తీసుకువచ్చింది. తెలంగాణ పరిధిలోని జిల్లాలతో తెలంగాణ ప్రభుత్వం గతంలోనే టీఎస్ఎస్పీడీసీఎల్‌ను ఏర్పాటు చేసింది. ఇదిలాఉండగా రాష్ట్ర విభజనకు ముందునుంచే వివాదంలో ఉన్న పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏకపక్షంగా విభజిస్తూ ఏపీ ప్రభుత్వం ఈ ఏడాది జూలై 8న జీవో విడుదల చేసింది. వాస్తవంగా రాష్ట్ర విభజన చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించి, 2014 జూన్ 2ను అపాయింటెడ్ డేగా నిర్ణయించిన తరవాత ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను విభజిస్తూ 2014 మే 30న ఆదేశాలు ఇచ్చింది. విభజన చట్టం ప్రకారం 58:42 నిష్పత్తి ప్రకారం విభజన జరుగాల్సి ఉండగా.. సీమాంధ్ర అధికారులతో నిండిన పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏపీకి 59.54, తెలంగాణకు 40.46 శాతం ఆస్తులు, ఆదాయం విభజిస్తూ ఆదేశాలు ఇచ్చింది. తప్పుడు పద్ధతుల్లో, అపాయింటెడ్‌డేకు ముందుగానే అడ్డగోలుగా జరిగిన విభజనను వ్యతిరేకిస్తూ తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి ఫిర్యాదుచేసింది. నాటినుంచి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ వివాదాస్పద సంస్థల జాబితాలోనే ఉన్నది. కేంద్రం వద్ద వివాదాస్పదమైన అంశంగా ఉన్న సమయంలోనే ఏపీ ఏకపక్షంగా జీవో విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి తన అభ్యంతరాన్ని తెలియజేసింది.

## దలైలామా వారసుడి ఎంపికకు మా ఆమోదం తప్పనిసరి: చైనా

**బీజింగ్:** టిబెటన్ల ఆధ్యాత్మిక గురువు దలైలామా వారసుడి ఎంపికకు తమ ఆమోదం తప్పనిసరని చైనా పేర్కొంది. దలైలామా వారసుడిని టిబెటన్లే ఎన్నుకుంటారని, ఇందులో చైనా జోక్యం అవసరం లేదని అమెరికా పేర్కొన్న నేపథ్యంలో చైనా ఈ విధంగా స్పందించింది. సోమవారం అమెరికా రాయబారి సామ్ బ్రౌన్‌బ్యాక్ హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో దలైలామాతో భేటీ తర్వాత జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'తమ ఆధ్యాత్మిక గురువును ఎన్నుకునే హక్కు టిబెటన్లకున్నది. ఇందులో ఏ ప్రభుత్వం, ఏ సంస్థ జోక్యం అవసరం లేదు' అని తెలిపారు. దీనిపై చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి జెంగ్ షైవాంగ్ స్పందిస్తూ అమెరికా రాయబారి వ్యాఖ్యలు చైనా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం లాంటిదేనని చెప్పారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

# బద్ధకస్తులుగా మారుతున్న ఇండియన్స్!

- చురుకుదనంలో చివరి స్థానం.. నిద్రలేమిలో రెండో స్థానం
- రోజుకు 6,533 అడుగుల మేర నడక.. 7 గంటల నిద్ర



**న్యూఢిల్లీ:** కాలు తీసి కాలు వేయడానికి కూడా భారతీయులు బద్ధకిస్తున్నారు. హాంకాంగ్, అమెరికా, బ్రిటన్, జపాన్, సింగపూర్ ప్రజలతో పోలిస్తే భారతీయులు నడక విషయంలో బద్ధకస్తులుగా మారుతున్నారని ఫిట్‌నెస్ సొల్యూషన్స్ సంస్థ 'ఫిట్‌బిట్' చేసిన ఓ అధ్యయనంలో తేలింది. 18 దేశాలపై నిర్వహించిన ఈ సర్వేలో భారతీయులు రోజుకు సగటున 6,533 అడుగుల మేర మాత్రమే నడక సాగిస్తున్నట్టు వెల్లడైంది. ఈ విషయంలో హాంకాంగ్ మొదటి స్థానంలో నిలిచింది. అక్కడ సగటున ఒక్కో వ్యక్తి రోజుకు 10,133 అడుగుల మేర నడుస్తున్నాడు. మరోవైపు, రాత్రి నిద్ర విషయంలో కూడా భారతీయులు మిగతా దేశాలతో పోలిస్తే దుర్భర పరిస్థితుల్లో ఉన్నట్టు సర్వే తేల్చింది. జపాన్ తర్వాత నిద్రలేమి సమస్యలు ఎదుర్కొంటున్న వాళ్లలో భారతీయులదే రెండో స్థానమని సర్వే ప్రతినిధులు చెప్పారు. రోజుకు సగటున 7 గంటలు మాత్రమే ఇండియన్స్ నిద్రపోతున్నారట. మనతో పోలిస్తే బ్రిటన్ వాసులు 48 నిమిషాల పాటు ఎక్కువగా, అమెరికన్లు 32 నిమిషాలపాటు ఎక్కువసేపు నిద్రపోతున్నట్టు సమాచారం. ఐర్లాండ్ ప్రజానీకం అందరికంటే ఎక్కువగా రోజుకు 7 గంటల 57 నిమిషాల పాటు నిద్రపోతున్నట్టు అధ్యయనం పేర్కొంది. జ్ఞాపకశక్తిని పెంచుతూ, భావోద్వేగాలను నియంత్రించేందుకు సాయపడే ర్యాపిడ్ ఐ మూమెంట్-ఆర్‌ఈఎం నిద్ర(కనుపాపను కదుల్చుతూ నిద్రపోవడం)లో కూడా భారతీయులు వెనుకంజలో ఉన్నారు. సగటున రోజుకు 77 నిమిషాల పాటు ఆర్‌ఈఎం నిద్రకు భారతీయులు ఉపక్రమిస్తున్నట్టు సర్వే చెప్పింది. 75-90 సంవత్సరాల మధ్య వయస్సు గల భారతీయ వృద్ధుల్లో నిద్రలేమి ఎక్కువగా ఉన్నట్టు తేలింది.

# నవాజ్ షరీఫ్ ఆరోగ్యం విషమం

**పాక్ మాజీ ప్రధానికి 8 వారాల బెయిల్**



**లాహోర్:** అవినీతి కేసులో జైలుపాలైన పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ ఆరోగ్య పరిస్థితి మరింత విషమించింది. రక్తంలో ప్లేట్‌లెట్లు దారుణంగా 2000 స్థాయికి పడిపోవడంతో సోమవారం రాత్రి ఆయనను దవాఖానలో చేర్చారు. షరీఫ్ వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ అద్నాన్ ఖాన్ ట్విట్టర్‌లో స్పందిస్తూ.. 'మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. అతి తక్కువ స్థాయికి ప్లేట్‌లెట్లు పడిపోవడంతో గుండెపోటు వచ్చింది. ఫలితంగా కిడ్నీ పని చేయడం లేదు. రక్తంలో చక్కెర నిల్వలు తక్కువగా ఉన్నాయి. రక్తపోటుతో అతడిపై తీవ్ర ప్రభావం పడింది' అని చెప్పారు. నవాజ్ షరీఫ్ ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యేమిటన్నది కనిపెట్టడం కష్టసాధ్యంగా మారిందని షరీఫ్ మెడికల్ సిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ చెప్పారు. మరోవైపు, ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్న నవాజ్ షరీఫ్‌కు ఇస్లామాబాద్ హైకోర్టు (ఐహెచ్‌సీ) ఎనిమిది వారాల బెయిల్ ప్రకటించింది. బెయిల్ కోసం రూ.20లక్షల నగదుతోపాటు రెండు వ్యక్తిగత పూచీకత్తు పత్రాలను దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. అల్ అజీజీయా కేసులో ఆయనకు జాతీయ అకౌంటబిలిటీ బ్యూరో(ఎన్‌ఏబీ)గత డిసెంబర్24న విధించిన ఏడేండ్ల జైలుశిక్ష తాత్కాలికంగా సస్పెండ్ చేస్తున్నట్లు ఐహెచ్‌సీ ప్రకటించింది.

నమస్తే తెలంగాణ
# జిందగీ
బుధవారం 30 అక్టోబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi




# అమ్మల అండగా..





**వారంతా మనసున్న మారాజులు. అబద్ధం ఎరుగని, కల్మషం లేని మనసులు వాళ్లవి. కొద్దిపాటి బుద్ధిమాంద్యం తప్ప.. మనతో పోలిస్తే వారే నిత్య సంతోషులు. ఉన్నంతలో పక్కవాళ్లకు పంచుదామన్న దాతృత్వం వారిది. ఏదైనా నేర్చుకొని తమను తాము నిరూపించుకోవాలన్న సంకల్పం వారిలో కనిపిస్తుంటుంది. కన్నతల్లుల అండతో జీవిత పోరాటంలో వారు ఒక్కోమెట్టు ఎక్కుతూ.. గెలుపువైపు కొనసాగిస్తున్న ప్రయాణం 'సామాన్యులందరికీ' ఆదర్శ ప్రాయమే. కడుపున పుట్టిన బిడ్డలకు వారి లోపాన్ని తెలియకుండా ఆ తల్లులు సాగిస్తున్న పోరు సైతం మరింత ఆలోచింపజేస్తుంది. అలాంటి తల్లులందరికీ పెద్దదిక్కుగా ఉంటూ.. 800 మంది బుద్ధిమాంద్యం ఉన్నపిల్లల జీవితాల్లో శంకర్ ఫౌండేషన్ ద్వారా వెలుగులు నింపారు చైల్డ్ సైకాలజిస్ట్ శ్రీదేవి. ప్రస్తుతం మరో 234 మంది సిద్ధంగా ఉన్నారు. బయటి నుంచి ఆర్థికసాయం ఆశించకుండా.. కేవలం కుటుంబసభ్యుల సహకారంతో వందలాది మందిని తీర్చిదిద్దుతున్న శ్రీదేవి ప్రస్థానం గురించి ఆమె మాటల్లో..**

'నేను స్వతహాగా చైల్డ్ సైకాలజిస్టుని. చదువుకునే రోజుల్లో 1980లో ప్రాజెక్టు వర్క్ కోసం ఇంటెలెక్చువల్లీ చాలెంజ్‌డ్ (బుద్ధిమాంద్యం) పిల్లల ప్రత్యేక పాఠశాలలో కొంతకాలం పనిచేశాను. ఆ పిల్లలందరిదీ అన్‌కండిషనల్ ప్రేమ. వారు ఎంతో అదృష్టవంతులు, వాళ్లకు అబద్ధం ఆడడం తెలియదు. ఆ అవసరమూ లేదు. చేతనైతే సాయం చేస్తారు. లేదంటే అలా ఉంటారే తప్ప హాని చేయాలన్న ఆలోచన వారికి ఉండదు. కానీ ఆ చిన్నారులకు చదువురాదు. 'వీరు ఎందుకూ పనికిరారు' అంటూ సమాజం చూసే చిన్నచూపు నన్ను కలచివేసేది. 'వయస్సుతో సంబంధంలేని ఈ పసి మనసులకు ఎంతోకొంత అండగా ఉండలేమా?' అన్న ఆలోచన ఆనాడే వచ్చింది. తర్వాత ఓ ఉద్యోగంలో చేరా. అక్కడ నాకు ఆ రకమైన వాతావరణం కనిపించలేదు. చివరకు నేనే ఒక ఎన్జీఓను స్థాపించి, ఈ చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని నిర్ణయానికి వచ్చా. నాకు నా భర్త, కుటుంబం తోడైంది. అలా ఏడుగురు చిన్నారులతో 2003లో బంజారాహిల్స్‌లో మొదలైంది మా 'శంకర్ ఫౌండేషన్' ప్రస్థానం. ఇప్పటి వరకు 800మందికిపైగా పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో కొంతైనా విజయం సాధించామన్న సంతృప్తి ఉంది. ప్రస్తుతం మా సంస్థలో 234 మంది వివిధ దశల్లో శిక్షణ పొందుతున్నారు. వీరిలో రెండేండ్ల నుంచి 60 ఏండ్ల వయస్సు వారూ ఉన్నారు.

### మూడు విభాగాలుగా పనిచేస్తాం

మా శంకర్ ఫౌండేషన్ మొత్తం మూడు విభాగాలుగా పనిచేస్తున్నది. దీనిలో మొదటిది 'శ్రద్ధసాబూరి'. దీనిలో రెండేండ్ల నుంచి 8 యేండ్ల వరకు పిల్లలు ఉంటారు. ఇక్కడే వారికి చదువు అంతా నేర్పుతాం. అవసరాన్నిబట్టి ఫిజియోథెరఫీ, స్పీచ్‌థెరఫీ ఇప్పిస్తాం. వారిలో పరివర్తనను బట్టి నార్మల్ స్కూల్‌కు పంపుతాం. ఇక రెండోది 'సమర్థ్ సాకార్'. దీనిలో పిల్లలకు వాళ్ల సామర్థ్యాన్ని బట్టి వారికి ఉపాధి కల్పనకు అక్కరకు వచ్చే శిక్షణను ఇస్తాం. ఇక మూడోది 'సన్నిధి సాంత్వన'. ఇక్కడ పెద్ద పిల్లలు అంటే 25 యేండ్లపైన వారు ఉంటారు. కొందరు తల్లిదండ్రులు సైతం పిల్లలతో కలిసి ఉంటారు. మా దగ్గర ఐదారు కుటుంబాలకు చెందిన 60 యేండ్ల వాళ్లు ఉన్నారు. ఇది రామోజీ ఫిలిం సిటీ దగ్గర ఉంది. ఇలా అన్ని దశల్లో కలిపి ఇప్పుడు మొత్తం 234 మంది మా దగ్గర ఉన్నారు.

### ఉపాధి చూపే వరకు వచ్చాం

గతంలో 'ఇలాంటి పిల్లలకు అసలు చదువే రాదు' అనే భావన ఉండేది. దాని కోసం మేం సొంతంగా కరికులమ్ తయారు చేసి, వాళ్లకు మెల్లగా విద్యాబుద్ధులు నేర్పాం. క్రమంగా మా ఎన్జీఓలో చదువుకున్న పిల్లల్లో పదోతరగతి, ఇంటర్ పాస్ అయిన వాళ్లూ ఉన్నారు. తర్వాత నా ఆలోచనలు 'వాళ్ల భవిష్యత్తు ఏంటి?' అన్న దానిపై ఉండిపోయింది. 'వీళ్లు ఎప్పటికీ ఒకరి సహకారంతో ఉండాల్సిందేనా? వీళ్లు స్వయం ఉపాధి పొందేలా ఏమీ చేయలేమా?' అని ఆలోచించేదాన్ని. దానినుంచి క్రమంగా ఒక్కొక్క అంశాన్ని జోడిస్తూ పిల్లల మానసిక, శారీరక సామర్థ్యానికి తగ్గట్టుగా మేం ఒకేషనల్ కోర్సులను ప్రవేశపెడుతూ వచ్చాం. ఇప్పుడు వాళ్లలో 30మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పనిచేస్తూ నెలకు కొంత జీతాన్ని పొందుతున్నారు. అదేవిధంగా గానుగ నూనె పట్టడం, పేపర్‌ప్లేట్లు, పేపర్ బ్యాగ్‌లు తయారు చేయడం, హెర్బల్ సోప్స్ తయారు చేయడం, పలు రకాల ధాన్యాలను పిండిగా మార్చి ప్యాకింగ్ చేయడం.. ఇలా ఎన్నో విషయాల్లో తర్ఫీదు పొందారు. ఈ శిక్షణలో చిన్నారుల తల్లుల సహకారం మరువలేనిది. వాళ్లకు వాళ్లే స్వయం ఉపాధి పొందుతుంటే ఎంతో సంతృప్తిగా అనిపిస్తుంది. భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం గారు ఒక సందర్భంలో మా చిన్నారులకు ఒక పాట రాసి ఇచ్చి దానికి ట్యూన్ చేయాలని కోరారు. తర్వాత హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మా చిన్నారులు ఆ పాటకు ట్యూన్ చేసి వినిపిస్తే కలాం గారు ఎంతో సంతోషించి, ఆ పాటను తన కాలర్‌టోన్‌గా 21 రోజులపాటు పెట్టుకున్నారు. ఇంత సాధించామంటే మా సిబ్బంది, ఆ చిన్నారుల తల్లిదండ్రుల సహకారంతోనే.

### వివక్ష పోవాలి..

సమాజంలో ఈ చిన్నారులపై ఇంకా చిన్నచూపే ఉంది. వీళ్లను తక్కువగా చూస్తారు. ఈసడించుకుంటారు. వాస్తవానికి వీరిది ఎంతో నిర్మలమైన మనస్సు. కల్మషం లేని మనుషులు.. ఒక్కమాటలో చెప్పాలంటే దేవుళ్లతో సమానం. కేవలం ఆ పిల్లల తల్లిదండ్రులే కాకుండా సమాజంలోనూ సున్నితత్వం పెరిగితే కొంతకాలానికి వాళ్లు మనతో సమానం అవుతారు. మా దగ్గర ఎంతో ధనికులైన పిల్లలు ఉన్నారు. పేద పిల్లలూ ఉన్నారు. మా దృష్టిలో డబ్బు ప్రధానం కాదు. పిల్లలకు ఏదో ఒక విధంగా జీవితంలో సాయ పడాలన్నదే మా లక్ష్యం. రెండేండ్ల నుంచి ఏ వయస్సు వారినైనా చేర్చుకుంటాం. అవసరమైన వాళ్లు 27760125/ 9948077280 నంబర్లలో సంప్రదించవచ్చు.

### ఆత్మవిశ్వాసం పెరిగింది..



మా అబ్బాయి వరుణ్‌చంద్‌ను శంకర్‌ఫౌండేషన్‌లో చేర్పించిన తర్వాత చాలా మార్పు వచ్చింది. మా అబ్బాయి మాదిరిగా మిగిలిన పిల్లలకు ఓ ఉత్సాహాన్ని ఇవ్వడానికి ఒక అవకాశం ఇవ్వొచ్చని భావించి ప్యాకింగ్ ఇతర పనులను వాళ్లకు అప్పగించాం. చాలా మార్పు వచ్చింది. మా అబ్బాయి వరుణ్‌తో '24 మంత్ర ఆర్గానిక్' ఫ్రాంచైజీ తీసుకుని స్టోర్ పెట్టించాం. క్రమంగా తాను పిక్అప్ అయ్యాడు. తర్వాత 2015లో మేమే సొంతంగా ఒక స్టోర్ ప్రారంభించాం.

**- అపర్ణ,** హోలిస్టిక్ వెల్‌నెస్‌స్టోర్ నిర్వాహకురాలు

### 34మంది డేటా ఎంట్రీ చేస్తారు



గతంలో సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేసిన మంజూషతన కొడుకును శంకర్ ఫౌండేషన్‌లో చేర్పించింది. ఆమె ఇక్కడికి వచ్చినప్పుడల్లా పిల్లల్లో శక్తిని గమనించి వాళ్లను డేటా ఎంట్రీ వైపు మళ్లించింది. మాతో కలిసి ఆమె పిల్లలకు డేటా ఎంట్రీ ఎలా చేయాలో శిక్షణ ఇచ్చింది. ఇప్పుడు ఖైరతాబాద్‌లోని ఓ సెంటర్‌లో రోజుకు 34 మంది వరకు పిల్లలు డేటా ఎంట్రీ చేస్తున్నారు. వారు నెలలకు కొంత డబ్బును సొంతంగా సంపాదించడం ఆనందం కలిగిస్తున్నది.

**- శ్రీదేవి,** చైల్డ్ సైకాలజిస్ట్

... నాగోజు సత్యనారాయణ,
క్రైం రిపోర్టర్, స్టేట్‌బ్యూరో

# కన్నీటి కంటైనర్!



ఫామ్‌త్రి థా మే



**ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. మొత్తం 39మంది. అత్యంత క్లిష్టమైన.. దుర్భరమైన, గాఢాంధకారమైన క్షణాలను పంటిబిగువున అదిమిపెట్టి.. ఆ నరకప్రాయమైన రోజులను అనుభవించారు. రేపటి బంగారు భవిష్యత్ కోసం.. ప్రస్తుత క్షణాలను తాకట్టుపెట్టారు. చివరికి తనువు చాలించారు. సజీవ ఆశలతో ఆ మృత్యుగుహ(కంటైనర్)లో అడుగుపెట్టి.. విగతజీవులై కన్నవారికి శోకాన్ని మిగిల్చారు.**

**'అమ్మా, నన్ను క్షమించు. నేను గమ్యానికి చేరలేకపోతున్నా. నాన్నా.. ఐ లవ్ యూ. నేను చనిపోతున్నా. ఎందుకంటే.. నాకు ఊపిరి అందడం లేదు'**

ఇదీ.. 26 యేండ్ల 'ఫామ్‌త్రి థా మే' చివరి సందేశం. ప్రతీ క్షణం మత్యువుతో పోరాడి.. చివరికి ఓడిపోయింది. భవిష్యత్‌పై ఆశలు పెట్టుకొని ఇంటి నుండి బయలెల్లి.. అర్థాంతరంగా తనువు చాలించింది. కూతురు బంగారు భవిష్యత్ కోసం ఆకలిని చంపుకొని, కడుపు కాల్చుకొని రూపాయికి రూపాయి జతచేసిన ఆ తల్లిండ్రులు.. కూతురి మరణవార్తవిని కుప్పకూలిపోయారు. నెలకు 28వేలు సంపాదిస్తూ.. వాటిలో మూడోవంతు కూతురు కోసం దాచిన కన్నవారు.. 'మా ఆశలు కంటైనర్‌లోనే గడ్డకట్టుకుపోయాయే దేవుడా' అంటూ గొల్లుమంటున్నారు.

ఏం మాయమాటలు చెప్పారో ఆ స్మగ్లర్లు.. తమ కూతురి కోసం దాచిన 27 లక్షల రూపాయలను వారిచేతుల్లో పెట్టి కూతుర్ని మృత్యు ఒడిలోకి సాగనంపారు. 'నేను సురక్షితంగా చేరాను నాన్నా..' అనే కూతురి సందేశం కోసం ఎదురు చూస్తూ.. ఆమె మరణ వార్తే చివరి సందేశంగా రావడంతో కుప్పకూలిపోయారు. మరీ.. ఆ 38మంది కుటుంబీకులు ఎంతలా రోదిస్తున్నారో..

### ఎవరిదీ పాపం.. అసలేం జరిగింది?

గత మంగళవారం అర్ధరాత్రి.. సమయం 1.40 నిమిషాలు.. అది లండన్ నగరంలోని ఎస్సెక్స్ కౌంటీ ప్రాంతం. దానికి సమీపంలోని ఈస్టర్న్ అవెన్యూలోని వాటర్‌గ్లాడ్ పారిశ్రామిక పార్కులో ఓ భారీ కంటైనర్ వేగంగా వెళ్లడాన్ని గమనించారు అక్కడి అంబులెన్స్ సర్వీస్ సిబ్బంది. అనుమానాస్పదంగా ఉన్న ఆ కంటైనర్‌పై పోలీసులకు సమాచారం అందించారు. క్షణాల్లోనే పోలీసులు రంగప్రవేశం చేసి గ్రేస్ ప్రాంతంలో ఆ కంటైనర్‌ను నిలువరించారు. పోలీసులు కంటైనర్ డోర్ తెరిచి.. ఆ భీకర దృశ్యం చూసి ఇంగ్లండ్ ప్రధానికి సమాచారం చేరవేశారు. ఎందుకంటే ఆ కంటైనర్‌లో 39 మృతదేహాల్లో కొన్ని నగ్నంగా, మరికొన్నింటిపై గుడ్డ పీలికలు మాత్రమే ఉన్నాయి. వాటిల్లో 31 మంది పురుషులు, 8 మంది మహిళలవి. క్షణాల్లోనే రాబిన్సన్‌ను కస్టడీలోకి తీసుకున్నారు. బుధవారం ఉదయం తెల్లవారుజామున.. ఈ 39 మృతదేహాల వార్తలు వింటూనే నిద్రలేచింది ప్రపంచం. ఎక్కడివి ఆ శవాలు..? ఎవరివి? ఎవరు చంపారు? ఎందుకు చంపారు? అసలేం జరిగింది? అంటూ విభిన్న వాదనలు. చనిపోయినవారు అక్రమ వలసదారులని అక్కడి పోలీసులు ధ్రువీకరించారు. మొదట మృతులంతా చైనీయులే అనుకున్నారు. ఎందుకంటే గతంలో కూడా 150మంది చైనీయులు అక్రమంగా వలస వచ్చేందుకు ప్రయత్నించి చనిపోయారు. దీంతో చైనాపై అంతా దుమ్మెత్తిపోశారు. చైనా తమవారు కాదని అధికారికంగా ప్రకటించడంతో మళ్లీ కథ మొదటికొచ్చింది. ఈసారి మృతుల ఫోన్ల ఆధారంగా వియత్నాంకు చెందిన వారిగా గుర్తించారు. వెంటనే రంగంలోకి దిగిన డిటెక్టివ్‌లు, పోలీసులు ఒకవైపు రాబిన్సన్ నుంచి సమాచారం సేకరిస్తూనే.. ఈ మృతదేహాల వ్యవహారంలో భాగస్వాములైన వారిని అరెస్టు చేస్తూ.. మరిన్ని వివరాలు సేకరించే పనిలో పడ్డారు.



ఫామ్‌త్రి థా మే తల్లిదండ్రులు

### మృత్యువుతో ప్రయాణం

కోల్ కంటైనర్‌లో అసువులు బాసిన వారంతా వియత్నాంలో పరిస్థితి బాగలేకనో, వీసాలు తెచ్చుకునే స్థాయి లేకనో అక్రమంగా ఇంగ్లండ్‌లో నివసించాలనుకున్నారు. ఇందుకు స్మగ్లింగ్ గ్యాంగ్‌లతో సంబంధాలు పెట్టుకొని.. వారికి లక్షల్లో డబ్బులు ముట్టజెప్పారు. వీరిని విమానాలలో, కార్లలో సురక్షితంగా గమ్యం చేర్చుతామన్న స్మగ్లర్లు.. అతి దారుణంగా బొగ్గు చేరవేసే కంటైనర్‌లో జంతువుల్ని కుక్కినట్లు కుక్కి తీసుకెళ్లారని ఫామ్ తల్లిదండ్రులు అంటున్నారు. ఈ ప్రయాణంలో వారికి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రమో, రాత్రో కూడా తెలియదు. అంతా గాఢాంధకారం. ఈ అంధకారాన్ని ఓర్చుకొని ఒక్కసారి సరిహద్దు దాటితే.. జీవితమంతా వెలుగులు చూడొచ్చనేదే వారి ధైర్యం. ఒప్పందం ప్రకారం ఈ 39 మందిని సజీవంగా గమ్యానికి చేర్చాల్సిన డ్రైవర్ రాబిన్సన్.. తనని తాను రక్షించుకునేందుకు వలసదారుల ప్రాణాలతో చెలగాటమాడాడు. సరిహద్దులు దాటే క్రమంలో కంటైనర్లను స్కానర్ల ద్వారా తనిఖీ చేస్తారు. వాటిలో మనుషులు ఎవరైనా ఉంటే శరీర వేడి ఆధారంగా అవి వెంటనే పసిగడతాయి. శరీరాలు చల్లగా ఉంటే గుర్తించడం కష్టం. అందుకే మృతులున్న కంటైనర్‌లో ఉష్ణోగ్రత మైనస్ 25 డిగ్రీలు ఉన్నది. ఒకే కంటైనర్లో అంతమంది ఉండటం వల్ల శ్వాస తీసుకోవడం కష్టమై చనిపోయి ఉండవచ్చనేది ప్రాథమిక అంచనా. వివిధ దేశాల నుంచి ప్రజలను అక్రమంగా యూకేకు తరలించి.. వారిని గంజాయి వనాల్లో కూలీలుగా, నైట్ క్లబ్బుల్లో డ్యాన్సర్లు, వేశ్యలుగా వాడుకుంటున్నారు. ఇలా పనిచేసేవారికి భారీ మొత్తాలను చెల్లిస్తున్నారు. ఇలాంటి అక్రమ వలసలను చైనాకు చెందిన 'స్నేక్ హెడ్' గ్యాంగ్ ప్రోత్సహిస్తుంటుంది. ఈ ఘటనలో స్నేక్ హెడ్ గ్యాంగ్ హస్తంపై ఆరా తీస్తున్నారు.

... డప్పు రవి

# మీ చెవులు పదిలమేనా?



- రెండుస్పూన్ల ఆముదం/కొబ్బరి నూనెను చిన్న గిన్నెలో పోయాలి. అందులో రెండు వెల్లుల్లి రిబ్బల్ని వేసి వేడిచేయాలి. ఈ మిశ్రమాన్ని చల్లార్చాలి. చెవుల్లో రెండు చుక్కలు వేసుకోవాలి. చెవుల నుంచి ఈ నూనె చుక్కలు బయటకు రాకుండా కాటన్ అడ్డుగా ఉంచాలి. ఇలా చేస్తే చెవులు శుభ్రంగా అవుతాయి.
- ఏ నొప్పినైనా భరించవచ్చు. కానీ చెవి నొప్పిని మాత్రం భరించడం కష్టం. చెవిపోటు, చెవిలో చీము, ఇన్‌ఫెక్షన్ ఉన్నవారు తులసి ఆకులను మెత్తగా చేసుకోవాలి. వడగట్టి ఆ రసాన్ని చెవుల్లో వేసుకుని గంట తర్వాత శుభ్రం చేసుకుంటే చెవిపోటునుంచి ఉపశమనం పొందవచ్చు.
- పిల్లలను పెద్ద శబ్దాలకు దూరంగా ఉంచాలి. ముఖ్యంగా ఇయర్ బడ్స్, ఇయర్ ఫోన్స్ ఉపయోగించడం వల్ల పిల్లల చెవులు దెబ్బతినే అవకాశం ఉంది. పెద్ద శబ్దాలు వినిపించే సమయంలో చెవుల్లో కాటన్ పెట్టడం మంచిది.
- చెవుల్లో గులిమిని ఎప్పటికప్పుడు తొలగిస్తుంటారు. కానీ, ఇది చెవుల లోపలి గదులను రక్షిస్తుంది. ఎక్కువ శబ్దం విన్నప్పుడు కర్ణభేరికి చేరకుండా చూస్తుంది. కొంతమేర గులిమి చెవుల్లో ఉండడమే మంచిదని వైద్యులు చెబుతున్నారు.

# ఈ తప్పు ఎవరిది?

ఆయనో లారీ డ్రైవర్. ఒక్కతే కూతురు. దంపతులిద్దరూ అమ్మాయిని అల్లారు ముద్దుగా పెంచారు. ఉన్నత చదువులు చదివించి అమెరికాలో స్థిరపడేలా చూడాలని కలలుకన్నారు. ఆ అమ్మాయి ఇంకా డిగ్రీ రెండో సంవత్సరంలోనే ఉంది. ఇదివరకే ఒక అబ్బాయితో ప్రేమ వ్యవహారం నడిపింది. దాంతో గొడవలు అయ్యాయి. ఇప్పుడు మరో అబ్బాయితో వ్యవహారం. వద్దన్నందుకు తల్లిని చున్నీతో ఉరి తీసి చంపి శవం ఇంట్లో ఉండగానే ప్రియుడితో మూడు రోజులు గడిపింది. తరువాత కారులో తీసుకొని రైలు పట్టాలపై పడుకోబెట్టింది. అందరినీ మభ్యపెట్టింది. చివరకు తండ్రిని బలి పశువును చెయ్యాలని చూసింది. కూతురుని అల్లారు ముద్దుగా పెంచినందుకు తల్లి దిక్కు లేని చావు చచ్చింది. కనీసం శవం కూడా సరైన దహన సంస్కారానికి నోచుకోలేదు. ఇక తండ్రి బతికినన్నాళ్లు జీవచ్ఛవమే. ఆ క్రిమినల్ అమ్మాయికి ముందుగా అండర్ ట్రయిల్‌గా అటు పై ఖైదీగా కనీసం పదేళ్లు జైలు జీవితం. అంటే మొత్తం ఒక కుటుంబం నాశనం.

ఇదేదో ఎక్కడో ఎప్పుడో జరిగితే ఏమోలే అనుకోవచ్చు. కానీ, వారానికి రెండు చొప్పున ఇలాంటి క్రైమ్ స్టోరీస్. మొన్నటికి మొన్న పబ్‌జీ గేమ్ ఆడొద్దన్నందుకు తండ్రిని చంపిన కొడుకు. స్కూల్‌లో టీచర్స్‌ను.. స్నేహితులను.. తల్లిదండ్రులను చంపుతున్న పిల్లల్లు. ఇది ఎలా జరుగుతున్నది?



టీనేజ్‌లోనే పిల్లల మనస్సు ఇంత విషపూరితం ఎందుకు అవుతున్నది??

చందమామ, బాలమిత్ర మ్యాగజైన్స్, సత్య హరిశ్చంద్ర, రామాయణ మహాభారత కథలు - ఇలా మొన్నటి దాక వినోదం అంటే నైతిక సూత్రాల లైఫ్ స్కిల్స్ పాఠాలు. ఇప్పుడు వినోదం అంటే మనస్సులోకి విషం ఎక్కించడమే. వీడియో గేమ్స్, క్రైమ్ సీరియల్స్, చెత్త సినిమాలు నెట్‌ఫ్లిక్స్, యూట్యూబ్ షార్ట్ మూవీస్. నేను ఇది వరకే చెప్పాను.. తల్లి, తండ్రికి తెలియకుండా ప్రతి ఇంట్లో ఒక టెర్రరిస్ట్ తయారవుతున్నాడు అని. అవుతున్నాడు అంటే అబ్బాయిలకు వర్తిస్తుంది. నాది వాక్య నిర్మాణ దోషం. తయారవుతున్నారు అని చెప్పి ఉండాల్సింది. హైదరాబాద్‌లో రాత్రి పది గంటల తరువాత ఏదైనా పబ్‌లోకి అడుగుపెడితే అర్థం అవుతుంది. చెడును ఒంట పట్టించుకోవడంలో అమ్మాయిలు.. అబ్బాయిలను ఓవర్ టేక్ చేస్తూ మిగతా విషయాల్లో ఎలా ఉన్నా ఇలాంటి విషయాల్లో లింగ భేదాన్ని ఎలా చెరిపేస్తున్నారో.

దీనికోసం వారిని వీరిని నిందించి ప్రయోజనం లేదు. ప్రభుత్వాలు, సంస్థలు ఏమీ చెయ్యవు. ఇది ఒక సమస్య అని వారికి అనిపించదు కూడా. టీవీలకు రాజకీయ రచ్చ తప్పించి ఇంకేమి పట్టదు. సమస్యకు పరిష్కారం తల్లి తండ్రి చేతిలోనే ఉంది. మీ పిల్లల్ని స్మార్ట్‌ఫోన్‌కు దూరం చెయ్యండి. టీవీ, ఇంటర్‌నెట్‌పై వారు ఏమి చూస్తున్నారో ఒక కంట కనిపెట్టి ఉండండి. మంచి పుస్తకాలను వారితో చదివించండి. వారితో క్వాలిటీ టైం గడపండి. వారితో స్నేహితుల్లా ఉంటే వారు మీ చెయ్యి దాటిపోకుండా ఉంటారు. పిల్లల పై ఆశలు పెంచుకోవడం ప్రతి తల్లి తండ్రి చేసే పనే. వారు లక్ష్య సాధన వైపు సాగిపోయేందుకు వారికి మంచి మార్గం చూపే పని.. కేవలం అవగాహన కలిగిన మెచ్యూర్డ్ పేరెంట్స్ మాత్రమే చెయ్యగలరు. పేరెంటింగ్ ఈజ్ యాన్ ఆర్ట్.. పేరెంటింగ్ ఈజ్ ఏ సైన్స్.

... అమర్‌నాథ్ వాసిరెడ్డి
కరస్పాండెంట్, స్లేట్-ద స్కూల్

# యవ్వనంతో కనిపించండి



- కంటినిండా నిద్రపోతే ఎన్నో అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. కనీసం 6-9 గంటలు నిద్రపోవాలి. సమయానుసారంగా నిద్రపోతే శరీరంలోని జీవక్రియలో మార్పులు వచ్చి చర్మం కళకళలాడుతుంది.
- ఉదయం లేవడంతోనే వాకింగ్ చేస్తే ఎన్నో ప్రయోజనాలున్నాయి. ముఖ్యంగా నడకతో శరీరంలో రక్త ప్రసరణ వ్యవస్థ క్రమబద్ధంగా సాగుతుంది. బీపీ, డయాబెటీస్ వంటివి కూడా తగ్గుముఖం పడుతాయి. మార్నింగ్ వాక్‌తో శరీరంలోని అన్ని అవయవాలకు రక్తం సరిగ్గా అందుతుంది. తద్వారా చర్మ కాంతి కూడా పెరుగుతుంది.
- ఆహారాన్ని క్రమం తప్పకుండా తింటున్నాం కదాని పండ్లను తినడాన్ని నిర్లక్ష్యం చేయవద్దు. తాజా పండ్లను తినడం ద్వారా శరీరంలో రక్తపుష్టి పెరుగుతుంది. దాంతో పాటు తగినన్ని విటమిన్లు కూడా శరీరానికి అందుతాయి.
- పనిలో పడి మంచినీటిని తాగడం మర్చిపోతుంటారు చాలామంది. ఇది చాలా ప్రమాదకరం. మన శరీరంలో పేరుకుపోయిన వ్యర్థాలను బయటకు పంపడానికి నీరు ఎంతో సహకరిస్తుంది. ముఖ్యంగా మన శరీరం 70 శాతం నీటితోనే నిండి ఉందనే విషయాన్ని మరిచిపోవద్దు. శరీరానికి తగినంత నీరందకపోతే చర్మం సహజత్వాన్ని కోల్పోతుంది.

నమస్తే తెలంగాణ
యువ
[ కరీంనగర్ ]
బుధవారం 30 అక్టోబర్ 2019

### ఏం డైలాగ్ గురూ..



ట్రిగ్గర్ మీద వేలుపెట్టిన ప్రతీవోడూ షూటర్ కాదు. అమ్మాయి మీద చేయి వేసిన ప్రతి ఒక్కడూ మగాడు కాదు. నా అర్థత ఏంట నేదే నన్ను ప్రేమించిన వారికి తప్ప వేరే వారికి అర్థం కాదు.

సినిమా: (కేజీఎఫ్)

### వాట్సప్ మెసేజ్

పుట్టినప్పుడు పేరు ఉండదు. ఊపిరి మాత్రమే ఉంటుంది. చచ్చినప్పుడు ఊపిరి ఉండదు. పేరు మాత్రమే ఉంటుంది. ఈ రెండింటి మధ్య ఉన్నదే జీవితం. ఊపిరి ఎలాగూ నిలుపుకో లేము. కనీసం పేరునైనా నిలుపుకుందాం..

### మంచిమాట



మీరు నన్ను చంపినా
నా సంకల్పాన్ని చంపలేరు!
నా దేహాన్ని తునాతునకలు చేసినా..
నా ఆత్మను ఏమీ చేయలేరు.
నా దృష్టిలో రాజీపడడం అంటే లొంగిపోవడం కాదు. కొంత విశ్రాంతి తీసుకోవడం. మళ్లీ పోరాడడం.

- భగత్ సింగ్

### నవ్వుకొందాం

చనిపోయిన తర్వాత..
దేవుడు.. అందరినీ పిలిచి తెల్ల కాగితాలపై మీరు చేసిన తప్పులన్నీ రాయమన్నాడు.
వెనుక నుంచి ఓ గొంతు..
'అరే.. కొంచెం చూపించు బే!

---

టెక్నాలెడ్జీ

## హువావాయి కొత్త ఫోన్

హువావాయి కంపెనీ కొత్త ఫోన్‌ను విడుదల చేసింది. ఎంజాయ్ 10ఎస్ పేరుతో అందుబాటులో ఉంది. ఫీచర్లు ఆకట్టుకుంటున్నాయి.



| | |
|---|---|
| **డిస్‌ప్లే :** | 6.3 అంగుళాలు |
| **ప్రాసెసర్ :** | 1.7 అక్టాకోర్, హిసిలికాన్ కిరిన్ |
| **ఓఎస్ :** | ఆండ్రాయిడ్ 9 |
| **ర్యామ్ :** | 6 జీబీ |
| **స్టోరేజీ :** | 64 జీబీ |
| **కెమెరా :** | 48+8+2 ఎంపీ ట్రిపుల్ కెమెరా |
| **ఫ్రంట్ కెమెరా :** | 16 ఎంపీ |
| **బ్యాటరీ :** | 4000 |

## స్మార్ట్ చొక్కా



టెక్నాలజీ పెరిగాక రకరకాల పరికరాలు అందు బాటులోకి వస్తున్నాయి. ఆరోగ్యాన్ని పర్యవేక్షిం చేందుకు కూడా అనేక అప్లికేషన్లు వస్తున్నాయి. వాటితో పాటు స్మార్ట్ ఉత్పత్తులు కూడా వస్తు న్నాయి. అలాంటి ఉత్పత్తుల్లో ఒకటే 'స్మార్ట్ షర్ట్' ఊపిరితిత్తుల పనితీరును పర్యవేక్షించేం దుకు దీన్ని శాస్త్రజ్ఞులు తయారు చేశారు. ఉచ్ఛ్వాస, నిశ్వాస సమ యాల్లో ఛాతీ, ఉదరభాగంలో కలిగే మార్పులను అంచనా వేస్తుంది. ఏదైనా సమస్య ఉంటే వెంటనే మనల్ని అప్రమత్తం చేసేలా ఇది పనిచేస్తుంది. ఇది ఫోన్‌కు అనుసంధానం అయి ఉంటుంది. 'హెక్సోస్కిన్'గా పిలిచే ఈ షర్టు ద్వారా గుండె పనితీరును కూడా ఎప్ప టికప్పుడు అంచనా వేయొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నెదర్లాండ్స్‌కు చెందిన రెడ్ బౌడ్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్ పరిశోధకులు దీన్ని తయారు చేశారు.

## కండ్లు భద్రం..




రోజూ బ్రౌజింగ్ చేస్తూ ఉంటాం. దాని కోసం క్రోమ్ ఎక్కువ వాడుతారు చాలా మంది. ఇలా నిరంతరం స్క్రీన్‌ను చూడడం ద్వారా కండ్లమీద ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. అందుకే క్రోమ్‌లో డార్క్ మోడ్ ద్వారా బ్రౌసింగ్ చేస్తే ఆ ప్రమాదం తక్కువ ఉంటుంది. అందుకే పలు డివైజ్‌లలో డార్క్ మోడ్ క్రోమ్ ఎలా వాడాలో చూడండి.

**ఆండ్రాయిడ్**

స్మార్ట్ ఫోన్ అన్నాక నెట్ లేకుండా ఉండదు. కాబట్టి బ్రౌజింగ్ చేసేటప్పుడు డార్క్ మోడ్‌లో చేసుకుంటే మంచింది. గూగుల్ క్రోమ్‌లో డార్క్ మోడ్ ఉపయోగించాలంటే అడ్రెస్ బార్ లోchrome://flags అని టైప్ చేయాలి. డైలాగ్ బాక్స్ మీకు ఓపెన్ అవుతుంది. అందులో ' dark mode' అని టైప్ చేసి ఎంటర్ చేయాలి. 'Android web contents dark mode', 'Android chrome UI dark mode' ఆప్షన్లు కనిపిస్తాయి. వీటిలో దేన్నయినా ఎంచుకోవచ్చు. అంతే మీ ఆండ్రాయిడ్ డివైజ్ లో గూగుల్ క్రోమ్ డార్క్ మోడ్ ఎనేబుల్ అయినట్లే.

**విండోస్ 10**

కంప్యూటర్‌లోని సెట్టింగ్స్ మెనూలోకి వెళ్లాలి. పర్సనలైజేషన్ ఆప్షన్ కనిపిస్తుంది. దాని ద్వారా కలర్స్ ను ఓపెన్ చేసి అక్కడ Choose your default app mode ను ఎనేబుల్ చేయాలి. దాన్ని డార్క్ కు మారిస్తే.. క్రోమ్ ను రీస్టార్ట్ చేయకుండానే డార్క్ మోడ్ ఎనేబుల్ అయిపోతుంది.

**మాక్ ఓఎస్ సాఫ్ట్‌వేర్**

సిస్టం ప్రిఫరెన్సెస్ ఓపెన్ చేయండి. అందులో జనరల్‌పై క్లిక్ చేసి.. అప్పియరెన్స్‌ను ఎంచుకోండి. ఇక అక్కడ కనిపించే ఆప్షన్లలో డార్క్ ఆప్షన్‌ను సెలక్ట్ చేసుకోండి. అంతే డార్క్ మోడ్‌లోకి మారిపోతుంది.

# కథ చెబుతాం.. కొత్తగా!

**అనగనగ అంటూ కథలు మొదలవుతాయి. కథ కంచికి మనం ఇంటికి అంటూ ముగుస్తాయి. ఇలాంటి కథలెన్నో మనం వినే ఉంటాం. అంతే సాధారణంగా మరిచిపోయే ఉంటాం. కానీ కొన్ని కథలు మాత్రం కంచికిపోవు. కొన్నాళ్లు మనతో ప్రయాణిస్తాయి. తెలియకుండానే మన ఆలోచనల్ని మారుస్తాయి. జీవితాన్ని నిలబెడతాయి. అలాంటి కథలే చెబుతున్నారు కృష్ణచైతన్యరెడ్డి, వంశీకృష్ణరెడ్డి బ్రదర్స్. కథలు చెప్పడం వెనుక ఉన్న కథ చెప్పమని 'యువ' వారిని పలుకరించింది.**



**ఎండలు** దంచికొడుతున్నాయ్. భూమి పొగలు కక్కుతున్నది. బావుల్లో, మనుషుల శరీరాల్లో నీరు ఆవిరైపోతున్నది. అది 2019 జూన్. బీఎన్ రెడ్డినగర్. ఓ జ్యూస్ సెంటర్ వద్ద చాలామంది ఉన్నారు. స్పీడ్‌గా ఓ రేంజ్‌రోవర్ కారు వచ్చి ఆగింది. అందులో ముందు కూర్చున్న వ్యక్తి మిర్రర్ దించారు. ''రెండు గ్లాసుల మోసంబీ జ్యూస్ ఇవ్వవా' అనడిగారు. జ్యూస్ తీసేపనిలో పడ్డాడు నిర్వాహకుడు. కారును పార్క్ చేసి వచ్చారు ఓ ఇద్దరు. మోసంబీ జ్యూస్ తాగుతున్నారు. స్ప్లెండర్ బైక్‌పై వచ్చాడు మరో వ్యక్తి. 'భాయ్ ఏక్ గ్లాస్ పైనాపిల్ జ్యూస్ దేవో' అనడిగాడు. వెనక్కి తిరిగి కూర్చోబోయాడు. అప్పటికే జ్యూస్ తాగుతున్న ఇద్దరిని బాగా చూస్తున్నాడు. ''సార్ మీరు కృష్ణచైతన్యరెడ్డి, వంశీకృష్ణరెడ్డి కదా'' అని అడిగాడు. అవునూ అన్నట్లుగా తలూపారు ఇద్దరు. ''సార్ మీ వల్లనే నేను ఇప్పటిదాకా బతికి ఉన్నా. థాంక్యూ థాంక్స్ ఎలాట్ సార్.. మీ రుణం ఈ జన్మలో మరిచిపోను'' అన్నాడు. థాంక్యూ.. థాంక్యూ.. ''అర్జెంట్ పని ఉంది. వెళ్తాం'' అంటూ ఇద్దరూ వెళ్లబోయారు. ''సార్ సార్ ఒక్క సెల్ఫీ.. అంటూ సెల్ఫీ తీసుకున్నాడు. కారులో వాళ్లు, బైక్‌పై ఇతను వెళ్లిపోయాడు. ఇంతకీ ఎవరు వాళ్లు. బైక్‌పై వచ్చిన వ్యక్తికి ఏం సాయం చేశారు? ఓ ఐదేళ్లు వెనక్కి వెళ్దాం.



### ఫ్లాష్‌బ్యాక్!

అది 2014. హైదరాబాద్‌లోని రాంకోటి. 'చైతన్యరెడ్డి ఇన్‌స్టిట్యూట్'. పెద్ద పెద్ద అక్షరాలతో బోర్డు మెరుస్తుందక్కడ. 'బ్యాంకింగ్, అప్టిట్యూడ్ క్లాసెస్ ఆర్ స్టార్టెడ్' అని బోర్డుపైరాసి ఉంది. లోపలికి అడుగుపెట్టేముందు వరుసగా చెప్పుల స్టాండ్‌లు కనిపించాయి. లోపల క్లాస్ నడుస్తున్నది. పెద్ద హాల్. ఎక్కువ మంది లేనందుకేమో రీసౌండ్ వస్తున్నది. అది మొదటి రోజు. ట్రైనింగ్ కోసం ముగ్గురే వచ్చారు. నెల రోజులు గడిచాయి. ఆ ఇన్‌స్టిట్యూట్‌లో మళ్లీ అదే ముగ్గురు కనిపించారు. నెల తిరగకముందే ఇన్‌స్టిట్యూట్‌కు తాళం. దాదాపు రూ. 15 లక్షలు నష్టం. ఆస్తులన్నీ పోయాయి. కొందరికి నమ్మకం కూడా పోయింది. కానీ తనపై తనకు మాత్రం నమ్మకం రెట్టింపయ్యింది.

### పోయింది డబ్బు.. నమ్మకం కాదు

'అమ్మ చేతి గాజులు, నాన్న స్కూటర్. ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు. దొరికిన కాడికి అప్పులు.' ఇవన్నీ పదే పదే గుర్తు చేసింది గతం. రోడ్డున పడేసింది ఇన్‌స్టిట్యూట్. అప్పుడెన్నో అవమానాలు. ఎన్నో ఛీత్కారాలు. ఆస్తులన్నీ పోయినా తల్లిదండ్రులకు మాత్రం కృష్ణచైతన్యరెడ్డిపై నమ్మకం పోలేదు. వారి నమ్మకాన్ని నిలబెట్టాలనుకున్నారు. ఎక్కడైతే ఓడిపోయామో అక్కడి నుంచే ప్రారంభించాలనుకున్నారు. అది దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ చౌరస్తా. సిగ్నల్ పడింది. వాహనాలన్నీ రోడ్డుపై నిలిచిపోయాయి. ఓ వ్యక్తి కొన్ని ఇన్‌స్టిట్యూట్లకు సంబంధించిన పాంప్లేంట్స్ పంచుతున్నాడు. అందరిలాగే అతడి దగ్గర పాంప్లెంట్ తీసుకున్నారు కృష్ణచైతన్య. ఆ నంబర్‌కు ఫోన్ చేసి నేను ఆప్టిట్యూడ్ క్లాసెస్ చెప్తాను. నాకు ఒక్క అవకాశం ఇవ్వండి అనడిగారు. ఇలా దాదాపు రెండు వందల ఇన్‌స్టిట్యూట్ల నంబర్లకు మెసేజ్‌లు పెట్టారు. కాల్ చేశారు. కొడుక్కు తెలియకుండానే అవకాశం ఇవ్వాలని తల్లిదండ్రులు కూడా చాలా ఇన్‌స్టిట్యూషన్‌లను సంప్రదించారు. ''మీవోడికంటే బుద్ధిలేదు.. వయసులో పెద్దవారు మీకైనా కొంచెం జ్ఞానం ఉండాలె కదా. ఆయనకు అవకాశం ఇవ్వలేదని మిమ్మల్ని పంపించాడా.. గెట్ లాస్ట్'' అంటూ కోప్పడ్డారు.

### ఒక్క అవకాశం.. ఆశావాదం

ఒకరోజు దిల్‌సుఖ్‌నగర్‌లోని మరో ఇన్‌స్టిట్యూట్ నుంచి ఫోన్ కాల్. 'డెమో ఇవ్వాలి. అర్జెంట్‌గా రండి. మిగతా విషయాలు తర్వాత మాట్లాడుకుందాం' అని. సరే అని వెళ్లారు కృష్ణ చైతన్య. డెమో ఇచ్చారు. ఒక్క క్లాస్‌కు రూ. 125. కానీ డెమో విన్న తర్వాత రూ. 25 ఎక్కువ ఇస్తామన్నారు. అదనంగా ఇస్తామన్న ఆడబ్బులు ఆయనకు ఎంతో ఆనందాన్ని కలిగించాయి. ఆదివారాలు, సెలవు రోజులు పోను నెలకు తొమ్మిది వేలు. ఈ విషయం గురించి తెలిసిన వాళ్లకు ఫోన్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. 'లక్షలన్నీ ఊడ్చిపెట్టి.. వందల్లో సంపాదిస్తున్నావ్' అని కొందరు హేళన చేశారు. వారందరికీ సమాధానం చెప్పేరోజు తప్పక వస్తుందనుకున్నారు కృష్ణచైతన్యరెడ్డి. ఓ రోజు ఓ ఇన్‌స్టిట్యూట్‌లో క్లాస్ చెప్తుండగా విద్యార్థులు డల్‌గా ఉన్నారు. వారిని ఉత్తేజపర్చేందుకు ఓ కథ చెప్పారు. అలర్టయిన విద్యార్థులు కథను ఆసక్తిగా వింటున్నారు. ''కథలు చెప్పడానికి కాదు మీకు డబ్బులిచ్చేది'' అని ఆ ఇన్‌స్టిట్యూట్ యజమాని కోపంతో ఊగిపోతున్నాడు. కృష్ణచైతన్యరెడ్డి వెళ్లి గట్టిగా అతన్ని హత్తుకున్నారు.

> గతేడాది కృష్ణచైతన్యరెడ్డి, వంశీకృష్ణరెడ్డి బ్రదర్స్ 'తెలుగు స్టోరీస్ క్రియేట్ యు' చానెల్ ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు లక్షా యాభై వేల మంది సబ్‌స్క్రైబర్లు అయ్యారు. వేల మంది వీరి వీడియోలను షేర్ చేస్తుంటారు. అవన్నీ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ మోరల్ స్టోరీస్ విని ఎంతోమంది మంచి మార్గంలో నడుస్తున్నారు. మరెంతోమంది ఆత్మహత్య ఆలోచన నుంచి బయటపడుతున్నారు. జీవితంపై ఆశలూ పెంచుకుంటున్నారు. ఆరోజు బీఎన్ రెడ్డినగర్‌లో జ్యూస్ తాగుతుంటే 'మీ వల్లే బతికాను' అని అన్న వ్యక్తి కూడావీరు చెప్పిన కథలు వినే.

### ఆ సారే కావాలి!

ఇన్‌స్టిట్యూట్‌లో టీచింగ్ చేసేవారు ఇస్త్రీ బట్టలేసుకుంటారు. నీట్‌గా షేవ్ చేసుకుంటారు. ఫార్మల్ షూ వేసుకుంటారు. కొందరు టై కట్టుకుంటారు. మరికొందరు కోటు వేసుకుంటారు. కానీ కృష్ణ చైతన్యరెడ్డి తీరే వేరు. ఇంట్లో ఉన్నప్పుడు ఎలా ఉంటారో.. క్లాస్ చెప్పినప్పుడు కూడా అలాగే ఉంటారు. జీన్స్, టీ షర్టు, గడ్డంతో కనిపిస్తారు. కానీ ఎక్కడ అప్టిట్యూడ్ క్లాస్ చెప్పినా విద్యార్థులంతా ఫిదా అవుతూనే ఉంటారు. మొదటిసారి తన ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన ముగ్గురూ ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. తాను క్లాస్ చెప్పిన అనేక మంది సెటిలయ్యారు. ఎన్నో ఇన్‌స్టిట్యూట్‌లలో క్లాస్‌లు చెప్పారు కృష్ణచైతన్యరెడ్డి.

**'క్రియేట్ యూ'**

''కథలు చెప్పడానికి కాదు డబ్బులిచ్చింది'' గతంలో ఓ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకుడు కృష్ణచైతన్యరెడ్డితో అన్నమాట ఇది. ఈ మాట అన్న వ్యక్తి మరిచిపోయాడు. కానీ కృష్ణచైతన్య మర్చిపోలేదు. తన తమ్ముడితో కలిసి 2017 ఫిబ్రవరిలో 'తెలుగు స్టోరీస్ క్రియేట్ యు' అనే వెబ్ చానెల్ ప్రారంభించారు. అన్నదమ్ములిద్దరూ మోరల్ స్టోరీస్ చెప్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు 41 కథలు చెప్పారు. లక్షల్లో లైకులు, వేలల్లో షేర్‌లు పొందారు. వీటన్నింటి కంటే లక్షలాది మంది మదిలో నిలిచారు.

### ఆలోచింపజేసే..

కృష్ణచైతన్యరెడ్డి తమ్ముడు వంశీకృష్ణారెడ్డి. ఇద్దరూ కలిసి 'ఆలోచింపజేసే' అనే పుస్తకం రాశారు. వంశీకృష్ణారెడ్డి సైతం ఎన్నో ఇన్‌స్టిట్యూట్‌లలో డెమోలు ఇచ్చారు. కానీ అవేవీ ఫలించలేదు. తమనెందుకు యాక్సెప్ట్ చేయట్లేదో తెలుసుకున్నారు. దాదాపు 10 ఇన్‌స్టిట్యూట్‌లలో అవమానాలు ఎదుర్కొన్నారు. ఆ తర్వాత బోధనలో తన కంటూ ప్రత్యేకతను ఏర్పర్చుకున్నారు. 2016లో ఎల్బీనగర్‌లో 'క్రియేట్ యు' ఇన్‌స్టిట్యూట్ పెట్టారు. ప్రస్తుతం ఇక్కడ ఆఫీస్ మాత్రమే ఉంది. కృష్ణ చైతన్యరెడ్డి, వంశీకృష్ణరెడ్డి హైదరాబాద్‌లోని అన్ని కాలేజీల్లో అప్టిట్యూడ్, ఆటిట్యూడ్ క్లాసెస్ చెబుతున్నారు. గతంలో తమ తల్లిదండ్రుల్ని అవమానించిన ఓ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకుడు గతేడాది కృష్ణచైతన్యకు ఫోన్ చేశాడు. ''సార్ మా స్టూడెంట్స్ మీ క్లాసెస్ కావాలంటున్నారు. మీరు మా ఇన్‌స్టిట్యూట్‌లో క్లాస్ చెప్తారా. డబ్బులెంతైనా ఫరవాలేదు'' అన్నారు. ''సారీ సార్ ఏడాది వరకు డేట్స్ లేవు. కావాలంటే వచ్చే ఏడాది వచ్చి చెప్తాను.'' అని కృష్ణచైతన్యరెడ్డి సమాధానమిచ్చారు. ఇదంతా పక్కనే ఉండి విన్నారు తల్లిదండ్రులు.

**... పడమటింటి రవికుమార్**
📷 గడసంతల శ్రీనివాస్

## శుభ్రమైన గాలికోసం..



మొబైల్స్ తయారీ సంస్థ షియోమీ.. కొత్త ఎయిర్ ప్యూరిఫయర్‌ను రూపొందించింది. ఎంఐ ఎయిర్ ప్యూరిఫయర్ 2సీ పేరుతో భారత్‌లో విడుదల చేసింది. దీన్ని ఎంఐ హోం యాప్‌కు కనెక్ట్ చేసుకోవచ్చు. దీంతో ఇంట్లో గాలి నాణ్యతను పెంచుకోవచ్చు. అలాగే ఉష్ణోగ్రత, తేమను అదుపు చేయవచ్చు. ఈ ప్యూరిఫయర్ గాలిలో ఉండే దాదాపు అన్ని రకాల సూక్ష్మక్రిములను, ధూళికణాలను 99.37 శాతం వరకు తొలగిస్తుందని కంపెనీ పేర్కొంది. ఈ డివైజ్‌లో 360 డిగ్రీల కోణంలో తిరిగే నూతన ఫిల్టర్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పింది. ఇది అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఎంఐ ఆన్‌లైన్, హోం స్టోర్స్‌లో అందుబాటులో ఉంది. ధర రూ. 6499.

## గోనె సంచి తొడుక్కుందామా!



**యూత్ ఎప్పుడూ కొత్తదనాన్నే కోరుకుంటుంది. కొందరు ట్రెండ్ ఫాలో అయ్యేవాళ్లుంటారు. మరికొందరు ట్రెండ్ సెట్ చేసేవాళ్లు. నిత్య నూతనంగా ఉండే వాళ్లు ఎప్పుడూ వార్తల్లో కనిపిస్తూనే ఉంటారు. అంతే కొత్తగా ఆలోచిస్తున్నది వస్త్ర వ్యాపార రంగం.**

'వెరీ కంఫర్ట్' పేరుతో ఇటీవల ఓ ప్యాంటు మార్కెట్లోకి వచ్చింది. ఇది ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. గోనె సంచితో తయారు చేసిన ఈ ప్యాంటు ఖరీదు రూ.800 నుంచి 1500 వరకు ఉంది. ఇందులో వివిధ మోడల్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. బూట్ కట్, ప్యారలాల్, పెన్సిల్ ఫిట్.. ఇలా ఎన్నో రకాలుగా అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ఇవి ఢిల్లీలోని అతిపెద్ద మార్కెట్ అయిన హాథ్ మార్కెట్‌లో అందుబాటులో ఉన్నవి. అయితే ఈ గోనె సంచి ప్యాంటు సాధారణంగా రఫ్‌గా ఉంటుంది. అందుకని లోపలి వైపునకు కాటన్ క్లాత్ కుట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ''భవిష్యత్‌లో ఇవే ఫ్యాషన్'' అవుతాయేమో! అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

## ప్రభాస్‌తో అయితే ఓకే!



**మం**చులక్ష్మి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న 'ఫీట్ ఆఫ్ విత్ ది స్టార్స్' కార్యక్రమంలో ఆమె ఓ చిలిపి ప్రశ్న కాజల్‌ను అడిగింది. అదేంటంటే.. రామ్‌చరణ్, ఎన్టీఆర్, ప్రభాస్‌లలో ఎవర్ని చంపుతావు? ఎవరితో లేచిపోతావు? ఎవర్ని పెండ్లి చేసుకుంటావు? అనేవి ప్రశ్నలు. వాటికి 'రామ్‌చరణ్‌ను చంపేస్తా.. ఎన్టీఆర్‌తో లేచిపోతా.. ప్రభాస్‌ను పెండ్లి చేసుకుంటా' అని సమాధానం చెప్పింది కాజల్. ఈ ముగ్గురిలో ప్రభాస్‌కు మాత్రమే పెండ్లి కాలేదు కాబట్టి.. అతన్ని పెండ్లి చేసుకుంటానని చెప్పడం విశేషం. మరో ఇంటర్వ్యూలో తన పెళ్లి విషయంతోపాటు.. తనకు కాబోయేవాడు ఎలా ఉండాలో వివరించింది. ఇక కాజల్‌ను పెండ్లి చేసుకునే వ్యక్తి ఆమెను పువ్వుల్లో పెట్టుకొని చూసుకోవాలట. అంతే కాదు అతనికి దైవభక్తి ఎక్కువగా ఉండాలని చెప్పింది. ఎందుకంటే కాజల్‌కు కూడా దైవభక్తి ఎక్కువ. అందుకే 'నాకు కాబోయేవాడికి నాకన్నా ఎక్కువ దైవభక్తి ఉండాలి. అందులో ఏమాత్రం తగ్గకూడదు' అని చెప్పింది. కాజల్ అగర్వాల్ ఎక్కడ షూటింగ్‌కు వెళ్లినా చిన్న శివుడి విగ్రహాన్ని వెంట తీసుకెళ్తుందట.

---

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

**తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ)లో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది.**

### ఎన్ఐఆర్‌టీలో

**ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రిసెర్చ్ ఇన్ ట్యూబర్క్యులోసిస్ (ఎన్ఐఆర్‌టీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

NATIONAL INSTITUTE FOR RESEARCH IN TUBERCULOSIS

- **పోస్టులు-ఖాళీలు:** సైంటిస్ట్ సీ- 4, ప్రాజెక్ట్ టెక్నికల్ ఆఫీసర్-1, పీటీవో (సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్)-7, ప్రాజెక్ట్ టెక్నికల్ ఆఫీసర్- (మెడికల్ సోషల్ వర్క్)-1, ప్రాజెక్ట్ అసిస్టెంట్-2, ప్రాజెక్ట్ టెక్నీషియన్-21, డాటా ఎంట్రీ ఆపరేటర్-2, డ్రైవర్ కమ్ మెకానిక్-3, ఎంటీఎస్-1 తదితరాలు ఉన్నాయి.
- అర్హతలు, వయస్సు తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- ఇంటర్వ్యూలు అక్టోబర్ 30 నుంచి నవంబర్ 13 వరకు నిర్వహిస్తారు.
- **వెబ్‌సైట్:** http://www.nioh.org

## ఐఐఎస్‌టీలో పీహెచ్‌డీ



- **ప్రోగ్రామ్:** పీహెచ్‌డీ (జనవరి 2020)
- **విభాగాలు:** ఏరోస్పేస్ ఇంజినీరింగ్, ఏవియానిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఫిజిక్స్
- **వయస్సు:** 2019, నవంబర్ 11 నాటికి 35 ఏండ్లు మించరాదు.
- **అర్హతలు:** కనీసం 65 శాతం మార్కులతో ఇంజినీరింగ్/టెక్నాలజీలో మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** సీఎస్ఐఆర్-జేఆర్ఎఫ్ ఉన్నవారికి నేరుగా ఇంటర్వ్యూలు చేసి ఎంపిక చేస్తారు. జేఆర్ఎఫ్ లేనివారికి స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** నవంబర్ 11
- **రాతపరీక్ష తేదీ:** 2019, డిసెంబర్ 1
- **వెబ్‌సైట్:** https://www.iist.ac.in

### స్పీచ్ అండ్ హియరింగ్‌లో

**మైసూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**



- **పోస్టులు:** స్పీచ్ అండ్ హియరింగ్ టెక్నీషియన్-4, స్పీచ్ అండ్ హియరింగ్ అసిస్టెంట్-2 ఖాళీలు ఉన్నాయి.
- ఈ పోస్టులు ముంబై, లక్నో, షిమ్లా, కలబుర్గి, రాంచీ కార్యాలయాల్లో ఉన్నాయి.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** నవంబర్ 11
- **వెబ్‌సైట్:** www.aiishmysore.in

### రైల్ వీల్ ఫ్యాక్టరీలో అప్రెంటిస్

**రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన యలహంక (బెంగళూరు)లోని రైల్ వీల్ ఫ్యాక్టరీలో అప్రెంటిస్ కోసం ప్రకటన విడుదలైంది.**

- అప్రెంటిస్
- **మొత్తం ఖాళీలు:** 192
- **విభాగాలవారీగా ఖాళీలు:** ఫిట్టర్-85, మెషినిస్ట్-31, మెకానిక్ (మోటారు వెహికిల్)-08, టర్నర్-05, సీఎన్‌సీ ఆపరేటర్-23, ఎలక్ట్రీషియన్-18, ఎలక్ట్రానిక్ మెకానిక్-22.
- **అర్హతలు:** పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ/ఎన్‌సీవీటీ సర్టిఫికేట్ ఉండాలి.
- **వయస్సు:** నవంబర్ 15 నాటికి 15-24 ఏండ్ల మధ్య ఉండాలి.



- **ఎంపిక విధానం:** పదోతరగతి/ఐటీఐలో మెరిట్ ఆధారంగా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** నవంబర్ 15
- **వెబ్‌సైట్:** www.rwf.indianrailways.gov.in

# టిప్పు సుల్తాన్ పాఠ్యాంశాల తొలగింపుపై నివేదిక ఇవ్వండి



### రాష్ట్ర పాఠ్యపుస్తకాల డ్రాఫ్టింగ్ సొసైటీకి కర్ణాటక విద్యామంత్రి లేఖ

**బెంగళూరు, అక్టోబర్ 29:** పాఠ్యపుస్తకాల నుంచి టిప్పు సుల్తాన్‌కు సంబంధించిన పాఠ్యాంశాలను తొలగించడంపై కర్ణాటక రాష్ట్ర పాఠ్యపుస్తకాల డ్రాఫ్టింగ్ సొసైటీకి ఆ రాష్ట్ర ప్రాథమిక, మాధ్యమిక విద్యాశాఖ మంత్రి సురేశ్‌కుమార్ లేఖ రాశారు. దీనిపై మూడు రోజుల్లోగా నివేదిక అందివ్వాలని అధికారులను మంత్రి ఆదేశించారు. టిప్పు సుల్తాన్ పాఠాలను చరిత్ర పుస్తకాల నుంచి తొలగించాలంటూ బీజేపీకి చెందిన ఎమ్మెల్యే అప్పచ్చు రంజన్ ప్రభుత్వానికి విజ్ఞప్తిచేయడంతో.. విద్యాశాఖ మంత్రి ఈ మేరకు నిర్ణయం తీసుకొన్నారు. ఎమ్మెల్యే అప్పచ్చు రంజన్‌తో మూడు రోజుల్లోగా సమావేశమై చర్చించాలని ఆ లేఖలో పాఠ్యపుస్తకాల డ్రాఫ్టింగ్ సొసైటీ ఎండీకి మంత్రి సురేశ్‌కుమార్ సూచించారు. టిప్పు జయంతి ఉత్సవాలను రద్దు చేస్తున్నట్టు కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన మూడు రోజులకే బీజేపీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ అంశంపై ఉత్తర కర్ణాటక జిల్లాలో ఉద్రిక్తత నెలకొన్న విషయం తెలిసిందే.

# ఢిల్లీలో మహిళలకు ఉచిత బస్సుప్రయాణం

### సదుపాయాన్ని వృద్ధులు, విద్యార్థులకు కూడా పొడిగించే యోచనలో ఆప్ ప్రభుత్వం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 29:** దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వ బస్సు సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం మంగళవారం నుంచి అమలులోకి వచ్చింది. ఇకపై మహిళలు ఢిల్లీలోని ప్రభుత్వ బస్సులు, క్లస్టర్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయొచ్చు. రక్షాబంధన్ వంటి పర్వదినం 'భాయ్ దూజ్'ను పురస్కరించుకొని మంగళవారం నుంచి అమలులోకి తీసుకొచ్చారు. మహిళల భద్రత కోసమే ఈ సేవలను ప్రారంభించామని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో వృద్ధులు, విద్యార్థులకు కూడా ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించడంపై యోచిస్తున్నట్టు వెల్లడించారు. ప్రభుత్వ, క్లస్టర్ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు గులాబీ రంగు టికెట్లు ఇస్తున్నారు. వీరి నుంచి డబ్బు మాత్రం తీసుకోరు. అయితే, వీటి కయ్యే మొత్తాన్ని ప్రభుత్వం ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌కు చెల్లిస్తుంది. అలాగే ప్రభుత్వ బస్సుల్లో



మహిళల భద్రత కోసం ప్రస్తుతమున్న మార్షల్స్ సంఖ్యను 13 వేలకు పెంచుతున్నట్టు సోమవారం కేజ్రీవాల్ ప్రకటించారు.





మంగళవారం ఢిల్లీలోని విజ్ఞానభవన్‌లో నిర్వహించిన కార్పొరేట్ సామాజిక బాధ్యత అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్. చిత్రంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్, సహాయమంత్రి అనురాగ్ ఠాకూర్ కూడా ఉన్నారు.

## కార్పొరేట్ సంస్థలు
# మరింత సేవచేయాలి

- సామాజిక బాధ్యతలో భాగంగా చేసే వ్యయాన్ని పెంచాలి
- సంపదను పంచితే గౌరవం పెరుగుతుంది
- రాష్ట్రపతి కోవింద్ సూచన

**న్యూఢిల్లీ, అక్టోబర్ 29:** సమాజంలోని అనాథలు, దివ్యాంగులను ఆదుకోవడానికి కార్పొరేట్ సంస్థలు మరింత చొరవ చూపాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సూచించారు. మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో తొలిసారిగా 'కార్పొరేట్ సామాజిక బాధ్యత' (సీఎస్ఆర్) అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్రపతి విజేతలకు అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనాథలను, దివ్యాంగులను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నప్పటికీ కార్పొరేట్ సంస్థలు కూడా తమ వంతుగా మరింత సాయం చేయాలని కోరారు. సంపదను దాచుకుంటే సమాజంలో గౌరవం పెరుగదని, ఆ సంపదను ఇతరులకు పంచడం వల్ల గౌరవ మర్యాదలు పెరుగుతాయని చెప్పారు. మనం చేసే సాయం చిన్నదైనప్పటికీ దీని వల్ల గొప్ప పేరు ప్రతిష్ఠలు వస్తాయని, ఈ పేరు ప్రతిష్ఠలు కార్పొరేట్ సంస్థలకు ఎంతగానో మేలు చేస్తాయని తెలిపారు. కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత వల్ల కొత్త ఆవిష్కరణలు కూడా వెలుగులోకి వస్తాయని రాష్ట్రపతి ఆశాభావం వ్యక్తం చేశారు. సామాజిక బాధ్యత అనేది భారతీయుల డీఎన్ఏలోనే ఉన్నదని, దీన్ని తొలి తరం పారిశ్రామికవేత్తలైన టాటా, బిర్లా, బజాజ్ తదితరులు పాటించారని గుర్తు చేశారు. 2030 నాటికి ప్రతి అనాథ బాలుడి సంరక్షణ ధ్యేయంగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కాగా, కార్పొరేట్ సంస్థలు తమ ఆదాయంలో కనీసం 2 శాతాన్ని సామాజిక సేవకు ఖర్చు పెట్టడాన్ని తప్పనిసరి చేస్తూ 2013-14లో కేంద్రం చట్టసవరణ చేసింది.

### కానిస్టేబుల్‌కు రాష్ట్రపతి పరామర్శ

అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. కార్యక్రమం ముగింపు సందర్భంగా జాతీయగీతాన్ని ఆలపిస్తుండగా వేదిక ఎదుట విధులు నిర్వర్తిస్తున్న ఓ మహిళా కానిస్టేబుల్ కాలు మడమ పట్టుతప్పడంతో ఒక్కసారిగా పడిపోయారు. కింద పడిన ఆమె కాసేపు అలాగే కూర్చున్నారు. జాతీయ గీతం పూర్తికాగానే రాష్ట్రపతి ఆమె వద్దకు వెళ్లి పరామర్శించారు. కాసేపు ఆమెతో మాట్లాడారు. అప్పుడు ఆయన వెంట కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్, సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ ఉన్నారు.



# బడబాగ్నిలో లాస్‌ఏంజిల్స్!

- ఇండ్లు విడిచి పరుగులు పెట్టిన హాలీవుడ్ స్టార్ హీరోలు, క్రీడాకారులు
- మిలియన్ల డాలర్ల విలాసవంతమైన విల్లాలు బూడిద
- 240 హెక్టార్ల ప్రాంతంలో విస్తరించిన కార్చిచ్చు
- మంటలను అదుపు చేయడానికి తీవ్రంగా శ్రమిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**లాస్‌ఏంజిల్స్, అక్టోబర్ 29:** అమెరికాలోని కాలిఫోర్నియా అడవుల్లో మొదలైన కార్చిచ్చు క్రమంగా లాస్‌ఏంజిల్స్‌ను తాకింది. లాస్‌ఏంజిల్స్ తో పాటు దాని శివారు ప్రాంతాల్లో దావానలం వ్యాపించింది. దీంతో అనేక విలాసవంతమైన విల్లాలు దగ్ధమయ్యాయి. హాలీవుడ్ నటీనటులు, ప్రముఖులు నివాసం ఉండే బ్రెంట్‌వుడ్ ప్రాంతం కూడా ఇక్కడే ఉంది. ఆదివారం అర్ధరాత్రి అగ్నికీలలు ఎగిసిపడటంతో ప్రముఖులు భయంతో ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. బాస్కెట్‌బాల్ సూపర్‌స్టార్ లిబ్రోన్ జేమ్స్, హాలీవుడ్ ప్రముఖ నటుడు ఆర్నాల్డ్ స్క్వార్జ్‌నెగర్ తమ ఇండ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లారు. లాస్‌ఏంజిల్స్‌లోని ప్రఖ్యాత మ్యూజియం జెట్టి సెంటర్‌ను కూడా మంటలు చుట్టుముట్టాయి. బలమైన గాలులు వీయడంతో బడబాగ్ని తీవ్రత మరింత ఉధృతమవుతున్నది. మంటల్ని అదుపు చేయడానికి వెయ్యి కంటే ఎక్కువ మంది అగ్నిమాపక సిబ్బంది సోమవారం తీవ్రంగా శ్రమించి మంటల్ని కొంతమేరకు అదుపులోకి తెచ్చారు. అయినప్పటికీ, అప్పటికే అగ్ని కీలల్లో చిక్కుకొన్న పలు ఇండ్లు దగ్ధమయ్యాయి. నగరంలోని పాఠశాలలు, ప్రముఖ రహదార్లను అధికారులు మూసివేశారు. ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. లాస్‌ఏంజిల్స్‌కి వ్యాపించిన మంటలు దాదాపు 240 హెక్టార్ల విస్తీర్ణంలోని ప్రాంతాల్ని బూడిద చేశాయి. దాదాపు 10,000 ఇండ్లపై అగ్ని కీలలు ప్రతాపం చూపే అవకాశమున్న నేపథ్యంలో రంగంలోకి దిగిన 1,100 అగ్నిమాపక సిబ్బంది మంటల్ని అదుపుచేయడానికి తీవ్రంగా శ్రమించారు. కార్చిచ్చు ప్రభావిత ప్రాంతాల్లో మిలియన్ల డాలర్లు విలువజేసే ప్రముఖుల ఇండ్లు కూడా ఉన్నాయి. ప్రముఖ బాస్కెట్‌బాల్ ప్లేయర్ లిబ్రోన్ జేమ్స్ ఇంటికి నిప్పంటుకోవడంతో తన భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి ఆయన బయటకు పరుగులు తీశారు. 'మా ఇంటికి నిప్పు అంటుకోవడం వల్ల నా కుటుంబంతో కలిసి ఇల్లు విడిచిపెట్టి బయటకి వచ్చాను. ప్రస్తుతానికైతే, మేము ఉండటానికి మాకు నివాసం దొరికింది' అని జేమ్స్ ట్వీట్ చేశారు. ప్రముఖ నటుడు, కాలిఫోర్నియా మాజీ గవర్నర్ ఆర్నాల్డ్ స్క్వార్జ్‌నెగర్ సహా పలువురు సినీ ప్రముఖులు కూడా ఇండ్ల నుంచి వెళ్లిపోయారు. 'మీ ఇంటి పరిసరాల్లో మంటలు వ్యాపించినట్టయితే, వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోండి' అని ఆర్నాల్డ్ స్థానికులను హెచ్చరించారు. కార్చిచ్చు కారణంగా ఆర్నాల్డ్ నటించిన కొత్త సినిమా 'టర్మినేటర్: డార్క్ ఫేట్' రెడ్ కార్పెట్ ప్రీమియర్ కార్యక్రమాన్ని నిర్వాహకులు రద్దు చేశారు. మంటల నుంచి తప్పించుకొని సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకుంటున్న వాళ్లకు ఆహారాన్ని అందిస్తామని ప్రముఖ హాలీవుడ్ చిత్ర నిర్మాణ సంస్థ పారామౌంట్ ప్రకటించింది. ప్రఖ్యాత జెట్టి మ్యూజియాన్ని కూడా బడబాగ్ని చుట్టుముట్టింది. అయితే, మ్యూజియంలోని కళాకృతులకు ఎలాంటి ప్రమాదం లేదని, వాటిని ఫైర్ రెసిస్టెంట్ సాంకేతికతతో భద్రపరిచామని అధికారులు తెలిపారు. గతవారం కాలిఫోర్నియా నగరానికి వ్యాపించిన పలు కార్చిచ్చులు ప్ర జా జీవితాన్ని అస్తవ్యస్తం చేశాయి. బడబాగ్ని ప్రభావంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సొనోమా, శాన్‌ఫ్రాన్సిస్కో నగరాల్లో సైతం కార్చిచ్చు ప్రభావం స్ప ష్టంగా కనిపిస్తున్నది. గతవారం చెలరేగిన ఈ కార్చిచ్చుధాటికి 100 చదరపు మైళ్ల విస్తీర్ణం లో మంటలు వ్యాపించాయి. మంటల్ని అదుపుచేయడానికి దాదాపు 3వేల మంది అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. నవంబర్ 7నాటికి మంటలు అదుపులోకి వచ్చే అవకాశం ఉన్నదని అధికారులు తెలిపారు.



బ్రెంట్‌వుడ్ ప్రాంతంలో హెలికాప్టర్ల ద్వారా మంటలను అదుపులోకి తీసుకొస్తున్న అగ్నిమాపక సిబ్బంది

# బెర్లిన్‌కు మంత్రి నిరంజన్‌రెడ్డి బృందం

- ఘనస్వాగతం పలికిన జర్మనీ ప్రతినిధులు
- విత్తనరంగ అభివృద్ధి, ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీపై అధ్యయనం



బెర్లిన్ విమానాశ్రయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి బృందానికి స్వాగతం పలుకుతున్న జర్మనీ ప్రతినిధులు. చిత్రంలో వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చెన్నమనేని రమేశ్, విత్తనాభివృద్ధిసంస్థ చైర్మన్, డైరెక్టర్ కోటేశ్వర్‌రావు, డాక్టర్ కేశవులు ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో విత్తనరంగ అభివృద్ధి కోసం అనుసరించాల్సిన విధానంపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బృందం మంగళవారం ఉదయం బెర్లిన్‌కు చేరుకున్నది. ఈ బృందానికి విమానాశ్రయంలో జర్మనీ ప్రతినిధులు సాదరస్వాగతం పలికారు. ఈ బృందంలో మంత్రితోపాటు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చెన్నమనేని రమేశ్, విత్తనాభివృద్ధిసంస్థ చైర్మన్, డైరెక్టర్ కొండబాల కోటేశ్వర్‌రావు, డాక్టర్ కేశవులు ఉన్నారు. ఇండో-జర్మన్ విత్తనరంగ సహకార ప్రాజెక్ట్ ద్వారా జర్మన్ ఆహార, వ్యవసాయ మంత్రిత్వశాఖ నుంచి అందిన ప్రత్యేకఆహ్వానం మేరకు ఈ బృందం పర్యటనకు వెళ్లింది. మంగళవారం నుంచి నవంబర్ 6 వరకు 8 రోజులపాటు జర్మనీ, నెదర్లాండ్స్ దేశాల్లో బృందం పర్యటించనున్నది. జర్మనీ, నెదర్లాండ్స్ దేశాల్లో విత్తనరంగ అభివృద్ధి, ఫుడ్‌ప్రాసెసింగ్ ఇండస్ట్రీ, వ్యవసాయరంగ పథకాలు, పంటలసాగు విధానాలు, వ్యవసాయరంగంలో సహకారసంఘాల వ్యవస్థపై వ్యవసాయశాఖ మంత్రి నేతృత్వంలో ప్రతినిధి బృందం అధ్యయనం చేయనున్నది.



# 190 రోజుల్లో 14 శిఖరాలు!

### నేపాలీ పర్వతారోహకుడు నిర్మల్ పుర్జా ప్రపంచ రికార్డు

**ఖాట్మండు, అక్టోబర్ 29:** ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 14 శిఖరాల్ని కేవలం 190 రోజుల్లోనే అధిరోహించి నేపాల్‌కు చెందిన ప్రముఖ పర్వతారోహకుడు నిర్మల్ పుర్జా సరికొత్త రికార్డు సృష్టించాడు. చైనాలోని శిశపంగ్మా శిఖరాన్ని మంగళవారం విజయవంతంగా అధిరోహించి పుర్జా ఈ అరుదైన రికార్డును నెలకొల్పాడని సెవెన్ సమ్మిట్ ట్రెక్స్ చైర్మన్ మింగ్మా షెర్పా తెలిపారు. 14 శిఖరాల్ని అధిరోహించిన ఈ రికార్డు గతంలో దక్షిణ కొరియా పర్వతారోహకుడు కిమ్ చాంగో హో పేరిట ఉండేది. 7 సంవత్సరాల, 10 నెలల, ఆరు రోజుల్లో చాంగో ఈ రికార్డు నెలకొల్పారు. అయితే, పుర్జా తాజా ప్రయత్నంతో చాంగో రికార్డును బద్దలుకొట్టాడు. 36 ఏండ్ల వయసున్న పుర్జా గతంలో బ్రిటన్ రాయల్ నేవీలో సైనికుడిగా పని చేశారు. పేదరికంలో మగ్గుతున్న నేపాలీ పిల్లల కోసం 'గో ఫండ్‌మీ' పేరుతో ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా 10 లక్షల అమెరికన్ డాలర్లను సేకరించడమే ధ్యేయంగా అయన తన ప్రయత్నాల్ని కొనసాగిస్తున్నారు. కాగా, గత ఏప్రిల్ 23న 'ప్రాజెక్ట్ పాసిబుల్ 14/7' పేరుతో 8 వేల మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో ఉన్న 14 శిఖరాల్ని అధిరోహించాలన్న లక్ష్యానికి పుర్జా అంకురార్పణ చేశారు. 8,091 మీటర్ల ఎత్తుగల అన్నపూర్ణ శిఖరాన్ని అధిరోహించి తన ప్రయాణాన్ని ప్రారంభించాడు. ఆ తర్వాత, ధౌలగిరి, కాంచన జంగ, ఎవరెస్టు, లోట్సే, మకాలు, నంగప్రభాత్, గషేర్ బ్రమ్ 1, గషేర్ బ్రమ్ 2, కే2, బ్రాడ్‌పీక్, చొ ఓయూ, మనస్లు, శిశపంగ్మా శిఖరాల్ని అధిరోహించారు. కాగా, ఎవరెస్టు శిఖరం మీద పర్వతారోహకుల రద్దీని తెలుపుతూ మే 25న పుర్జా తీసిన ఫొటో.. సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రాచుర్యంలోకి వచ్చింది.



భూకంపం ధాటికి సొమ్మసిల్లిన ఓ ఉద్యోగినికి సపర్యలు చేస్తున్న స్నేహితులు

# దక్షిణ ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం

- ఆరుగురి మృతి, పదుల సంఖ్యలో క్షతగాత్రులు
- రిక్టర్ స్కేల్‌పై 6.6 తీవ్రత నమోదు

**మనిలా, అక్టోబర్ 29:** ఫిలిప్పీన్స్‌లో మరోసారి భారీ భూకంపం వచ్చింది. రెండువారాల వ్యవధిలోనే రెండోసారి ప్రజలను భయకంపితులను చేసింది. దక్షిణ ఫిలిప్పీన్స్‌లో మంగళవారం భూకంపం ధాటికి ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో ప్రజలు గాయాలపాలయ్యారు. పాఠశాలల విద్యార్థులు భయంతో వణికిపోయారు. పలు భవనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రిక్టర్ స్కేల్‌పై భూకంపం తీవ్రత 6.6గా నమోదైంది. మిండానో ద్వీపంలోని పలు ప్రాంతాల్లో ఒక నిమిషం వరకు భూమి కంపించింది. ప్రజలతోపాటు కార్యాలయాలు, పాఠశాలలకు వెళ్లినవారు రోడ్లపైకి పరుగులు తీశారు. మెగ్‌సేసే ప్రాంతంలో భూకంపంధాటికి పాఠశాల గోడకూలి ఓ విద్యార్థి ప్రాణాలు కోల్పోగా, పలువురు విద్యార్థులు గాయపడ్డారు. సహాయక చర్యలు చేపడుతున్నామని, క్షతగాత్రులను దవాఖానలకు తరలించామని అధికారులు తెలిపారు. ఫిలిప్పీన్స్‌లో రెండువారాల కిందట 6.4 తీవ్రతతో వచ్చిన భూకంపానికి ఐదుగురు బలికాగా, పదుల సంఖ్యలో భవనాలు దెబ్బతిన్నాయి.

# నెల్లికల్ లిఫ్టు స్కీం మంజూరుకు కృషిచేస్తా

### రైతులకు శాసనమండలి చైర్మన్ గుత్తా హామీ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గపరిధిలో నెల్లికల్ లిఫ్టు స్కీంను ప్రభుత్వం ఏర్పాటుచేయనున్నట్టు ఇటీవల హుజూర్‌నగర్ బహిరంగసభలో సీఎం కేసీఆర్ స్వయంగా హామీ ఇచ్చారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పారు. నెల్లికల్ లిఫ్టు స్కీం, ప్రాజెక్టులో ముంపునకు గురైన ఇతర లిఫ్టు స్కీంలు త్వరితగతిన పూర్తయ్యేలా కృషిచేయాలని కోరుతూ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్యతోపాటు సాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి మండల ప్రజాప్రతినిధులు, రైతులు హైదరాబాద్‌లో మంగళవారం గుత్తాను కలిసి కోరారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయని, లిఫ్టు స్కీం త్వరితగతిన మంజూరయ్యేలా కృషిచేస్తానని హామీఇచ్చారు. నెల్లికల్ లిఫ్టు స్కీం ద్వారా 4,175 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఎర్రచెరువు తండా, పిల్లిగుండ్ల తండా, జాల్ తండా, మూల తండా, చెంచువానితండా, నెల్లికల్ గ్రామాల పరిధిలోని 1,254 మంది రైతులకు దీనిద్వారా ప్రయోజనం చేకూరుతుంది. ఈ లిఫ్టు స్కీం అంచనా వ్యయం రూ.82.90 కోట్లుకాగా.. అటవీ క్లియరెన్స్ కూడా వచ్చింది. ఈ విషయాలను గుత్తా సుఖేందర్‌రెడ్డి.. రైతులకు వివరించారు.

# ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా పోరాడుదాం

- ఐక్యంగా ఉద్యమించి సాధించుకుందాం
- మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య
- నవంబర్‌లో చలో ఢిల్లీ: పిడమర్తి రవి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎస్సీ రిజర్వేషన్ ఏ, బీ, సీ, డీ వర్గీకరణ అమలు లక్ష్యంగా ఐక్యంగా పోరాడి సాధించుకుందామని మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య పిలుపునిచ్చారు. 'మాదిగల సమగ్ర అభివృద్ధి కోసం ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ' అనే అంశంపై మంగళవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్లో నిర్వహించిన మాదిగ సంఘాలు, ప్రజాప్రతినిధుల సమావేశంలో రాజయ్య మాట్లాడారు. మాదిగ ఉద్యమ సంఘాలన్నీ ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అన్ని సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టి రిజర్వేషన్లు సాధించుకుందామని చెప్పారు. ఎమ్మెల్యేలు అబ్రహం, కాలె యాదయ్య మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ అమలు పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుకూలంగా ఉన్నదన్నారు. సీఎం కేసీఆర్ ఎస్సీ రిజర్వేషన్‌పై అసెంబ్లీలో తీర్మానంచేసి కేంద్రానికి ప్రతిపాదనలు పంపారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి పేర్కొన్నారు. ఈ అంశంపై కేంద్రం దృష్టి పెట్టడంలేదని, కేంద్రం మెడలు వంచి రిజర్వేషన్ సాధించుకోవాలని కోరారు. నవంబర్‌లో పార్లమెంట్ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో.. అన్ని సంఘాల ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. సమావేశంలో మాదిగ సంఘాల నాయకులు రాయకంటి రాందాస్, యాతాకుల భాస్కర్, ఇటుక రాజు, సింగిరెడ్డి పరమేశ్వర్, కోళ్ల వెంకటేశ్, ముత్యపాగ నర్సింగరావు, కొడారి వినాయకరావు, బొల్లికొండ వీరేందర్, మైస ఉపేందర్, ఏపీ ప్రతినిధులు దండు వీరయ్య, పేరపోగు వెంకటేశ్వర్‌రావు, ఆర్జే ప్రకాశ్, మాదిగ జేఏసీ, టీఎస్ఎమ్మార్పీఎస్, టీఎమ్మార్పీఎస్, మహా ఎమ్మార్పీఎస్, ఎంహెచ్‌పీఎస్, మాదిగ విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎస్సీ వర్గీకరణపై నిర్వహించిన సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు రాజయ్య, అబ్రహం, కాలె యాదయ్య, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి తదితరులు

### సీఎస్, డీజీపీతో మేజర్ జనరల్ ఆర్కేసింగ్ భేటీ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సబ్ ఏరియా(టీఏఎస్ఏ) జనరల్ ఆఫీసర్ కమాండెంట్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మేజర్ జనరల్ ఆర్కే సింగ్ మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషిని ఆయన కార్యాలయంలో కలిశారు. అనంతరం డీజీపీ కార్యాలయంలో డీజీపీ ఎం మహేందర్‌రెడ్డితో సమావేశమయ్యారు. మాజీ సైనికుల సంక్షేమం, మిలిటరీ, సామాన్యులకు సంబంధించిన అంశాలు, భద్రతాపరమైన విషయాలపై ఆర్కేసింగ్ వారితో చర్చించినట్టు తెలిసింది.

# స్మార్ట్‌ఫోన్ ఆర్డర్ చేస్తే.. రాళ్ల ప్యాకెట్ వచ్చింది

### పశ్చిమబెంగాల్‌లో బీజేపీ ఎంపీకి చేదు అనుభవం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 29:** పశ్చిమబెంగాల్‌లోని 'మాల్దా నార్త్' బీజేపీ పార్లమెంట్ సభ్యుడు ఖాగెన్ ముర్ముకు ఆన్‌లైన్ సంస్థ నుంచి చేదు అనుభవం ఎదురైంది. ఇటీవల ఆయన ఒక ఈ-కామర్స్ సంస్థలో శామ్‌సంగ్ స్మార్ట్‌ఫోన్ కోసం ఆర్డర్ చేశారు. సోమవారం ఆ సంస్థ నుంచి ఎంపీ ఇంటికి ఒక ప్యాకెట్ వచ్చింది. తెరిచి చూస్తే దాంట్లో పాలరాతి ముక్కలు ఉన్నాయి. దీనిపై ఖాగెన్ ముర్ము స్పందిస్తూ 'నేను శామ్‌సంగ్ ఫోన్ కోసం ఆర్డర్ చేశా. కానీ శామ్‌సంగ్‌కు బదులు రెడ్‌మీ 5ఏ బాక్స్ వచ్చింది. దాన్ని తెరిచి చూస్తే పాలరాతి ముక్కలు కనిపించడంతో ఆశ్చర్యపోవడం నావంతైంది' అని చెప్పారు. ప్యాకేజీ వచ్చిన సమయంలో ముర్ము ఇంటి వద్ద లేకపోవడంతో ఆయన భార్య రూ.11,999 నగదు చెల్లించి ప్యాకెట్ తీసుకున్నారు. ఆ ప్యాకేజీ తెరిచిన తర్వాత రాళ్ల ముక్కలు చూసి దిగ్భ్రాంతికి గురయ్యానని ఖాగెన్ ముర్ము చెప్పారు. తాను ఇంతకుముందెప్పుడూ ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేయలేదని, అంతా తన కొడుకు చూసుకునేవాడని ఖాగెన్ ముర్ము తెలిపారు. తొలిసారి ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన తనకు చేదు అనుభవం మిగిలిందని, దీనిపై సంబంధిత కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేస్తానని చెప్పారు. ఈ ఘటనపై ఫిర్యాదు నమోదు చేశామని, తగిన చర్య తీసుకుంటామని మాల్దా పోలీసు అధిపతి పేర్కొన్నారు.

# పౌరసరఫరాల్లో బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ

- గోనె సంచుల దుర్వినియోగానికి చెక్
- సిద్దిపేట, గజ్వేల్‌లో ప్రయోగాత్మకంగా అమలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అత్యాధునిక సాంకేతికతను వినియోగించడంలో ఇతర విభాగాలకంటే ముందున్న పౌరసరఫరాల శాఖ మరో అడుగు ముందుకేసింది. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీని వినియోగించి గోనె సంచుల దుర్వినియోగానికి చెక్ పెట్టాలని నిర్ణయించింది. ధాన్యం రవాణా, ప్రజాపంపిణీ, గోనె సంచుల వినియోగంలో ఎలాంటి అవకతవకలు, అక్రమాలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు ఈ అత్యాధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని చర్యలు చేపట్టింది. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడానికి సమాయత్తమైంది. త్వరలో బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నది. ఈ విధానంలో పౌరసరఫరాల సంస్థకు చెందిన గోనె సంచులు ఎక్కడా దుర్వినియోగం కాకుండా ప్రతి సంచికి బార్‌కోడింగ్‌ను ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతి గన్నీ బ్యాగుకు క్యూఆర్ కోడ్ ట్యాగ్‌ను అటాచ్‌చేస్తారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్‌ఫోన్ ద్వారా స్కాన్‌చేసి వచ్చిన సమాచారాన్ని ఐటీఈ అండ్ సీ సర్వర్‌లో నిక్షిప్తంచేస్తారు. ఈ విధానాన్ని దేశంలోనే మొదటిసారి మన రాష్ట్రంలో అమలులోకి తెస్తుండటం విశేషం. సిద్దిపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో, గజ్వేల్‌లోని ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఈ వానకాలం పంటల కొనుగోలులో ప్రయోగాత్మకంగా ప్రారంభిస్తామని పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ మంగళవారం తెలిపారు. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా గోనె సంచుల వివరాలను ఎవరూ మార్చకుండా ఉండటానికి వీలుటుందని చెప్పారు. సంచులు ఎక్కడ, ఏ గోదాముల్లో, ఏ జిల్లాల్లో ఉన్నాయి.. వంటి వివరాలు శాఖ వద్ద ఉంటాయని వివరించారు. గోనె సంచులను ఎన్నిసార్లు ఉపయోగించారనే వివరాలు కూడా తెలుస్తాయన్నారు. గోనె సంచులను ఉపయోగించే ప్రతి సందర్భంలో స్కాన్‌చేసి వివరాలు పొందుపరుస్తామని, తద్వారా గోనె సంచుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుందని తెలిపారు.





క్యూఆర్ కోడ్ ఉన్న గోనె సంచులు

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
బుధవారం 30 అక్టోబర్ 2019

# పోలీస్ దర్బార్



రజనీకాంత్

దక్షిణాది తెరపై ఓ సమ్మోహనాస్త్రం రజనీకాంత్. ఏడుపదుల వయసుకు చేరువవుతున్నా సినిమా పట్ల ఆయన కమిట్‌మెంట్‌లో ఏ మాత్రం మార్పురాలేదు. నేటికీ స్టైల్‌కి చిరునామాగా భాసిల్లుతున్నారు. మురుగదాస్ దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న తాజా చిత్రం 'దర్బార్'. నయనతార కథానాయిక. ఈ సినిమాలో రజనీకాంత్ పోలీస్ అధికారి పాత్రలో కనిపించబోతున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత రజనీకాంత్ పోలీస్ పాత్ర చేయడం విశేషంగా చెబుతున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరిలో విడుదల చేయబోతున్నారు. దీపావళి సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో రజనీకాంత్ సరికొత్త లుక్స్‌తో , మరింత స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. చేతిలో తుపాకి పట్టుకొని తనదైన శైలి బాడీలాంగ్వేజ్‌తో ఆయన దర్శనమిస్తున్నారు. ఈ స్టిల్ రజనీ అభిమానుల్ని ఉర్రూతలూగిస్తున్నది. సోషల్‌మీడియాలో ఈ పోస్టర్ వైరల్‌గా మారింది. తిరుగులేని స్టార్‌డమ్, స్టైల్‌కు కేరాఫ్ అడ్రస్ రజనీయే అంటూ అభిమానులు ఉప్పొంగిపోతున్నారు. తండ్రీకూతురు సెంటిమెంట్, మాఫియా అంశాల నేపథ్యంలో సాగే యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రమిదని చెబుతున్నారు.

# ముచ్చటగా మూడోసారి

సుభాష్‌చంద్రబోస్, గోపాలగోపాల చిత్రాల్లో వెంకటేష్‌తో జోడీకట్టింది శ్రియ. ఈ సినిమాల్లో వారిద్దరూ తమ కెమిస్ట్రీతో ఆకట్టుకున్నారు. ముచ్చటగా మూడోసారి వీరి కలయిక వెండితెరపై ఆవిష్కృతం కాబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ధనుష్ కథానాయకుడిగా నటించిన తమిళ చిత్రం 'అసురన్' విమర్శకుల ప్రశంసలతో పాటు కమర్షియల్‌గా పెద్ద విజయాన్ని సాధించింది. వెంకటేష్ హీరోగా ఈ సినిమా తెలుగులో రీమేక్ కానున్నది. ఇందులో వెంకటేష్ భార్య పాత్రలో శ్రియ నటించబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కథ, తన పాత్రకున్న ప్రాధాన్యత నచ్చడంతో శ్రియ ఈ రీమేక్‌లో నటించడానికి సుముఖతను వ్యక్తంచేసినట్లు చెబుతున్నారు. ఈ సినిమాలో తండ్రీకొడుకులుగా వెంకటేష్ ద్విపాత్రాభినయం చేయబోతున్నట్లు సమాచారం. సురేష్ ప్రొడక్షన్స్, వి క్రియేషన్స్ పతాకాలపై సురేష్‌బాబు, కలైపులి ఎస్. థాను ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.



శ్రియ

## కల్యాణ్‌రామ్ కొత్త చిత్రం



కల్యాణ్‌రామ్

'118' థ్రిల్లర్‌తో విజయాన్ని అందుకున్నారు కల్యాణ్‌రామ్. ఈస్ట్‌కోస్ట్ ప్రొడక్షన్స్ సంస్థ ఆ చిత్రాన్ని నిర్మించింది. ఇప్పుడు అదే కాంబినేషన్‌లో మరో సినిమా రాబోతుంది. నిర్మాత మహేష్ కోనేరు చిత్ర విశేషాలు తెలియజేస్తూ ''విజిల్' చిత్రాన్ని దీపావళి కానుకగా రెండు తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేశాం. ఈ చిత్రం చక్కటి వసూళ్లను సాధిస్తున్నది. కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా మా సంస్థలో మరో సినిమా రూపొందించబోతున్నాం. వినూత్న కథ, కథనాలతో తెరకెక్కించబోయే ఈ సినిమా వివరాల్ని త్వరలో తెలియజేస్తాం' అన్నారు.

# త్రిష యాక్షన్



త్రిష

మూడు పదుల వయసు దాటినా త్రిష జోరు ఏ మాత్రం తగ్గడం లేదు. నవతరం తారలతో పోటీపడుతూ వైవిధ్యమైన కథాంశాలతో సినిమాలు చేస్తున్నది. ఆమె కథానాయికగా తెరకెక్కుతున్న తాజా తమిళ చిత్రం 'రాంగి'. విదేశీ నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్ ఇతివృత్తంతో ఈ సినిమా రూపొందుతున్నది. దీపావళి సందర్భంగా చిత్రబృందం ఆమె కొత్త పోస్టర్‌ను విడుదలచేసింది. బ్లూ టీషర్ట్‌లో తీక్షణమైన చూపులతో శక్తివంతంగా త్రిష ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నది. ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నది. ఇటీవలే ఉజ్బెకిస్థాన్‌లో త్రిషపై ఛేజింగ్ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రబృందం తెరకెక్కించింది. పెంకితనం, ధైర్యసాహసాలు మెండుగా కలిగిన యువతిగా కనిపిస్తున్నది. పోలీస్ అధికారిణిగా, ఖైదీగా భిన్న పార్శ్వాల్లో ఆమె పాత్ర సాగుతుందని చిత్రబృందం చెబుతున్నారు. ఈ సినిమా కోసం బైక్‌రైడింగ్‌తో పాటు యుద్ధవిద్యల్లో త్రిష శిక్షణ తీసుకుందని, డూప్‌లు లేకుండా ఆమెపై తెరకెక్కించిన పోరాట ఘట్టాలు అలరిస్తాయని అంటున్నారు. ప్రముఖ దర్శకుడు మురుగదాస్ ఈ సినిమాకు కథను అందించారు. 'జర్నీ' ఫేమ్ శరవణన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.

## మలయాళం రీమేక్‌లో..

'మళ్లీరావా' చిత్రం తర్వాత సుమంత్ నటించిన సినిమాలేవి ఆశించిన ఫలితాన్ని రాబట్టుకోలేకపోయాయి. ఆయన తాజా చిత్రానికి రంగం సిద్ధమైంది. గత ఏడాది మలయాళంలో విజయం సాధించిన 'పాదయోట్టం' సినిమా ఆధారంగా సుమంత్ కొత్త చిత్రం తెరకెక్కనుంది. గ్యాంగ్‌స్టర్ కామెడీ డ్రామాగా రూపొందించనున్న ఈ చిత్రానికి వినుయజ్ఞ దర్శకత్వం వహిస్తారు. ఈ సినిమా ద్వారా ఐమా అనే కొత్త నాయిక పరిచయం కానుంది. డిసెంబర్ 15న రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతారు. ఈస్ట్ ఇండియా టాకీస్, ది మంత్ర ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై తమ్మినేని జనార్థన్ రావు, శర్మ చుక్క ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మించనున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు.



సుమంత్

## ఎగ్జిట్ లేని ప్రయాణం



ప్రిన్స్, అవంతిక, రుతుజా, తారకరత్న

తారకరత్న, ప్రిన్స్, అవంతిక, రుతుజా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'యస్ 5– నో ఎగ్జిట్' చిత్రం మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. సన్ని కోమలపాటి దర్శకుడు. గౌతమ్ కంటిపూడి, రాహుల్ రెడ్డి నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత సి.కల్యాణ్ క్లాప్‌నిచ్చారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఎంట్రీ తప్ప ఎగ్జిట్ లేని ప్రయాణం కొందరు యువతీయువకుల జీవితాల్ని ఎలాంటి మలుపులు తిప్పిందన్నది ఆసక్తిని రేకెత్తిస్తుంది. మంగళవారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. సింగిల్ షెడ్యూల్‌లో సినిమాను పూర్తిచేస్తాం. డిసెంబర్‌కు ఫస్ట్‌కాపీ సిద్ధమవుతుంది' అని తెలిపారు. మణిశర్మ సంగీతం, అంజి ఛాయాగ్రహణం ఈ సినిమాకు ప్రధానాకర్షణగా నిలుస్తాయని, భిన్నమైన కథాంశంతో ఆద్యంతం థ్రిల్‌ను పంచుతుందని తారకరత్న పేర్కొన్నారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపొందించనున్న చిత్రమిదని ప్రిన్స్ అన్నారు. హాలీవుడ్‌లో 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్' సినిమాలకు వాడే రెడ్ రేంజర్ విస్టా కెమెరాతో రూపొందించనున్న తొలి ఇండియన్ సినిమా ఇదని నిర్మాతలు చెప్పారు. అలీ, సాయికుమార్, రఘుకారుమంచి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం:మణిశర్మ.

## ప్రేమసమరం



పూరి జగన్నాథ్, రాజు, ఆది

'ఆది నా దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా చాలా సంవత్సరాలు పనిచేశాడు. దర్శకుడిగా ఈ చిత్రం అతడికి చక్కటి శుభారంభాన్ని అందించాలి' అని అన్నారు పూరిజగన్నాథ్. రాజ్, షా జంటగా నటిస్తున్న చిత్రం 'రణస్థలం'. ఆది అరవల దర్శకుడు. కావలి రాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో దర్శకుడు పూరి జగన్నాథ్ విడుదలచేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మాట్లాడుతూ 'పక్కా కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. ప్రేమపయనంలో ఓ ఆటోడ్రైవర్‌కు ఎదురైన పరిణామాలు ఆకట్టుకుంటాయి' అని తెలిపారు. నవంబర్ నెలాఖరున ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు నిర్మాత చెప్పారు. సత్యంరాజేష్, ఛత్రపతి శేఖర్, రాగిణి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం:రాజకిరణ్.

## ఉత్కంఠతో 'బ్లాక్‌బోర్డ్'



శిరీషారావ్, సాయికృష్ణ

తల్లాడ సాయికృష్ణ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'బ్లాక్‌బోర్డ్'. తల్లాడ శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. శిరీషారావ్ కథానాయిక. ఈ సినిమా ట్రైలర్‌ను ఇటీవల హీరో ప్రిన్స్ విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ట్రైలర్ ఆసక్తికరంగా ఉంది. నటుడిగా, దర్శకుడిగా సాయికృష్ణ ప్రతిభను చాటుకున్నారు' అని తెలిపారు. సాయికృష్ణ మాట్లాడుతూ 'సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. ఖమ్మంలో సినిమాను చిత్రీకరించాం. ఇందులో నేను ద్విపాత్రాభినయం చేశాను. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. త్వరలో విడుదల తేదీని వెల్లడిస్తాం' అని చెప్పారు. మాస్‌తో పాటు క్లాస్‌ను ఆకట్టుకునే నవ్యమైన చిత్రమిదని తుమ్మలపల్లి రామసత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో తల్లాడ శ్రీనివాస్, సయ్యద్, రాధాకృష్ణ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.




